# కథామంజరి

## పది కథల సమాహారం



మే 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

**మే 2025**

సంపుటి : 6 ♦ సంచిక : 5



# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నందూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి




## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i

విశిష్ట అతిథి ... ... ... ... ... ... ii

కథా మార్గదర్శి ... ... ... ... ... ... iv

కథా పరిచయం ... ... ... ... ... ... vi

వినదగునెవ్వరు చెప్పిన.. ... ... ... ... ... ... ix

కథాపుస్తక పరిచయం ... ... ... ... ... ... xi


## కథలు, వ్యాసాలు


వృద్ధం శరణం గచ్ఛామి ... డా. కాలువ మల్లయ్య ... ... 1

దశమగ్రహం ... గండ్రకోట సూర్య ... ... ... 10

మానవత్వం ఖరీదు ... భాగవతుల సత్యనారాయణమూర్తి ... 16

కిటికీ ... ఎస్.వి.ఎమ్. నాగగాయత్రి ... ... 21

పారిజాతం కథ ... వెంకటమణి ... ... ... 27

పడిలేచిన కెరటం ... యస్వీ కృష్ణ ... ... ... 33

కుందేలు విందు ... కూచిమంచి నాగేంద్ర ... ... 38

బుద్ధి వచ్చిన నక్క ... నారంశెట్టి ఉమామహేశ్వరరావు ... 40

ఇల్లు చూసి వెళ్ళవోయ్! ... నవులూరి వెంకటేశ్వర రావు ... ... 42

గుడ్డిపిల్ల ... కీ. శే. అడివి బాపిరాజు ... ... 50


Cover Page Credits : Ellie Burgin, Exmouth (Devon), UK

# కథాకీయం

ఈ మధ్య కథాంశాల మీద మిత్రులతో సంభాషణ చాలా ఆసక్తికరంగా జరిగింది. నిజానికి ఏవో మాట్లాడుకుంటున్నప్పుడు.. కాకతాళీయంగా ఈ విషయం మాటల మధ్య చోటుచేసుకుంది. ఆ మిత్రుల్లో రచయితలున్నారు, పాఠకులున్నారు, ఇవి రెండూ కానివాళ్ళు కూడా ఉన్నారు. నిజానికి వారు వ్యక్తపరిచిన విషయాల్లో చాలా విలువైనవి, ఆచరణయోగ్యమైనవి ఉన్నాయి.

ఓ మూడు దశాబ్దాల క్రిందట తెలుగు కథాంశాల మీద ఓ పెద్దాయన మాట్లాడుతూ.. 'కుటుంబ వ్యవస్థ ఉన్నంత వరకు కథాంశాలకి కొరత ఉండదు' అని అన్నారు. ఇది నిజం! అక్షయపాత్రలా కథాంశాలు వస్తూనే ఉన్నాయి. కాని ఇక్కడో విషయం గ్రహించవలసివుంది. ఓ నాలుగు ఐదు దశాబ్దాల క్రిందట సమాజంలో ఉన్న పరిస్థితులు వేరుగా ఉండేవి. ప్రజలు, సమస్యలు, బంధాలు, సాంఘిక విషయాలు, పరిస్థితులు.. ఇలా అన్ని విషయాల మీద కథలు వచ్చాయి. తర్వాత.. కాలమాన పరిస్థితులు చాలా త్వరితగతిన మారిపోయాయి. ఓ రకంగా విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుని, మనిషి జీవితం ఎక్కడికో వెళ్ళిపోయింది. ఎన్నో కొత్త విషయాలు, కొత్త సమస్యలు పుట్టుకొచ్చాయి. దానికి తోడు సాంకేతికంగా పెను మార్పులు వచ్చి, యావత్ ప్రపంచం మారిపోయింది. వ్యవస్థల్లో కూడా మార్పులు వచ్చాయి. మనుషులు కూడా మారిపోయారు. జీవనశైలి, సరళి అన్నీ మారిపోయాయి. అవసరాలు మారిపోయాయి. 'అయినా సరే.. ఇంకా కథ పాతగానే కనబడుతున్నది' అనే మాట వినబడుతోంది. కూలిపోతున్న కుటుంబ వ్యవస్థ మీద కథలు వస్తున్నాయి. సమకాలీన రాజకీయవ్యవస్థ మీద వస్తున్నాయి. సాంకేతిక పరిజ్ఞాన విషయాలు కథనాల్లో కనబడుతున్నాయి. కాని.. కవి, రవిలకు కనబడని ఎన్నో కొత్త విషయాలు, సమస్యలు ఈ రోజు చోటు చేసుకున్నాయి! కొత్తగా పుట్టుకొచ్చిన ఆర్థిక సమస్యలు, అన్ని రంగాల్లో కనబడుతున్న పోటీ ధోరణులు, మారిపోయిన మనుషుల ఆలోచనల నుంచి విద్య, వైద్య, వ్యాపారం, యుద్ధాలు, ఆందోళనలు, హరించుకుపోతున్న స్వేచ్ఛ... ఇలా ఎన్నో కొత్త కొత్త విషయాలు, సమస్యలు ఇప్పుడు కనబడుతున్నాయి! వీటి మీద కథలు రావడంలేదనే మాట గట్టిగా వినబడుతోంది. వచ్చినా.. ఎక్కడో అరకొరగా వచ్చి జనంలోకి రావడం లేదేమో కూడా!

అయితే.. సమకాలీన సమస్యల మీద కథలు రాయాలంటే.. ఖచ్చితంగా వాటి మీద అవగాహన అరవై దాటిన రచయితలలో పూర్తిగా ఉండకపోవచ్చును. యువతలో ఆ విషయాల మీద అవగాహన, పరిజ్ఞానం ఉంటాయి! వాళ్ళే కలం పట్టుకుని రాయాలి! అవే నేటి కథకి ఊపిరినిస్తాయి! ఇటీవల కాలంలో, యువరచయిత శ్రీ రవి మంత్రి వ్రాసిన "అమ్మ డైరీలో కొన్ని పేజీలు.." నవల అనూహ్యమైన ఆదరణ పొందింది. లక్షల్లో కాపీలు అమ్ముడయ్యాయి అంటే.. యువత చేతిలో కలం పరుగుపెడితే తెలుగు కథకి వైభవం తప్పకుండా వచ్చి తీరుతుందని చెప్పొచ్చు!

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

## శ్రీ నవులూరు వెంకటేశ్వరరావు

మనలో ఉండే కొన్ని గుణాల గురించి మాట్లాడుకుంటున్నప్పుడు "పూర్వజన్మ సుకృతం" అని అనుకుంటాం! పూర్వజన్మ ఉందా లేదా.. అనే విషయాన్ని పక్కన పెట్టి.. అసలు మన పూర్వీకుల వలన ఆయాగుణాలు వచ్చాయనే విషయం మీద శాస్త్రీయ పరిశోధనలతో పాటూ ప్రత్యక్షంగా కనబడే ఋజువులు కూడా ఉన్నాయి. సైన్స్‌లో 'జీన్స్' అంటాం! అసలు మన కుటుంబం, వంశం గురించి వెనుకనున్న చరిత్రని చూస్తే.. ఖచ్చితంగా ఎక్కడో అక్కడ.. ఎవరో ఒక మన పూర్వీకుల లక్షణం మన దగ్గర కనబడుతుంది. అది మంచి కావొచ్చు, చెడు కూడా కావొచ్చు! బాల్యంలో ఈ విషయాల మీద బొత్తిగా అవగాహన ఉండదు గాని, అప్పుడు తల్లి తరుచుగా వల్లించే ఓ చాటువును రోజూ విని విని.. దాని పుట్టుపూర్వోత్తరాలు వెతికి తీస్తే.. 230 సంవత్సరాల క్రితం వెంకటగిరి రాజా వారి సంస్థానంలో ఉన్న కవి మోచర్ల దత్తప్ప వ్రాసినదనే విషయం, తన తల్లి ఆ వంశంలోనే నాల్గవ తరానికో ఐదవ తరానికో చెందినదే అని తెలియడం.. ఓ బాలుడ్ని అబ్బురపరిచాయి. ఆ విషయం అతడ్ని సాహిత్యం మీదకు ఉసికొల్పింది. అంతేకాదు.. పుస్తకపఠనం దినచర్య అయిపోయింది. ఆ వయసులో స్కూలుకి వెళ్తూ, దారిలో కనబడే గ్రంథాలయాల్లో దూరి, వయసుకు మించిన పుస్తకాలు చదివేసారు. వయసు పెరిగిన కొలదీ, ఆ పుస్తక పఠనాశక్తి పెరిగి, కనబడిన ఆంధ్ర, ఆంగ్ల పుస్తకాల్ని చదివారు. ఆ తర్వాతే కలం పట్టి, రాసిలో కాకుండా వాసిలో విలువైన కథలు, నవలలు రచించి, వంశపారంపర్య వైభవాన్ని కొనసాగించిన గొప్ప బాలుడే నేటి ప్రముఖ కథారచయిత శ్రీ నవులూరు వెంకటేశ్వరరావు గారు!

ఐదు దశాబ్దాల పైచిలుకుగా రచనా వ్యాసంగం చేస్తున్నా.. ఆయన వ్రాసినవి అరవై కథలు కూడా మించలేదు. అంటే ఒక కథ వ్రాయడానికి ఎంత మేధోమథనం జరిగిందో అర్థమవుతుంది. "రచయితకి బాగా పరిశీలనాశక్తి ఉండాలి, విషయాల మీద అవగాహన ఉండాలి, లేకపోతే అవగాహన కలిగేలా కృషి చెయ్యాలి. పరిజ్ఞానం సంపాదించాలి. కొత్త విషయం కనుగొనాలి. సాహిత్యంలో ఇజాలు, వాదనలకు తావు ఇవ్వకూడదు..." ఇలా ఎన్నో ఖచ్చితమైన అభిప్రాయాలతోనే వెంకటేశ్వరరావుగారు రచనా వ్యాసంగం సాగించారు. వ్రాసే ప్రతీ రచయితకి ఇవే విషయాలు కూడా ఆయన చెప్తారు.

యాభై రెండు సంవత్సరాల సాహితీప్రస్థానంలో.. అరవై కథలే కాకుండా, రెండు నవలలు, సాహిత్య వ్యాసాలు, ఆంగ్లంలో "విశాఖపట్నం చరిత్ర" ... వీరి కలం నుండి జాలువారాయి. పొగమంచు, పిల్ల తెమ్మెర, జాలి, ఎలుకల బోను, సహజీవనం, తామరాకు – నీటి బొట్టు.. వంటి కొన్ని కథలకు బహుమతులు అందుకున్నారు. 'నిర్హేతుకం' అనే కథా సంపుటం కూడా వచ్చింది. దిగువ, మధ్య తరగతి ప్రజల జీవితాలు, మనుషుల బలహీనతలు, మనస్తత్వాలు, సమాజం పోకడ... ఇలా తనకి కనబడిన విషయాల మీద లోతుగా ఆలోచించి, ఎన్నో కోణాల్లో పరిశీలించి, పరిశోధించి విలువైన వాక్యనిర్మాణంతోనే

వెంకటేశ్వరరావుగారు రచనలు చేసారు. కథల ఎత్తుగడ, శిల్పం, శైలి, కథనం, ముగింపు.. ఇలా ఏది చూసినా ఓ విశిష్టత కనబడుతుంది. పాఠకుల చేత ఆసాంతం చదివించడమే కాదు, ఆలోచనల్లోకి దింపుతాయి. చాలా కథల్లో గాంభీర్యం కనబడుతుంది. హాస్యం అని ప్రత్యేకంగా కథలు వ్రాయలేదు గాని పాత్రల ద్వారా వ్యంగ్యం అధిక్షేపణ కొన్ని కథల్లో కనబడతాయి.

చెకోవ్, మొపాసా, దాస్తోయెవ్‌స్కీ వంటి ఆంగ్ల సాహితీవేత్తలంటే ఇష్టపడే వెంకటేశ్వరరావు గారు.. హెమింగ్‌వే చెప్పినట్లు.. రచయిత ఎంత మేరకు బాగా వ్రాయగలడో.. ఆ స్థాయికి రచన వచ్చేంతవరకు తనను తాను హింసించుకోవాలంటారు. రచయితల సాంగత్యం మేధస్సుకు పదును పెడుతుంది. పరిశీలన చాలా అవసరం.. ఇలా పెద్దవాళ్ళు చెప్పే ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకునే రచనలు చేసారు. ఇప్పుడు రచనలు చేస్తున్న వారికి కూడా ఆ సూచనలే చేస్తారు.

విశాఖపట్నం పోర్టు ట్రస్టులో పనిచేసి, పదవీ విరమణ చేసిన తర్వాత విశాఖలోనే స్థిరనివాసం ఉంటున్న శ్రీ నవులూరు వెంకటేశ్వరరావుగారు..ఈమాసపుకథామంజరిసంచికకువిశిష్టఅతిథిగాపరిచయంచేయడానికిఅంగీకరించినందులకు కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, ఆయన కలం నుండి మరిన్ని కథలు రావాలనీ ఆశిస్తూ .. అవి ఖచ్చితంగా విలువైనవే అయి తీరుతాయనే ప్రగాఢ నమ్మకంతో ఎదురుచూస్తుంటాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

**కీ.శే. అడవి బాపిరాజు**

ఎప్పుడో నూరుసంవత్సరాల క్రిందట వ్రాసిన గీతం “బావా బావా పన్నీరు.. బావను పట్టుకుని తన్నేరు..” అనే పాటను వినని తెలుగువారు ఉండరు. అలాగే గడిచిన ఏడెనిమిది దశాబ్దాల కాలంలో ఆ మాత్రం పుస్తకాలు చదివేవారిలో.. “నారాయణరావు” అనే నవల తెలియని వారు కూడా ఉండరు. ఇది కూడా చరిత్రలో నిలిచిపోయిన నవలే! ఆ రోజుల్లో ఆంధ్రవిశ్వ కళాపరిషత్ వారు నవలల పోటీ పెడితే, ‘నారాయణరావు’ నవలతో పాటూ, విశ్వనాథ వారి ‘వేయి పడగలు’ నవల కూడా పోటీలో నిలిచింది. ఏ నవలకి మొదటి బహుమతి ఇవ్వాలో తేలక.. ఆ రెండు నవలలకి ప్రథమ బహుమతి ప్రకటించారు. ‘బావా బావ పన్నీరు’ పాట రచయిత, విశ్వనాథ వారి నవలకి దీటుగా నిలిచిన ఆ “నారాయణరావు” నవలారచయిత, తెలుగువారికి పరిచయం చేయక్కర్లేని బహుముఖ ప్రజ్ఞాశాలి కీ.శే. అడవి బాపిరాజుగారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అనే పదానికి సరియైన నిర్వచనం బాపిరాజుగారు! గేయకవి, కథ నవలా నాటక రచయిత, వ్యాసకర్త, చిత్రకారుడు, పత్రికా సంపాదకుడు, చిత్రకళా దర్శకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, వక్త.. ఇలా సాహితీ ప్రక్రియలలోనే కాకుండా, సమాజసేవలో కూడా తనవంతు పాత్ర నిర్వహించిన బాపిరాజు గారిని “ఆంధ్ర రవీంద్రుడు” అని కూడా పిలుస్తారు. బాపిరాజుగారి ఏ రచన చదివినా .. అందులో సమగ్రమైన విజ్ఞానం, లోతైన విషయపరిశీలన కనబడతాయి. సమస్య పట్ల పూర్తి అవగాహన, రాసే ప్రతీ అక్షరం మీద పూర్తి పట్టు కనబడతాయి. ఆయన కొన్ని రచనలు చదువుతుంటే.. ఆయన వ్యక్తిత్వంలోని విభిన్నమైన కోణాలు మనకు కనబడతాయి! వైవిధ్యం, సృజనాత్మకతలతో .. రాజకీయం, విద్యావిధానం, కళలు, సామాజిక సమస్యలు, సాంఘిక విషయాలు, అనుబంధాలు.. ఇలా అన్ని అంశాల మీద ఆయన చేసిన రచనలన్నీ ఆణిముత్యాలే! అలాగే బాపిరాజుగారు ఏది చదివినా సరే.. అదే చిత్తశుద్ధి ఆయనలో కనబడుతుంది. అందుకే.. పిలకా గణపతి శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి, దాశరథి, తిరుమల రామచంద్ర.. వంటి లబ్ధప్రతిష్టులు, బాపిరాజుగారి మీద ప్రశంసలు కురిపించారు. ఇక బాపిరాజుగారి చిత్రలేఖనం గురించి చెప్పుకుంటే.. ఆయన రచనల కంటే మరింత పేరు తెచ్చింది ఆయన చిత్రాలే! అందులో నండూరి వారి ఎంకి, విశ్వనాథ వారి కిన్నెరసాని మొదలైన కవితా కన్యలకి వేసిన చిత్రాలు.. ఆ పాత్రలు నిజంగా జీవం పోసుకుని మన మధ్య తిరుగుతున్నట్టే అనిపిస్తుంది. ఎవరైనా ఆటోగ్రాఫ్ అడిగితే, బొమ్మవేసి సంతకం చేసి ఇచ్చేవారుట! బాపిరాజుగారు చిత్రించిన ‘భారతమాత’ బొమ్మ నేటికి ఓ గొప్ప చిత్రంగా గుర్తింపబడుతోంది. వీరు వేసిన ‘శబ్దబ్రహ్మ’ చిత్రం నేటికీ డెన్మార్క్ ప్రదర్శనలో ఉంది! మరో వైపు.. బాపిరాజుగారు “మీజాన్” అనే పత్రికకు సంపాదకుడుగా పనిచేసిన రోజుల్లో, ఆయన ఏ విషయంలోనూ రాజీ పడేవారు కాదు. ఎవరు ఏమనుకున్నా, జరిగిన విషయాన్ని కుండ బద్దలుకొట్టినట్టే వార్తగా వ్రాసేవారు. అలాగే వార్తపత్రికలకి ఓ

రూపం తీసుకొచ్చిన ఘనత కూడా బాపిరాజుగారిదే! మొదటి పేజీలో ఇదుండాలి, రెండో పేజీ ఫలానా.. మూడో పేజీ ఫలానా అంశాలు ఉండాలనే ఓ ఒరవడిని తీసుకొచ్చారు. ఇలా.. బాపిరాజుగారి గురించి ఏ విషయం వ్రాసినా, ఏ సాహితీ ప్రక్రియ గురించి ఎంత చెప్పినా.. సముద్రంలోని కేవలం ఓ రెండు నీటి బిందువులను స్పృశించినట్టే!

అక్టోబర్ 1895 లో భీమవరంలో జన్మించిన బాపిరాజుగారు, బి.ఏ., బి.యల్., చదివి, బందరు నేషనల్ కాలేజిలో అధ్యాపకులుగా కొన్నాళ్ళు పనిచేసారు. "మీజాన్" దినపత్రిక సంపాదకుడుగా, ఆకాశవాణి సలహాదారునిగా, పలు చలనచిత్రాలకు కళాదర్శకుడిగా పనిచేసారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని, ఓ ఏడాది జైలుకి కూడా వెళ్ళారు. భారతీయుల, ముఖ్యంగా తెలుగువారి దురదృష్టం ఏమిటంటే.. ఇంతటి బహుముఖ ప్రజ్ఞాశాలి ఏభై ఆరో ఏటనే మరణించడం..!

ఓ మహోన్నతమైన మహానుభావుడుని తలుచుకుని.. ఇలా నాలుగుముక్కలు వ్రాసే భాగ్యం కలిగినందులకు ఆనందపడుతూ.. కీ.శే. అడవి బాపిరాజు గార్కి ఘనమైన నివాళి తెలుపుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

# కథా పరిచయం

## ‘ఓల్గా’ గారి కథ “అన్వేషి”

‘ఓల్గా’ కలం పేరుతో ఎన్నో కథలు, నవలలు, పద్యాలు, వ్యాసాలు, అనువాదాలు వ్రాసి ఒక అభ్యుదయ స్త్రీవాద రచయిత్రిగా పేరుపొందిన పోపూరి లలితకుమారిగారి కలం నుంచి వెలువడిన ఒక కథ ‘అన్వేషి’. ఆవిడ రచనలు ఎన్నో పుస్తకాలుగా ప్రచురించబడ్డాయి. ఆమె రాసిన ‘స్వేచ్ఛ’ నవలను వివిధ భారతీయభాషలలోకి అనువదించడానికి నేషనల్ బుక్‌ట్రస్ట్ వారు స్వీకరించారు. ఆవిడ ఒక అధ్యాపకురాలు, సంఘ సేవిక కూడా. తన అభిప్రాయాలను నిక్కచ్చిగా తన రచనలలో చెప్పడం వల్ల ఆమె రచనలు ఎన్నో ప్రశంసలను, విమర్శనలను కూడా ఆకర్షించాయి.

‘అన్వేషి’ కథ ఇండియా టుడే 1995 లో ఆగస్ట్ 21 – సెప్టెంబరు 05 సంచికలో వచ్చింది. సూక్ష్మంలో చెప్పాలంటే, తన చుట్టూ ఉన్న సమాజం – తన అమ్మా, నాన్నలతో సహా – తను గౌరవించలేనిదిగా గుర్తించి, తన జీవిత ధ్యేయాన్ని అన్వేషిస్తూ, ఒక యువతి తన కుటుంబపు నాలుగు గోడలను దాటి బయటకి అడుగు వేస్తుంది. అంతే కథ. అయితే, ఆ అన్వేషణకు కారణాలేమిటి? తన గమ్యం తనకి తెలుసా? అదే రచయిత్రి తన కథలో చెపుదామనుకున్నది.

యుక్తవయసులో ఉన్న యువతి క్రాంతి. తనకేం కావాలో తెలియదు. కాని తన చుట్టూ ఉన్న సమాజాన్ని అంగీకరించలేదు. నెల రోజుల నుండి కాలేజీకి వెళ్ళటంలేదని తెలిసి, తల్లడిల్లి పోతున్న తల్లి తండ్రులతో మొదలౌతుంది కథ. ఎందుకు వెళ్ళదో అర్థం కాదు. రాత్రికి ఇంటికొచ్చిన కూతురుని నిలదీసి అడుగుతుంది తల్లి ఎంతో ఆక్రోశంతో! క్రాంతి నిర్లక్ష్యంగా చెప్పిన సమాధానం ఆమెను మరింత క్రుంగదీస్తుంది.

తండ్రి ముకుందరావు, తల్లి గిరిజ, ఇద్దరూ తీవ్రవాద విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నవారే. ప్రేమించి పెళ్ళి చేసుకున్నవారే. దేశంలో ఎమర్జెన్సీ ఉన్న రోజుల్లో.. గిరిజ తల్లిదండ్రులను కష్టం మీద ఒప్పించి ముకుందరావును పెళ్ళి చేసుకుంది. పెళ్ళి అయిన పదిహేను రోజుల్లో పార్టీ అవసరం కొద్దీ రహస్య జీవితాన్ని గడపడానికి ముకుందరావు వెళ్ళిపోయాడు. ఆ సమయంలోనే క్రాంతి పుట్టింది. తల్లితండ్రుల సాయంతో క్రాంతిని ఒక స్కూల్లో చేర్చి, తనో టీచర్ ఉద్యోగంలో చేరింది. ముకుందరావు బయటకు రావడం, పార్టీతో ఏకీభవించలేకపోవడం, తనూ లెక్చరరుగా ఒక ఉద్యోగం చూసుకుని, హైదరాబాదులో నివాసమేర్పరచుకోవడం జరిగిపోయాయి. ఉద్యోగం చేస్తూనే లా చదివి, లాయరుగా ప్రాక్టీసు మొదలు పెట్టి, మంచి సంపాదన మొదలు పెట్టాడు. గిరిజ ఉద్యోగం మానేసి ఇంటి పనులలోనూ, క్రాంతిని చూసుకోవడం చేస్తూండేది. కుటుంబం మెల్లగా సెటిల్ అయింది. ఇల్లు కూడా కట్టుకున్నారు. క్రమేపీ మార్క్స్, ఎంగెల్స్ రచనలు డ్రాయింగు రూమ్ లోంచి వెనక గదులకెళ్ళిపోయాయి. క్రాంతి ఇంటర్లో ప్రవేశించేంతవరకూ ఏ సమస్యా రాలేదు.

క్రాంతిని డాక్టరు చేయాలని కలలు కన్నారిద్దరూ! తను డాక్టరై, ఇంకో డాక్టర్ని పెళ్ళి చేసుకుని ఇద్దరూ అమెరికాలో సెటిల్ అయిపోవచ్చు. తమతో పాటు ఉద్యమాల్లో పాల్గొన్న వామపక్ష నాయకులు ఎంతమంది తమ పిల్లల్ని అమెరికా పంపలేదు? క్రాంతి తెలివైనది కూడా.

ఇంటర్ పాసవుతూనే క్రాంతి ఎంసెట్ పరీక్షలు తీసుకోనని నిక్కచ్చిగా చెప్పేసింది. ఇంట్లో అటకకెక్కించిన పుస్తకాలను దించి, లైబ్రరీలో దొరికే మార్క్వెజ్, మిలన్ కుందేరా పుస్తకాలను చదవడం మొదలు పెట్టింది. గిరిజ అప్పుడే గుర్తించింది.. క్రాంతిలో వస్తున్న మార్పులని! అయితే ముకుందరావు మాత్రం గిరిజ చిన్నతనంలో చలం పుస్తకాలు చదివి పాడయిపోయిందా? తన తలిదండ్రుల్ని ఎదిరించలేదా? అంతమాత్రంలో పాడైపోయారా అని క్రాంతిని సమర్థించేవాడు.

క్రాంతి చదువు మానేస్తానంటోంది. ఇల్లు బోర్, అమ్మ, నాన్న బోర్. స్నేహితులతో రోజల్లా తిరిగొస్తుంది. గిరిజకు వొళ్ళు మండిపోతోంది. తను యూనియన్ విషయాల్లో పని చేసినా, ఇంట్లో చెప్పకుండా వెళ్ళలేదు. ఒక డిసిప్లిన్ ఉండేది. పార్టీ ఏం చెప్తే అది చేసేవాళ్ళు. అమ్మా, నాన్నలను ఒప్పించి.. చేసేది ఏ పని చేసినా! తనకిష్టం లేకపోయినా వాళ్ళకనుగుణంగా కొన్ని పనులు చేసేది. అంతేగాని అమ్మా నాన్నల్ని ఎప్పుడూ కాదనలేదు. తిరుగుబాటు చేసినా పద్ధతిలో జరిగింది.

క్రాంతి తనింక కాలేజీకి వెళ్ళనని చెప్పిన మరునాడు క్రాంతి కోసం ఒక అబ్బాయి వచ్చాడు. వస్తూనే క్రాంతి తన రూముకి తీసికెళ్ళిందతన్ని! ఓ రెండు గంటలు గడిచాక ఆ అబ్బాయిని పలకరించాడు ముకుందరావు. పేరు సంతోష్, బి. ఎ. చివరి సంవత్సరంలో ఉన్నాడు. క్రాంతి చదువు మానేసిందంటే, మంచిపని చేసింది, చదువులు బోర్. నేర్చుకుందుకేమీ లేదని అంటాడు. క్రాంతి ఒక అమ్మాయి కాబట్టి రెబెల్ అయి తన ఉనికిని నిరూపించుకుంటుంది. తానైతే తనమీద తానే రెబెల్ అవాలని, అదెంత కష్టమో అంటాడు. ఎక్కడా ఒక హోప్ కనిపించడం లేదని, తన పై జెనెరేషన్ వాళ్ళు నాశనం చేసి పెట్టారని వాదిస్తాడు. తండ్రి గురించి అడిగితే ఆ వివరాలు అవసరమా అని అడుగుతాడు. దానికి వత్తాసు పలుకుతుంది క్రాంతి.

సంగీతం నేర్చుకుంటుందేమో అన్న ప్రతిపాదనను మొదట్లోనే తుంచేస్తుంది క్రాంతి. సంగీతజ్ఞానం లేకపోవడం వల్లే తను ఆనందించగలుగుతుందని, లేకపోతే అందులో తప్పులెంచడంతోనే గడిచిపోతుందని వాదిస్తుంది. గిరిజ, ముకుందరావుల ప్రయత్నాలేవీ క్రాంతి పడనీయలేదు. వాదనకి ప్రతివాదన చేస్తుంది. తమ తరం వారి మీద ఇసుమంతైనా గౌరవం లేదు. గిరిజకు ఏడుపు మాత్రం మిగిలింది. తల్లిగా ఆమె వ్యధను అర్థం చేసుకునే కూతురు కాదు క్రాంతి.

ఒక రోజు క్రాంతి చెప్పింది.. 'తను ఇంటినుంచి వెళ్ళిపోతానని'. ఎక్కడికో ఆమెకే తెలీదు. "నాకు జీవితానందం కావాలి నాన్నా. ఇక్కడ ఈ ఇంట్లో నాకు దొరకదు. అసలు ఆనందం ఎక్కడ దొరుకుతుందో కూడా నాకు తెలియదు. కాని దాని కోసం గట్టిగా వెతకాలి అని మాత్రం గట్టిగా అనిపిస్తోంది. ప్రయత్నించకుండా లేదనుకోవడం పొరపాటు కదూ!"

"నా బతుకు నేను బతుకుతానంటే అది మీకు హింసలా ఉంది. నా దారికి అడ్డంగా ముళ్ళ కంపల్లా మీరుండడం, ఆ కంపను పీకుతుంటే రక్తం కారడం.. ఇదంతా హింస కాదా? నన్ను నా మానాన వదిలెయ్యరెందుకు? నన్నెందుకిలా హింసిస్తారు?" అంటూ ఇల్లు వదిలి వెళ్ళి పోయింది క్రాంతి.

గిరిజను ఊరడిస్తాడు ముకుందరావు. "ఏడవకు. ఏ చట్రంలోనూ ఇమడకుండా ఉండడానికి అవంత బలహీనమైనవి కావు. పిచ్చివాళ్లు తప్ప మనుషులు ఏదో ఒక నిర్మాణంలోకి రాక తప్పదు. ఎప్పటికో అప్పటికి మనమ్మాయి ఏదో ఒక చట్రంలో చిక్కుకుంటుంది. అది ఏదో చట్రంలో చిక్కుకుని వస్తే ఎగతాళి చేసి ఆనందించాలని ఉంది. ఆరోజు కోసం ఎదురు చూద్దాం" అంటాడు.

కాని గిరిజకు భర్తను చూస్తుంటే భయం వేసింది. కూతురు ఓడిపోకూడదనే కోర్కె.. ఆ క్షణాన ఆమె మనసులో కనిపెట్టలేనంత సూక్ష్మ రూపంలో అంకురించింది.. అన్న వాక్యంతో కథ ముగుస్తుంది.

మొదట్లో చెప్పినట్టు ఇక్కడ కథ పెద్దగా లేదు. సంభాషణలతో రచయిత్రి క్రాంతి పాత్ర ద్వారా మన చుట్టూ మనమే అల్లుకున్న సమాజంలో మనకు తెలియకుండానే మనలో ఇంకిపోయిన హిపోక్రసీని ప్రశ్నించారు. ఆ సంభాషణను మూడు పేజీలలో చెప్పడం కష్టం. ముప్పై సంవత్సరాల క్రితం అడిగిన ఆ ప్రశ్నలు ఈ రోజుకీ అవి నిలిచేవే! దానికి కథ చదవాల్సిందే.

క్రాంతి సమాజం వదలి దూరంగా వెళ్ళగలదా? సమాజం ఎక్కడో ఉందా? తను ఎక్కడున్నా అది సమాజంలో భాగం కాదా? ముకుందరావు ఆశించినట్లు ఏదో ఒక చట్రంలో చిక్కుకోదా తన తలిదండ్రులలాగే? తను, తనలాగే ఆలోచించే స్నేహితులతో కలసి కొత్త ప్రపంచాన్ని సృష్టించుకోగలదా? సుమారు ముప్పై సంవత్సరాలక్రితం వచ్చిన ఈ కథలో స్త్రీ పాత్రల (క్రాంతి, ఆమె వెళ్ళిపోయిన తరువాత కూతురు ఓడిపోకూడదనే ఒక ఆశాభావం వ్యక్తం చేసిన తల్లి గిరిజ) ద్వారా కుల, మత, సాంప్రదాయాలనే చట్రాలలో ఇమడని, ఎంతో ఎత్తైన ఆశయాలు కూడా కాలక్రమేపీ సమాజమనే ఎడారిలో ఇంకిపోని మరో ప్రపంచం ఉందని, దానిని వెతకాలని రచయిత్రి భావమనిపిస్తుంది. అన్వేషణ పేరిట యువత ఇల్లు వదలి వెళ్ళిపోవడం ఒక సింబాలిజం అనుకోవాలి మరి. అదే సమాధానం అవదు కదా!

ఎవరో ఒకరు, ఎపుడూ అపుడు.... ప్రశ్న లోంచి అన్వేషణ, ఆ అన్వేషణలోంచే జీవన ప్రయాణానికి మరో దారి... !

***శాయి రాచకొండ, హోస్టన్, యు.ఎస్. ఏ.***

# వినదగునెవ్వరు చెప్పిన..

Guy de Maupassant, ఫ్రెంచి రచయిత, రాసిన కథ 'అదంతా కలేనా' గత సంచికలో పరిచయం చెయ్యడం జరిగింది. అయితే ఆయన పేరు సరిగ్గా చెప్పకపోవడం జరిగింది. ఎప్పటినుంచో విన్న పేరే అన్న ధైర్యంతో నాకు సందేహం రాలేదు. సరి అయిన విధంగా పలకడం 'గి ద మొపసాఁ' అని గొర్తి బ్రహ్మానందం గారు తెలియచేసినందుకు ఆయనకు ధన్యవాదాలు. ఈ క్రింది వీడియో ఆ ఫ్రెంచి రచయిత పేరు ఎలా పలకాలో చెబుతుంది.

*https://www.youtube.com/watch?app=desktop&v=pOkQLmlokAE*

***శాయి రాచకొండ, హ్యూస్టన్***

---

కథామంజరి సంపాదకులకు, నిర్వాహకులకు నమస్కారం.

ఈ సంవత్సరం చందా నేను చెల్లించిన తరువాత మీరు కోరిన విధంగా నా అభిప్రాయాలు, సలహాలు మీకు తెలియచేయదలిచాను. వీటిని మీరు అభిప్రాయాల రూపంలో కథామంజరిలో ప్రచురించదలుకుంటే మీకు ఇబ్బంది లేనంత మేరకు సవరించి ప్రచురించుకోవచ్చు.

1. ఈ ఏప్రిల్ సంచిక నుండి మీ పత్రికను చదవాలనుకుంటే మీరిచ్చే లింక్ ద్వారా మాత్రమే వీలు కల్పించారు. డౌన్‌లోడ్ అవకాశము, భద్రపరచుకునే అవకాశమూ లేదు. అంటే చదవాలనుకున్న ప్రతిసారీ మెయిల్‌ను ఓపెన్ చేసి, డేటా ఖర్చు పెట్టి చదవాలి. మెయిల్‌ను కూడా చిరకాలం మొయ్యాలి. నాకు అలా మెయిల్‌ను ఉంచుకునే అలవాటు లేదు కాబట్టి ఈ సారి కథామంజరిని నేను చదవలేకపోయాను.

2. చందా చెల్లించేటపుడు కన్వీనియన్స్ ఛార్జీలు చెల్లించవలసి రావడం చాలా విచారకరం. ఈ విషయం ఇంతకు ముందే మీకు తెలియచేశాను. UPI ద్వారా చెల్లిస్తే అన్ని వేళలా చెల్లింపు ఉచితం. కొన్ని UPI App లలో కాష్‌బ్యాక్ సౌకర్యం కూడా ఉన్నది. చందా 200 వందలకు బదులు 400 చేసినా నేను సంతోషంగా చెల్లిస్తాను. కానీ రూ 10.12 పై కన్వీనియన్స్ ఛార్జీలు చెల్లించడానికి నాకు సుతరామూ ఇష్టం లేదు.

ఈ రెండూ మీ పత్రిక నిర్వహణ తాలూకు అంశాలు.

ఇక మన పత్రికలోని చదివే అంశాల గురించి... నేను పెద్ద పాఠకుణ్ణి. చదవడాన్ని నేను చాలా ఆనందిస్తాను.

వేణు గానమో, మంచి త్యాగరాయ కీర్తనో, భానుమతిగారి పాటలో, ఉల్లాసం కలిగించే నాట్యమో, వడ్డాదివారి అభిసారిక చిత్రమో, 'ఆకులో ఆకునై' అంటున్న దేవులపల్లి గీతమో ఇవన్నీ మనస్సుని రంజింపచేస్తాయి. దానితో పాటు సమాజహితం ఉంటే మంచిదేమో కానీ ఏ కథ చూసినా ఏదో ఒక సందేశం ఉంటేనే ప్రచురణార్హం అనే ఇప్పటి ధోరణి ఎప్పటి నుండో ఉండి ఉంటే మనం ఎన్నో మంచి కథలనూ, గీతాలనూ కోల్పోయి ఉండేవాళ్ళమేమో. కొంచెం లక్ష్మణరేఖకు బయటకు వచ్చి ఆలోచిస్తే బాగుంటుంది.

ప్రతీ సంచికలోనూ ఒక ప్రముఖ రచయిత కథానికను అందిస్తున్నారు. సంతోషం. అది మొదటికథగా ఉంటే ఎలా ఉంటుంది? ఆలోచించండి. తిలక్‌గారి 'ఆశాకిరణం' , ఓల్గా గారి 'విముక్త' లోని భాగాలు, విశాలాక్షి గారి 'భావబంధం', జయకాంతన్‌గారి 'ఉడుపు', ముళ్ళపూడి వారి 'కానుక', భానుమతిగారి 'అత్తగారి కథలు', అల్లం శేషగిరిరావుగారి 'చీకటి', లాంటి కథలు ప్రముఖుల రచనల శీర్షికలో చూడాలని ఆశపడుతున్నాను.

రకరకాల కొత్త శీర్షికల అవసరం ఈ పత్రికకు లేదు. ఏమైనా కొత్తగా పెట్టదలచుకుంటే మీ ఇష్టం. అవి పత్రిక స్థాయిని పెంచడంలో మాత్రం సహకరించబోవు అని నా అభిప్రాయం.

అన్ని కథలూ శ్రావ్యపద్ధతిలో వినిపించడం ద్వారా మీ పత్రికలోని కథలు శ్రవ్యానుకూలం అయితేనే ప్రచురింపబడుతున్నాయి. చెరకురసానికంటే చెరకుకు ఉండే రుచి చాలా వేరు. చదవడం కంటే వినడం, వినడం కంటే చూడడం, పాఠకుని / శ్రోతయొక్క / ప్రేక్షకుని రసానుభూతి పలుచన చేసి, రచయిత / వ్యాఖ్యాత లేదా దర్శకుల / నటుల దృష్టికోణంలో ఆ రచనను చూపెడుతుంది. రచనను తన దృష్టికోణంలో మాత్రమే ఆనందించే వెసులుబాటును పాఠకుడు కోల్పోతాడు. నేను శ్రవ్యవిధానం వద్దనడం లేదు. కానీ ఇది నాకు తోచిన భావం.

చివరిది, నేను అతి ముఖ్యమైనదిగా భావించేది. కథానికా రచనలో, తప్పని సరైతే తప్ప ఇంగ్లీషు వాడవద్దని నా అభిప్రాయం. ప్రతి రెండువాక్యాలకూ ఒకసారి ఆంగ్లపదాలు అంత అవసరమా? కొన్నిసార్లు కొన్ని ఇంగ్లీషు పదాలు నేటి వాడుకలో వికృతి చెంది వాడబడటం కూడా చూస్తున్నాము. కథలు ఎంపిక చేసేటప్పుడు సంపాదకవర్గం ఈ విషయాన్ని గుర్తుపెట్టుకుని, ఆయారచయితలనే తొంభై శాతానికి పైగా తెలుగును వాడమని సూచిస్తే మన భాష ఇంకొన్నాళ్ళు సజీవంగా నిలబడుతుంది. అలాగని కొన్ని పత్రికలు వాడుతున్న కృత్రిమ తెలుగును పరిహరిస్తేనే మంచిది.

నా సుదీర్ఘ అభిప్రాయాన్ని చదివినందుకు ధన్యవాదాలు.

**పి. రాజేంద్రప్రసాద్**


*శ్రీ రాజేంద్రప్రసాద్‌గారికి నమస్కారం! మీ స్పందనకు ధన్యవాదాలు. మీ అభిప్రాయాలకు మా వివరణ.*

*1. కథామంజరి రెండు రూపాలలో అందచేస్తున్నాం. ఒకటి ఆన్లైన్‌లో కుడి నుండి ఎడమ కు పేజీలు తిప్పుకుని చదవడానికి.. అది నెట్ ఉంటేనే సాధ్యమవుతుంది. రెండోది పిడీఫ్.. అది డౌన్లోడ్ చేసుకుంటే ఎప్పుడు చదవాలనుకుంటే అప్పుడు నెట్ లేకుండా చదువుకోవచ్చు. మీరు అనుకున్నట్టు డౌన్లోడ్ చేసుకునే అవకాశాన్ని కథామంజరి ఎప్పుడూ తీసివేయలేదు. అసలు అలాంటి ఉద్దేశ్యమే లేదు.*

*2. కథామంజరి వార్షిక చందా విషయంలో.. ఆ ఆన్లైన్ సౌకర్యం అందచేస్తున్న సంస్థ ఛార్జీలు తీసుకుంటున్నది. ఆ విషయంలో ఏ సంస్థ కూడా ఫ్రీగా చేయదు కదా! నేరుగా అకౌంటులోకి బదిలీ చేస్తే.. పంపినవారి వివరాలు తెలియక, మాకు అకౌంటు నిర్వహణ కష్టం అవుతున్నది. ఈ పరిస్థితిలో మరో గత్యంతరం లేదు. మిగతా మీ సూచనలు గ్రహించాం. కొన్ని సూచనలు రచయితలు కూడా గ్రహించవలసిన అవసరం ఉంది.*

**సంపాదకుడు**

# కథాపుస్తక పరిచయం




## సాహిత్య డిటెక్టివ్ కథలు

మెడికో శ్యామ్ కథలంటే ఓ రకమైన కిక్ ఉంటాయి. చాలా సంవత్సరాల తర్వాత శ్యామ్‌గారి కలం నుంచి జాలువారిన సాహిత్య విన్యాసాలు, కొన్ని కథలు, కొంత కమామీషూ పుస్తకం. మరెన్నో వ్యాసాలు ఉన్న ఈ కథల పుస్తకం వెల రు.175/-.

ప్రతుల కోసం


ఎమెస్కో బుక్స్ ప్రై. లి.
1-2-7, బయనూ కాలనీ,
గగన్ మహల్ రోడ్డు,
దోమలగూడ,
**హైదరాబాద్ 5000029**
email:
*emescobooks@yahoo.com*

29-13-53, చంద్రం బిల్డింగ్స్,
సి. ఆర్. రోడ్డు, చుట్టుగుంట,
**విజయవాడ – 520002**
✆ 0866-2436643,
email:
*sahithi.vja@gmail.com*

## సతీష్ చందర్ కథలు

ప్రముఖులైన రచయితల చిరస్మరణీయమైన కథలను ఏరి, అందంగా లభ్యమయేలా, అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు శాఖవారు తక్కువ ధరకే ఈతరం పాఠకుల కోసం ప్రచురించి అందిస్తున్నారు.

12 కథలతో అలరించిన ఈ పుస్తక ప్రతులు.. విశాలాంధ్ర బుక్‌హౌస్ బ్రాంచీలన్నింటిలోనూ రు.65/– ధరకు లభ్యమవుతాయి.



# వృద్ధం శరణం గచ్ఛామి

డా. కాలువ మల్లయ్య
✆ 9182918567

***మనదేశంలో వృద్ధులకు.. కనీసంగా విదేశాల్లోలానైనా భద్రత లేదు. వృద్ధాప్య పెన్షనూ లేదు. తల్లిదండ్రుల సంపాదన పిల్లలకు చెందుతుంది కాని, పిల్లల సంపాదన తల్లిదండ్రులకు చెందడం లేదు. బస్సులో రెండు ముందు సీట్లు కేటాయించినందుకు ఇంత రభస చేసారు. చందానగర్ వచ్చేసింది. మీరు బస్సు దిగండి. వృద్ధం శరణం గచ్ఛామి... ఈ జ్ఞాన వృద్ధులనాదుకుందాం***

ఎల్.బి. నగర్ నుండి లింగంపల్లి వెళ్ళే మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు నిండా జనం! మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఉండటం వల్ల బస్సులో మహిళల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఆధార్ కార్డ్ లేకున్నా ఎన్నికల కార్డున్న వాళ్ళు, ఏ కార్డు లేకున్నా మాకు ఉచిత ప్రయాణముండాలని వాదిస్తున్న మహిళలూ ఉన్నారు. వాళ్ళకు సర్దిచెప్పలేక కండక్టర్ సతమతమవుతున్నాడు. క్రిక్కిరిసి ఉన్న జనంతో బస్సు నిండు గర్భిణిలా ఉంది. బస్సులోనే కాదు, రోడ్డు పైనా జనం.. రకరకాల వాహనాలు.. రద్దీ రద్దీగానే ఉంది. మెట్రో రైలు సౌకర్యమున్నా ఈ రూట్లో బస్సులెప్పుడూ జనంతో నిండుగానే ఉంటాయి. కండక్టర్ రైట్ రైట్ అనగానే బస్సు బయలుదేరింది. ఆపసోపాలు పడుతూ రోడ్డుపై నడుస్తుంది.

“డోర్ దగ్గర మనుషులుండొద్దమ్మా... ప్రక్కనున్న అద్దం కనబడటం లేదు. వెనుక నుంచి వచ్చే వాహనాలు కనబడకుంటే ఆక్సిడెంట్లు జరిగే ప్రమాదముంది. డోర్ నుంచి దూరం జరుగుండ్రి” అన్నాడు కండక్టర్.

“ఇసుక వేస్తే రాలనంత జనం బస్సులో.. ఎక్కడికని జరుగడం.. ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగానే ఉంది” అందో మహిళ.


బస్సు కొత్తపేట దాటి చైతన్యపురి చేరుకుంది.

“మగవాళ్ళు కూడా ఇట్నుంచే ఎక్కుతున్నారు. ముందు నుంచి ఎక్కేది స్త్రీలన్న ఆలోచనేమన్నా ఉందా వీళ్ళకు. మ్యానర్‌లెస్ ఫెలోస్” అందొక ఆఫీసుకెళ్ళే విద్యావంతురాలు.

అతి కష్టంగా చోటు చేసుకుంటూ, బస్సెక్కుతున్న వృద్ధులను చూస్తూ అందామె. వాళ్ళిద్దరు బస్సులో సీనియర్ సిటిజన్ల సీట్ల దగ్గర నిల్చున్నారు.

“అమ్మాయ్.. చదువుకున్నదానిలా కనబడ్తున్నావ్! ఉద్యోగం కూడా చేస్తున్నావనిపిస్తుంది. ఎందుకు తల్లీ నీకు ముసలోల్లంటే అంత కోపం. ఏ కారణం లేకుండా మ్యానర్‌లెస్ ఫెల్లోస్ అని తిడ్తున్నావు!” అన్నాడో వృద్ధుడు. అతని పేరు రాజారాం. అతని దిక్కు తీక్షణంగా చూస్తుంది నీరజ.

“నేను వృద్ధులను తిట్టడం లేదు. మగవాళ్ళు ఇటు నుంచి రావడమెందుకంటున్నాను! ముందు వైపెంత జనాలున్నారో అర్థం కావడం లేదా? అంతా స్త్రీలే అన్న విషయమూ తెలియడం లేదా? ఇంత మంది మధ్య వీళ్లెందుకు? వెనుక నుంచి వస్తేంటి?'' అంది.




''వాళ్ళ నెరిసిన తల, ముఖం మీది ముడతలు చూసైనా వృద్ధులన్న విషయం అర్థం కావడంలేదా నీరజ? వృద్ధులంటే స్త్రీల కంటే బలహీనులనే కదా ముందు సీట్లుంచింది'' అంది మరో స్త్రీ లక్ష్మి.

“తల్లీ! మాకిక్కడ రెండు సీట్లు కేటాయించారు కాబట్టే ఇటు నుంచి బస్సెక్కాం! వెనక నుంచి అంత రద్దీలో బస్సెక్కడం మానుంచవుతుందా? రెండేండ్ల క్రితం అదే పనిచేసి కింద బడి చెయ్యి విరగ్గొట్టుకున్నాను. ఎందుకమ్మా! ఈ ముసలి వాళ్లపై అంత కోపం? మీ నాన్న, మీ తాత మీ పెద్దలు ముసలివాళ్ళే కదా!” అన్నాడు మరో వృద్ధుడు రామస్వామి.

"మీకున్నవి రెండు సీట్లు! అవి కూడా నిండిపోయాయి! వాటి కోసం ఎంత మందెక్కారు? నలుగురెక్కారు. సీట్లు లేవు కాబట్టి వెనుకకెళ్ళొచ్చు కదా! ఆడవాళ్లను తాకుతూ నిల్చోవాలనే కదా అలా నిల్చోవడం...!" అంది నీరజ.

రామస్వామి, రాజారాం ముఖాలా మాటలతో దుఃఖపూరితమయ్యాయి.

'టికెట్ టికెట్' అంటూ కండెక్టర్ వాళ్ల దగ్గరికొచ్చాడు.

"పెద్ద మనుషులు, బాగా బతికిన వాళ్లు.. సీనియర్ సిటిజన్ సీట్లలో కూర్చున్న వాళ్లు లేచి వీళ్ళకు సీట్లివ్వండి!" అన్నాడు ఆ ఇద్దరికీ టికెట్లు కట్ చేసి ఇస్తూ.

"కండక్టర్ సాబ్! ఆడవాళ్ళు సీనియర్ సిటిజెన్లయినా నిల్చోవాల్సిందేనా? వీళ్ళకు సీట్లివ్వాల్సిందేనా?" ప్రశ్నించింది నీరజ.

"..అని నేనన్నానా మేడమ్! సీనియర్ సిటిజెన్లయితే ఆడయినా, మగయినా ఆ సీట్లలో కూర్చోవాల్సిందే. కాని ఆ సీట్లలో ఉన్న స్త్రీలు అరవైలోపు వారేనని అర్థమవుతుంది. ప్లీజ్ మీరు లేచి వీళ్లను కూర్చోనివ్వండి!" అన్నాడు కండక్టర్.

ఆ సీట్లలో కూర్చొన్న స్త్రీలిద్దరూ నిల్చోబోతున్నారు.

"మీరు లేవకండి. వెంట్రుకలు నెర్సినంత మాత్రాన సీనియర్ సిటిజన్లని ఎలా నమ్మడం. ఆ అమ్మాయిలూ సీనియర్ సిటిజన్సే!" అంది నీరజ.

"మేడమ్! మీకెందుకు వృద్ధులపై అంత కోపం? చూస్తే కనబడటం లేదా ఎవరి వయసెంతో? ఆ మేడమ్స్ మధ్యవయసులో ఉన్నారు. వీళ్ళిద్దరు వాళ్లకు తండ్రి వయసులో ఉన్నారు. సరే.. వాళ్ళది సీనియర్ సిటిజన్ వయసని ఏంటి ప్రూఫ్? ఆధార్ కార్డ్ ఉంది కదా ఇటివ్వండి చూద్దాం!"

కండక్టర్ మాటలతో వాళ్ళిద్దరూ లేచి నిల్చున్నారు.

"కూచోండి బాపూ!" అంటూ ఆ వృద్ధుల నా సీట్లలో కూర్చోమన్నాడు.

తండ్రి వయసు వారన్న మాటలు స్త్రీలను కదిలించాయి. తామింకా ఉద్యోగం చేస్తున్నారు. అరవై దాటని వయసులో ఉన్నారు.

"మేం నిల్చుంటామమ్మా మీరు కూర్చోండి!" అన్నాడు రామస్వామి.

"నాకు విపరీతమైన మోకాళ్ళ నొప్పులమ్మా! అందుకే నిల్చోలేకపోతున్నాం తప్ప, మిమ్ములను లేపాలని కాదు. కూర్చోండి" అన్నాడు రాజారాం.

"వద్దు సార్ కూర్చోండి. ఈ సీట్లు మీవి. ఇందులో కూర్చోవడం మీ హక్కు!" అని ముందుకెళ్ళాడు కండక్టర్.

బస్సు దిల్‌సుఖ్‌నగర్ దాటింది. వృద్ధులిద్దరూ సీట్లో కూర్చున్నారు.

"కండక్టర్ సాబ్! మరి వీళ్ళకు వయసు ప్రూఫ్ చూడటం అవసరం లేదా? ఆడవాళ్ల నడిగారు. వీళ్ళనడుగరా?" అంది నీరజ ప్రక్కనున్న మహిళ.

తమ జేబుల్లోని ఆధార్‌కార్డులు తీసి ఆ మహిళకే చూపారా వృద్ధులు.

కండక్టర్‌గారు వెనుకకొచ్చారు. నీరజను చూస్తూ ''మేడమ్! మీకెందుకో పురుష ద్వేషం బాగా ఉన్నట్టు కనబడ్తుంది. పురుషాధిక్య సమాజంలో స్త్రీ అణగదొక్కబడుతుందన్న మాట వాస్తవమే. కాని పురుషులందర్నీ ఒకే గాడిన కట్టడం సరైంది కాదేమో ఆలోచించండి. పురుషుల్లోనూ పుణ్య పురుషులున్నారు. కనీసం వయసుడిగిన వృద్ధులపైనైనా దయచూపండి!'' అంటూ నవ్వాడు.

ఆ మాటలకు మరింత సీరియస్ అయింది నీరజ.

''మీ వాలకం చూస్తుంటే కతలో, కాకరకాయలో రాస్తున్నవారిలా కనబడుతున్నారు. కనీసంగా పుస్తకాలు చదివేవారిలా అనిపిస్తున్నారు. ఎముకలు కుళ్ళిన, వయసు మళ్ళిన వృద్ధుల్లారా చావండి అన్న శ్రీశ్రీ మాటలు మరిచిపోయారా? ఇలాంటి వారుండి ఏం లాభం? పైగా వీళ్ళకు రిజర్వేషన్లు, పెన్షన్లంటూ గోల.. అవును. నేను స్త్రీవాదిని.. పక్కా స్త్రీవాదిని. స్త్రీ వాదోద్యమంలో పని చేస్తున్న దాన్ని!'' అంది కోపంగా నీరజ.

వృద్ధులిద్దరూ కండక్టర్, నీరజ మాటలను శ్రద్ధగా వింటున్నారు. ఆ అమ్మాయిపై కోపం రావడం లేదు. జాలి కలుగుతుంది.

దాదాపు తన ఈడులో నడివయసులో ఉన్న నీరజకేం చెప్పాలో కండక్టర్‌కు అర్థం కావడం లేదు. ఒకసారి బస్సు చివరివరకెళ్ళి మళ్ళీ తిరిగొచ్చాడు.

బస్సు 'కోటి' దాటి నెమ్మదిగా పరుగెత్తుతుంది. ''మేడమ్! నాకు పుస్తక పఠనమంటే చాలా ఇష్టం. విద్యార్థి దశలో, ఆ తర్వాత పుస్తకాలు బాగా చదివేవాన్ని. శ్రీశ్రీ, గురజాడ, ప్రేంచంద్, దాశరథి, సినారె, ఆధునిక కథా రచయితల రచనలు బాగా చదివేవాన్ని! రంగనాయకమ్మ, ఓల్గా, జాషువా, చలం రచనలూ చదివాను. బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చేంత వరకు, సెల్‌ఫోన్లు వచ్చేంత వరకు బాగానే చదివాను. స్త్రీవాద రచనలూ చదివాను. అందరిలాగే నాక్కూడా ఇప్పుడు సెల్ చూడటానికే సమయం సరిపోవడం లేదు. నేను రచయితను కాను గాని పుస్తకాభిమానిని! శ్రీశ్రీ చెప్పిన ఎముకలు కుళ్ళిన, వయసు మళ్ళిన వాళ్ళు వయోవృద్ధుల గురించి కాదనుకుంటాను. పుట్టుకతోనే వృద్ధులు, నాన్నగారి తాతగారి భావాలకు దాసులైన యువతరం గురించి!'' అన్నాడు కండక్టర్ మల్లేశం.

మల్లేష్ మాటలెంతో ఆలోచనాత్మకంగా అనిపించినా పురుష జాతిపై, నీరజకున్న కోపాన్ని తగ్గించుకోలేకపోతున్నాయి.

''కండక్టర్ గారూ! మీరెన్ని పుస్తకాలు చదివినా.. మీ పురుషాధిక్య స్వభావాన్ని, పురుషస్వామ్య భావజాలాన్ని దూరం చేసుకోలేకపోతున్నారు. ఎన్నో ఉద్యమాలు వచ్చి, స్త్రీల హక్కుల పోరాటాలు ఉధృతంగా సాగింతర్వాతైనా, మీరు పురుష పక్షపాతిగానే ఉంటున్నారు. తరతరాలుగా ఈ దేశంలో పురుషులు స్త్రీలనెంత అణచివేస్తున్నారో మీకు తెలియంది కాదు. నూనూగు మీసాల వయసుగల పోరగాండ్ల కాన్నుంచి.. కాటికి కాళ్ళు చాపే వయసున్న వృద్ధుల వరకు, పురుషులు స్త్రీలు కనబడితే చొంగ కారుస్తూనే ఉంటారు. వాళ్ళ కళ్ళన్నీ ఎప్పటికీ స్త్రీల ఒంపుసొంపులపైన్నే. అందుకే పురుషులకు బస్సులోనైనా సరే స్త్రీల ప్రక్కన సీట్లు రిజర్వ్ చేయొద్దంటాను. జీవితంలో నాకెన్నో చేదు అనుభవాలున్నాయి!'' నీరజ కళ్ళవెంట పటపటా నీళ్ళు కారుతున్నాయి.

నీరజలో పురుష బాధితురాలు మాత్రమే కాదు. నిఖార్సయిన స్త్రీవాది కనబడిరది మల్లేశంకు! కాని వృద్ధులందరిపైనా అదే అభిప్రాయం ఉండటం మల్లేశంకు నచ్చడం లేదు. బస్సులో ఓసారి రౌండు కొట్టి టికెట్లిచ్చి వాళ్ళ దగ్గర నిల్చున్నాడు మల్లేశం.

వెనుకకు తిరిగి నీరజ కన్నీరు కార్చడం చూసిన రామస్వామి, రాజారాం హృదయాలు ద్రవించాయి. దుఃఖంతో పూడుకుపోయాయి. వాళ్ళు ఆలోచనలో పడ్డారు. వాళ్ళ కళ్ళ ముందెన్నో దృశ్యాలు కదులుతున్నాయి.

నీరజ మనసు తన జీవితంలోని చేదుగతంలో విహరిస్తుంది. ఎన్నో ఆశలతో ఆదర్శాలతో విజయ్‌ను ప్రేమించి పెళ్ళి చేసుకున్న నీరజ, కొద్ది నెలల్లోనే ఆతని అంతరంగాన్ని అర్థం చేసుకుంది. తనను ప్రేమించే రోజుల్లోని బతుకుంతా నటనేనని తెలుసుకుంది. అతనిలోని పురుషాహంకారం త్వరలోనే బయటపడటం గమనించింది. విజయ్ తన రూపాన్నే తప్ప మనసును, ఆదర్శాలను చూసి ప్రేమించలేదని తెలుసుకుంటానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఆతనిలోని సాడిస్ట్ మెంటాలిటీ బహిర్గతం కాసాగింది. స్త్రీ అంటే శయనేషు రంభ లాంటిదే తప్ప, ఆమెకంటూ స్వంత ఆలోచనలుంటాయని విజయ్ ఎప్పుడూ భావించలేదు. మాడర్న్‌గా అలంకరించుకున్నా, ఏ మగాడితో మాట్లాడినా సహించేవాడు కాడు. తన ఆరోగ్య పరిస్థితి ఎలా వున్నా, మానసిక స్థితి ఎలా ఉన్నా, తాను భర్తకు శారీరక సుఖం నిచ్చే మాంసపుముద్దే తప్ప, వ్యక్తిత్వమున్న మనిషి కాదు. తానెవరితోనైనా నవ్వుతూ మాట్లాడినా సహించేవాడు కాడు.

‘ఆడది తిరిగి చెడింది. మగవాడు తిరుగక చెడుతాడు’ అని తనకు తాను తిరగడానికి లైసెన్సు ప్రకటించుకునేవాడు. విజయ్‌తో సంసార జీవితం ఆమెకు నరకప్రాయమైంది. చరణదాసిగా. ఏ వ్యక్తిత్వం లేని దానిగా బతకడం, హింసకు గురవుతూ బతకడం ఆమెకు నచ్చలేదు. అందుకే విజయ్‌తో విడిపోక తప్పలేదు. ఐదేళ్ళ దుర్భర సాంసారిక జీవితాన్ని మననం చేసుకున్న నీరజ కళ్ళవెంట కారుతున్న కన్నీటిని కొంగుతో తుడుచుకుంది.

అప్పుడప్పుడే బలపడుతున్న మహిళా ఉద్యమాల్లో చేరి, తనతోటి సోదరీమణుల కోసం తన జీవితాన్ని అంకితం చేయడానికి నిర్ణయించుకుంది.

ఆమె కన్నీళ్ళను చూసిన రామస్వామి “తల్లీ ఎందుకమ్మా ఏడుస్తున్నావు? నీ జీవితంలో విషాదముందని నీ మాటలతో అర్థమైంది. ఈ దేశంలో చాలామంది స్త్రీల జీవితాలు విషాదభరితంగానే ఉన్నాయి. స్త్రీ అబల కాదమ్మా ఏడ్వడానికి.. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకెళ్తున్న వీరవనిత! అంతరిక్షంలోకి కూడా దూసుకెళ్తున్న సాహస వనితలున్నారు. ఈ దేశంలో పురుషస్వామ్యముందన్న మాట నిజమే.. కాని పురుషులందర్నీ ఒకేలా భావించడం సరైంది కాదు. వయసు మళ్ళిన మాలాంటివాళ్ళను కూడా!” అన్నాడు.

తన విషాదగాథను క్లుప్తంగా చెప్పింది నీరజ.

“వృద్ధులైనా, యువకులైనా మగవాడు మగవాడే కదా? తన మగబుద్ధిని పోనిచ్చుకోడు. రోజూ బస్సులో ప్రయాణిస్తే మీకైనా ఎవరికైనా అనేక సంఘటనలు తటస్థపడుతాయి. అందుకే వృద్ధులైనా సరే ముందటి నుంచి రాకూడదని స్త్రీవాదులం గోల చేసాం. వృద్ధుల సీట్లను వెనుకకు మార్చారు. కాని వెనుక నుంచి ఎక్కడం ఇబ్బంది అవుతుందని, దిగేటప్పుడు డ్రైవర్‌కు

కనబడం కాబట్టి ప్రమాదాలు జరుగుతున్నాయని కోర్టుకెళ్ళారు సీనియర్ సిటిజన్స్. మళ్ళీ వృద్ధులకు కేటాయించిన సీట్లు ముందుకొచ్చాయి. ఈ దరిద్రం తప్పడం లేదు!" అంది ముఖం మాడ్చుకొని నీరజ.

"అమ్మా! తల్లీ.. మీ హక్కుల కోసం మీరు పోరాడటం, పురుషాధిపత్యాన్ని వ్యతిరేకించడం నూటికి నూరుపాళ్ళు సరైందే. కాని పురుషజాతినే ద్వేషించడం సరైంది కాదు. ద్వేషంతో దేన్నీ జయించలేమమ్మా! ప్రేమతో జయించాలి.. మన ప్రవర్తనతో జయించాలి. ఒక్క స్త్రీల గురించే చెప్పడం లేదు నేనీమాట... పురుషులయినా స్త్రీలయినా!" అన్నాడు రాజారాం.

"అమ్మా! తల్లీ! అంటూ కృత్రిమ ప్రేమలు నటించడం నాకు నచ్చని పని. మీరు మీరుగానే ఉండండి. ఈ ద్వేషం తరతరాల అణచివేత నుంచి వచ్చింది. అయినా డెబ్భైలు దాటిన మీరు బస్సుల్లో ప్రయాణించడం దేనికి? కార్లలో పోలేరా? మీ పిల్లలు మిమ్మల్ని మీరు కోరిన చోట దింపలేరా? ఎందుకు దింపుతారులే? వాళ్ళూ మగవాళ్ళే కదా! వాళ్ళకు మీ ఆస్తులు కావాలి కాని మీరొద్దు..."

నీరజ మాటలకు చిన్నగా నవ్వాడు రామస్వామి. బస్సు లక్డీకపూల్ దాటి ముందుకెళ్తుంది. కండక్టర్ దింపేవాళ్ళను దింపుతూ, ఎక్కేవాళ్లకు టికెట్లు ఇచ్చి వచ్చి వాళ్ళ దగ్గర నిల్చుంటున్నాడు.

"రాజారాంకు, నాకు ఏ వయసు అమ్మాయినైనా అమ్మా.. తల్లీ అని పిలువడం అలవాటయిందమ్మా! అమ్మాయిల్లో మేము మా అమ్మలను చూసుకుంటాం. మేమెందుకు బస్సుల్లో ప్రయాణం చేయాలన్నావు కదమ్మా! రాజారాం నా కొలీగ్. రిటైర్‌మెంట్ అయ్యేవరకు నీతి, నిజాయితీలతో పనిచేసాం. జీతం తప్ప మరో రూపాయి అక్రమ సంపాదనాశించలేదు. ఆ జీతం పిల్లలను చదివించడానికి, పెళ్ళిళ్ళు ఉద్యోగాల్లో స్థిరపడేట్టు చేయడానికే సరిపోయింది. అతి కష్టంగా చిన్న ఇల్లు మాత్రం కట్టుకున్నాం. పెన్షన్ కూడా లేదు. ఇక కారు, డ్రైవర్ ఎక్కన్నుంచొస్తాయమ్మా! మా కొడుక్కు, కూతురుకు కూడా మమ్మల్ని ఎక్కడికైనా తీసుకెళ్లి తీసుకొచ్చేంత తీరిక ఓపిక ఉంటాయా తల్లీ! ఎవరి బిజీ వాళ్ళది..'' అన్నాడు రామస్వామి.

ఆ మాటల గురించి ఆలోచిస్తుంది నీరజ.

''మేడమ్‌గారూ! మీ వ్యక్తిగత జీవితం విషాదకరంగా ఉందని మీరు పురుషజాతినంతా వ్యతిరేకిస్తున్నారు. తుదకు మీ తాత, తండ్రి వయసున్న వాళ్లను కూడా! మీ జీవితభాగస్వామి మాత్రమే మగవాడు కాదుకదా! మీ సోదరుడు, తండ్రి, కొడుకు, తాత, మనవడు కూడా మగవాళ్ళే. వాళ్ళు బస్సెక్కినా మీరు అదే మాటంటారా?'' అన్నాడు మల్లేశం.

"తండ్రయినా, తాతయినా, కొడుకయినా, నాకు మాత్రమే కదా! మిగతా స్త్రీలకు తండ్రో, తాతో కాదు కదా! వాళ్ళ పట్ల ఆ మగమహారాజు ప్రవర్తనెలా ఉంటుందో వెనక్కి చూడండి తెలుస్తుంది. అమ్మాయిలను రాసుకుంటూ, తోసుకుంటూ, ప్రైవేట్ పార్ట్స్‌పై చేతులేస్తూ ఎంత అసహ్యంగా ప్రవర్తిస్తున్నారో చూడండి!"

నీరజ మాటల్లోని అర్ధసత్యాలను గమనించారు వాళ్ళు.

"అదుగో... పెద్దమనిషని లేచి లేడీస్ సీటిచ్చినందుకు ఆ ముసలి పీనుగు ఎలా ప్రవర్తిస్తున్నాడో చూడండి. నిల్చున్న, పక్కనున్న అమ్మాయిలను తాకుతూ ఎలా ఏమెరుగనట్లు అమాయకంగా ప్రవర్తిస్తున్నాడో చూడండి." అంది నీరజ ప్రక్కనున్న శారద.

"ఆడదానిని చూడ అర్థంబు చూడను.. బ్రహ్మకైనను పుట్టు రిమ్మ తెగులు' అన్నారు కదా మన పెద్దలు..." తనో పెద్ద జోక్ వేసినట్టు నవ్వుతూ అన్నాడు బస్సులో హాంగర్‌ను పట్టుకొని వేలాడుతున్న యువకుడు.

"తిక్కతిక్కగా ఉందా. డ్రైవర్‌సాబ్ బస్సాపు" మల్లేశం అరవగానే బస్సాగింది.

"నువ్వు బస్సు దిగు ఫస్టు. ఇలాంటి వాళ్ళుండడం వల్లనే పురుషులపై ద్వేషం పెరుగుతుంది. ఆర్.టి.సి.కి కూడా చెడ్డ పేరొస్తుంది." అని ఆ యువకుణ్ణి బలవంతంగా బస్సు దింపాడు కండక్టర్.

"మంచిని చేసారు కండక్టర్ సార్!" అన్నారు బస్సులోని చాలామంది.

బస్సు అమీర్‌పేట దాటినా నత్తనడకే నడుస్తుంది. బస్సులోనే కాదు, రోడ్లపై కూడా భూమీనినట్లుగా జనం, వాహనాలు.

"తల్లీ! ప్రతి స్త్రీ పురుషుడిలో మనుమడిని, కొడుకును, తండ్రిని, సోదరుని, తాతను చూసుకుంటే ద్వేషం స్థానంలో ప్రేమ మొలకెత్తుతుంది!"

రామస్వామి మాటలు ఎంతో ఆలోచింపదగ్గవిగా అనిపించాయి వాళ్ళకు. నీరజ కూడా ఆ వృద్ధుడి మాటల గురించాలోచిస్తుంది.

"మరి పురుషుడు, స్త్రీలో ఏం చూసుకోవాలి?" అందో నడివయస్కురాలు.

"ప్రతి పురుషుడు స్త్రీలో తన మనుమరాలిని, కూతుర్ను, సోదరిని, అమ్మను, అమ్మమ్మను చూసుకుంటే వక్రదృష్టికి స్థానముండదు. ఇలాంటి ప్రయాణాలు హాయిగా సాగుతాయి!" అన్నాడు రాజారాం.

ఆ మాటలూ అందరికీ ఆలోచనాత్మకంగానే కనబడ్డాయి.

''బాపూ! మీరిద్దరూ ఒకే ఆకున చదువుకున్నట్టున్నారు. మీరు చెప్పినట్లు చేస్తే స్త్రీ, పురుష సంబంధాల్లో గణనీయమైన మార్పు వస్తుంది!" అన్నాడు మల్లేశం.

వాళ్ళ మధ్య సంభాషణ ఆసక్తికరంగా సాగుతుంది. వారి సంభాషణలు వింటున్న ప్రయాణీకులకు ఆ బస్సొక బోధివృక్షంగా కనబడుతుంది. వెకిలి చేష్టలు చేయాలనుకున్న యువకుల్లోనూ మార్పు కనబడుతుంది.

"సార్! మీరు స్త్రీ పురుషులు పరాయివాళ్ళ విషయంలో ఎలా ప్రవర్తించాలో చెప్పారు కాని, స్త్రీ పురుష సంబంధాలెలా ఉండాలో చెప్పలేదు'' అన్నాడో యువకుడు. అతడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సోషియాలజీలో పిహెచ్‌డి చేస్తున్నాడు.

"తల్లీ! నీ పేరేంటో జ్ఞాపకం లేదు. నీరజ కదూ! నువ్వు నా కూతురంత వయసున్న దానివి. జ్ఞానానికి, వయసుకు సంబంధం లేదనుకో! ఈ కాలపు యువతీ యువకుల్లోనూ పూర్తి యాంత్రికంగా బతికే వారున్నా.. అద్భుతమైన మానవీయ ఆలోచనా సరళి ఉన్నవారూ ఉన్నారు. జీవితాన్ని సుఖమయం చేసుకోవాలన్నా, దుఃఖభాజనం చేసుకోవాలన్నా.. అది మన చేతుల్లోనే ఉంది. స్వర్గం, నరకం అంటూ వేరే ఏముండవు. సుమతీకారుడు చెప్పినట్లు తన సుఖమే స్వర్గం, దుఃఖమే నరకం!" అన్నాడు రామస్వామి.

తన ముందు సీట్లో కూర్చున్న రామస్వామి దిక్కే చూస్తుంది నీరజ.

"పాఠాలు అందరూ చెబుతారు. ఆచరించడమే ముఖ్యం..." అంది వాసంతి.

"సార్! భార్యాభర్తల సంబంధం గురించి చెబుతనన్నారు.... చెప్పండి!"

మల్లేశం మాటలకు ఔను అన్నట్లుగా తలూపాడు రామస్వామి.

"రాజు అంటే దైవాంశ సంభూతుడు! భర్త అంటే దైవం లేక యజమాని అనుకున్నప్పుడు, ఆ సంసారం యజమాని బానిస సంబంధమవుతుంది తప్ప.. భార్యాభర్తల సంబంధం కాదు! భార్య చరణదాసీ కాదు. కేవలం శయ్య సుఖాలనిచ్చే ఆడదీ కాదు. భార్యంటే సహధర్మచారిణి. సహచరి. మంచి స్నేహితురాలు. భార్యాభర్తల మధ్య ఆధిక్యతా భావం, ఆత్మన్యూనతా భావముంటే అది సంసారం కాదు. భార్యను కార్యేషు దాసి. శయనేషు రంభగా భావిస్తే అది యజమాని సేవక, వేశ్యా సంబంధమవుతుంది తప్ప భార్యాభర్తల సంబంధం కాదు. ఇలాంటి పురుషాధిక్య ఆలోచనా విధానం వల్లనే స్త్రీ అణచివేతకు గురిచేయబడుతుంది. భార్యాభర్తలది కామమయ సంబంధం కాదు ప్రేమమయ సంబంధం. స్నేహితుల్లా, సమానస్కంధుల్లా, సంసారనావను ఈదడానికి ఉపయోగపడే జోడెద్దుల్లా భార్యాభర్తల సంబంధముంటే ఆ సంసారంలో సుఖముంటుంది. అది లేదు కాబట్టే స్త్రీ వాదాలు, నీరజలాంటి స్త్రీవాదోద్యమకారులు రావాల్సిన అవసరం ఏర్పడింది. ఇలాంటి మహిళోద్యమాలను సమర్ధించే వాళ్ళలో నేనూ ఒకన్ని!" అన్నాడు నీరజ ముఖంలో జరుగుతున్న మార్పులను గమనిస్తూ...

ఆమెలో అంతఃసంఘర్షణ చెలరేగుతుంది.

"భార్యాభర్తల మధ్య ఉండాల్సింది దేవుడు భక్తురాలు సంబంధం కాదు. భర్తంటే వేల్పు కాదు. పెద్ద చిన్న సంబంధమూ కాదు. ఒకరినొకరు ప్రేమించుకునే ధర్మబద్ధమైన మానవీయ సంబంధం. ఈ ప్రపంచంలో మానవజాతి శాశ్వతంగా ఉండాలంటే ధర్మబద్ధమైన కుటుంబ వ్యవస్థ ఉండాలి. అట్లని అనునిత్యం సంఘర్షిస్తూ, కలహాలతో గడిపే కంటె విడిపోయి తమ ఇష్టమున్నట్టు బతుకడం మంచిది. కుల మత జాతి దేశం, సామాజిక, ఆర్థిక అంతరాలకు అతీతంగా ప్రేమ వివాహాలు జరిగితే స్త్రీ పురుష సంబంధాలు మెరుగుపడుతాయి!" అన్నాడు రాజారాంగారు.

బస్సులోని చాలామందికి ఆ మాటలు నచ్చినా, బహిరంగంగా వాటిని సమర్థించడానికి ఎవరూ సిద్ధంగా లేరు.

విజయ్ టార్చర్‌ను భరించలేక విడిపోయి బతుకుతున్న నీరజకు, తాను జీవితమంతా ఒంటరిగా బతుకడం సరైందేనా అన్న ఆలోచన రాకపోలేదు. ఆమెలో జరుగుతున్న సంఘర్షణను గమనిస్తున్నాడు మల్లేశం.

"మేడమ్! సీనియర్ సిటిజెన్లు అంటే కేవలం వయసు మళ్ళిన, ఎముకలు కుళ్ళిన ముసలివాళ్ళు కాదు. ఆరేడు దశాబ్దాల సుదీర్ఘ జీవితానుభవాలను జీర్ణించుకున్న జ్ఞానులు. సమాజంలో జరుగుతున్న అనేక మార్పులకు నిలువెత్తు సాక్ష్యాలు. వీళ్ళను ముసలివాళ్ళనో, ముసలోల్లనో కించపరచడం మనల్ని మనం కించపరుచుకోవడమే అవుతుంది. వీళ్ళలో మూడు తరాల అనుభవ, జ్ఞాన సంపద నిక్షిప్తమై ఉంది. గతం లేనిదే వర్తమానం లేదు. వర్తమానంతోనే భవిష్యత్తు నిర్ణయింపబడుతుంది. ఇలాంటివాళ్ళ జ్ఞాన సంపదను భవిష్యత్తరాలు ఉపయోగించుకోవాలి. వీళ్ళకెందుకు సీట్లు రిజర్వ్ చేయాలంటే.. సంపూర్ణ జీవితాన్ని విజయవంతంగా గడుపుతున్నందుకు, వయసుతో వచ్చిన వైకల్యాన్ని జయించడానికి!" అన్నాడు.

"మల్లేశంగారూ! బాగా చెప్పారు మీరు. మీకు వృద్ధులంటే ఎంత ప్రేమ?" అన్నాడు... వాళ్ళ సంభాషణ వింటున్న రవీందర్. ఆ మాటలు వినికూడా మాట్లాడని నీరజ దిక్కు చూస్తూ...!

"మేడమ్! ఇలాంటి వృద్ధులే, వీళ్ళ తరం వాళ్ళే, తాము కరిగిపోతూ పిల్లల నెదిగించారు. తాము చదువుకోకున్నా పిల్లలను చదివించారు. తమ కుటుంబాలు జీవితాలను గెలుచుకుంటానికి అష్టకష్టాలు పడ్డారు. నా కోసం మా నాన్న, తమ పిల్లల కోసం నాన్న తరం వాళ్ళు.. తాము కొవ్వొత్తులా కరిగిపోతూ కుటుంబాలకు వెలుగునిచ్చారు. కాని వృద్ధాప్యంలో సరైన ఆదరణ లేక నానా ఇబ్బందులు పడే వాళ్ళెంతో మందున్నారు. తమ పిల్లల తరం లేదా మనుమల తరం కార్లలో, విమానాల్లో తిరుగుతుంటే వీళ్ళు కాలినడకన, బస్సుల్లో తిరగడం వెనుక ఎంత వేదనుందో అర్థం చేసుకోండి మేడమ్! మనదేశంలో వృద్ధులకు.. కనీసంగా విదేశాల్లోలానైనా భద్రత లేదు. వృద్ధాప్య పెన్షనూ లేదు. తల్లిదండ్రుల సంపాదన పిల్లలకు చెందుతుంది కాని, పిల్లల సంపాదన తల్లిదండ్రులకు చెందడం లేదు. బస్సులో రెండు ముందు సీట్లు కేటాయించినందుకు ఇంతరభసచేసారు. చందానగర్ వచ్చేసింది. మీరు బస్సు దిగండి. వృద్ధం శరణం గచ్ఛామి... ఈ జ్ఞానవృద్ధులనాదుకుందాం మేడమ్!" అన్నాడు కన్నీళ్లు తుడుచుకుంటూ మల్లేశం.

ఆ మాటలు వింటున్న నీరజ కళ్ళ వెంట కూడా ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. ఆమె సీట్లోంచి లేచి వృద్ధుల దగ్గరికొచ్చింది.

''బాపూ! నాన్నా! పురుష ద్వేషంతో నా కళ్ళు మూసుకుపోయాయి. మీ ప్రవర్తనతో, మాటలతో నా కళ్ళు తెరిపించారు. నన్ను క్షమించండి!" అని రామస్వామి, రాజారాం కాళ్ళకు నమస్కరించింది నీరజ.

మరికొద్దిసేపట్లో లింగంపల్లి బస్టాపు వచ్చేసింది. ఆ వృద్ధులిద్దర్నీ చేయిపట్టి బస్సు దింపాడు మల్లేశం.

గేటు దాటి బిహెచ్ఇఎల్ టౌన్‌షిప్ లోకి మెల్లమెల్లగా నడుస్తున్నారు రామస్వామి, రాజారాం!

# దశమ గ్రహం

గండ్రకోట సూర్య
✆ 9666903960

*'ఎన్నడూ తన తండ్రితో ఆయన అంత కఠినంగా వ్యవహరించలేదు. అలాంటిది ఈరోజు అలా మాట్లాడారంటే ఆయనకు ఎవరైనా లేనిపోనివి నూరిపోసివుండాలి. అలా చేసింది అత్తగారా అంటే, ఆవిడ పోయి సంవత్సరమైంది. పోనీ మామగారు చెప్పారా అంటే ఆయనసలు ఇలాంటి విషయాల జోలికి వచ్చే మనిషే కాదు. ఎవరో స్నేహితులు ఇలా ఆయనను రెచ్చగొట్టివుంటారు. లేకుంటే ఆయన అలా మాట్లాడేవారు కాదు'*

"ఏమ్మా! అల్లుడు, మీ మామగారు ఇంకా రాలేదు?" అడిగాడు శ్రీమన్నారాయణ తన పెద్ద కూతురు వందనని.

"అదే చూస్తున్నాను నాన్నా! అమ్మ కూడా అదే అడుగుతోంది. ఆయనకు ఇందాకే ఫోన్ చేశాను. ఊరినుంచి బయల్దేరారట. హోటల్లో దిగి, రిఫ్రెష్ అయ్యాక వస్తామని చెప్పారు!~" చెప్పింది వందన.

"ఔనా! నేను వేదిక మీద ఉంటాను గదా. వాళ్ళని గమనిస్తానో లేదో... అందుకే వాళ్ళు రాగానే నాకు చెప్పు. అలాగే మీ బాబాయికి చెబితే వాళ్ళకి తగిన మర్యాదలు చేస్తాడు. లేకుంటే తర్వాత మనకి మాట వస్తుంది!" అని ఆయన అనటంతో "అలాగే నాన్నా!" అందామె.


సిటీలో ఓ మోస్తరు పెద్ద ఫంక్షన్‌హాల్లో శ్రీమన్నారాయణ చిన్న కూతురు పెళ్లి సంరంభాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఫెళఫెళలాడుతున్న పట్టుచీరలతో ఆడవాళ్ళూ, పట్టుపంచెలలో, కొత్త కొత్త బట్టల్లో మగవాళ్ళూ హడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. పెళ్ళికూతురు గౌరీపూజలో ఉంది.

శ్రీమన్నారాయణ మనసు ఎంతో ఉద్వేగంగా ఉంది. 'తానొక మధ్యతరగతి ఉద్యోగి. నాలుగేళ్ల క్రితం ఎంతో కష్టపడి ఎలాగోలా వందన పెళ్లి చేసేశాడు. అప్పటికన్నా ఇప్పటి పరిస్థితి కొంత నయం! ప్రమోషన్ వచ్చి, కాస్త జీతం పెరగటంతో చిన్నకూతురికి కాస్త మంచి సంబంధమే తీసుకురాగలిగాడు. రెండో అల్లుడు అమెరికాలో ఉద్యోగం చేస్తుండటంతో, కట్నంకూడా పెద్ద అల్లుడి కన్నా నాలుగురెట్లు ఎక్కువే సమర్పించుకోవాల్సి వచ్చింది. అందుకోసం తన పీఎఫ్ లోంచి కొంత డబ్బు డ్రా చెయ్యాల్సి వచ్చింది. ఈ పెళ్లి జరిగిపోతే మరో సంవత్సరంలో రిటైరవ్వబోతున్న తన బరువు బాధ్యతలన్నీ తీరిపోతాయి' అందరికీ ఏవేవో సూచనలిస్తూ, పెళ్లి పనులు పర్యవేక్షిస్తూ, అటూ ఇటూ తిరుగుతున్నా ఆయన మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతూనే ఉన్నాయి.

దూరప్రాంతం నుంచి పెళ్ళికి వచ్చే మగపెళ్ళివారి కోసం హోటల్లో రూములు బుక్ చేయబడ్డాయి. అలాగే తన వైపు బంధువులకు కొంతమందికి కూడా హోటల్లో బస ఏర్పాటు చేశాడు. అప్పటికీ ఇంకా కొంతమంది బంధువులు రావాల్సి వుంది.

తన పెద్దకూతురు వందన అత్తగారు కాలం చేసి సంవత్సరం దాటింది. అల్లుడి కోరిక మేరకు తన వియ్యంకుడికి, అల్లుడికి కూడా హోటల్లో ఒక స్పెషల్‌రూమ్ బుక్ చేసి ఉంచాడు.

ముహూర్తానికి ఒక్క గంట సమయమే ఉండటంతో, వేదికపైన పెళ్లి కార్యక్రమాలు మొదలయ్యాయి. సరిగ్గా ఆ సమయంలో శ్రీమన్నారాయణ పెద్దఅల్లుడు దశరథం ఆ పెళ్లి మండపం దగ్గరికి వచ్చాడు.



అతన్ని చూస్తూనే వందన అతనికి ఎదురెళ్ళి “నాన్నగారు ఇందాకటి నుంచి మీ కోసం ఎదురు చూస్తున్నారు. అవునూ... ఒక్కరే వచ్చారేం? మామగారేరి?” అని అడిగింది.

“ఆ సంగతి తర్వాత చెప్తాను గానీ, ముందు మీ నాన్న ఎక్కడ ఉన్నాడో చెప్పు” అని అతడు అడిగాడు కాస్త గట్టిగా.

అతని ముఖంలో ఏదో తెలియని భావం కనిపించిందామెకు. అలాగే అతని మాటతీరు కూడా చాలా కొత్తగా అనిపించింది. ఎప్పుడూ ఆమె తండ్రిని ‘మామయ్యగారు’ అనే అతడు సంబోధిస్తుంటాడు. అలాంటిది అలా ఏకవచన ప్రయోగం చేసేసరికి “ఏమిటి అలా ఉన్నారు? అంతా ఓకే కదా?” అని అడిగింది.

"ఆ! ఓకేనేలే. ముందు మీ నాన్నని పిలువు" అన్నాడు. అతని వాలకం చూసి ఏదో జరిగిందని ఆమెకు అనుమానం కలిగింది.

ఇంతలో వేదిక నుంచి కూతురితో మాట్లాడుతున్న దశరథాన్ని చూస్తూనే శ్రీమన్నారాయణ అక్కడికి వచ్చి, "ఏంటి అల్లుడుగారూ! మీరొక్కరే వచ్చారు? మా బావగారేరీ?" అని అడిగాడు.

"ఆ సంగతులన్నీ తర్వాత... ముందు నాకు ఇది చెప్పండి. మీ రెండో అల్లుడికి పదిలక్షల కట్నం ఇస్తున్నారు. పైగా అతడికి కారు కొనిస్తానని మాట ఇచ్చారట. నాకు ముష్టి మూడు లక్షలు కూడా ఇవ్వలేదు. పైగా బైక్ అడిగితే ఇవ్వటం కష్టమని అన్నారు. ఇదెక్కడి అన్యాయం మామయ్యగారూ? చిన్నల్లుడికి ఒక న్యాయం. పెద్దల్లుడికి మరో న్యాయమా?" అంటూ నిలదీశాడు.

ఆ మాటలు విని శ్రీమన్నారాయణ బిత్తరపోయాడు. ఇంతకాలం తన పెద్దల్లుడు ఎన్నడూ నోరు తెరిచి తనకు ఇది కావాలీ అని అడిగింది లేదు. ఇప్పుడు ఉన్నట్లుండి ఇలా ఆడగటంతో ఆయనకు దిక్కుతోచలేదు. అప్పుడు వందన కల్పించుకుని, "అదేమిటండీ. ఈ సమయంలో మీరు మాట్లాడవలసిన మాటలేనా?" అన్నది.

"నువ్వు నోర్ముయ్. మీ నాన్నకు వత్తాసు పలకటానికి వచ్చావా? మొగుడికి రావాల్సినవి ఇప్పించాలనే బుద్ధిలేదు. పైగా నాకే నీతులు చెప్తున్నావా? ముందు నువ్విక్కడి నుంచి వెళ్ళు. నేను మామయ్యగారితో మాట్లాడాలి" అంటూ ఆమెపై మండిపడ్డాడు.

అప్పుడే తన తల్లి అక్కడికి వస్తూ "ఏమిటీ? అంతా ఇక్కడున్నారు?" అంటూ వస్తూండటం చూసిన వందన, ఆవిడకు ఎదురెళ్ళి, "ఏమీ లేదులే. నువ్వు పద. అక్కడ పంతులుగారు ఏమో కావాలని అడుగుతున్నారు. ముహూర్తం దగ్గర పడుతుంటే నువ్వు ఇక్కడ ఉంటే ఎట్లా?" అంటూ ఆమెను అక్కడినుంచి లాక్కుపోయింది.

"బాబూ! అక్కడ ఒకవైపు ముహూర్తం మించిపోతోంది. ఈ సమయంలో మీరిలా మాట్లాడటం భావ్యం కాదు. మనం తర్వాత మాట్లాడుకుందాం. దయచేసి మీరు పెళ్లి వేదిక మీదకు రండి" అంటూ అభ్యర్థించాడు శ్రీమన్నారాయణ.

"కుదరదు మామయ్య గారూ! నాకు ఇప్పుడే ఏ విషయమూ తేల్చాల్సిందే. పోనీ... మా పెళ్లప్పుడు మీకు ఇచ్చుకునే స్తోమత లేదు. ఇప్పుడు మీ పరిస్థితి బాగానే ఉందిగా... కాబట్టి చిన్నల్లుడికి ఇచ్చినట్టే నాకూ ఇప్పుడే ఇవ్వండి. లేదంటే నేను వెళ్లిపోతాను!" అన్నాడు దశరథం కరాఖండీగా.

"ఆ సంగతి తర్వాత చూద్దాం. ముందు మీరు రండి" అంటూ శ్రీమన్నారాయణ మాట మార్చబోయినా దశరథం తన పట్టు వీడలేదు. భార్య వైపు తిరిగి "వందనా! చూసావుగా ఇక్కడ నాకు జరుగుతున్న అన్యాయం. ఇంత జరిగాక నేనిక్కడ ఉండటం అనవసరం. అయితే మీ చెల్లి పెళ్లి చూడకుండా నిన్ను లాక్కువెళ్ళేంత దుర్మార్గుడిని కానులే! నువ్వుండు. పెళ్లయ్యాక వెంటనే బయల్దేరి రా. నేను వెళ్తున్నాను" అని చెప్పి, విసవిసా అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

దాంతో వందన ఎంతగానో బాధపడింది. సమయం కాని సమయం చూసుకుని, తనని బ్లాక్‌మెయిల్ చేసిన తన అల్లుడిపై శ్రీమన్నారాయణకు మాత్రం ఎక్కడలేని కోపం వచ్చింది.

విషయం తెలిసిన ఆయన బావమరిది "పోతే పోనీ బావా! ఇష్టమైనవాళ్ళు ఉంటారు. లేనివాళ్ళు పోతారు. అల్లుడంటేనే దశమగ్రహం. బ్రతిమాలుతున్నకొద్దీ, నెత్తినెక్కేవాళ్ళని అస్సలు లెక్క చేయొద్దు!" అన్నాడు ఆయనతో. ఆ పెళ్ళికి వచ్చిన కొంతమంది బంధువులు కూడా అవునవునంటూ అతనికి వంతపాడారు.

నిజానికి పెద్దల్లుడంటే ఆయనకు ఎంతో అభిమానం. వివాహ సమయంలో అప్పోసొప్పో చేసి, ఎక్కువ కట్నం తెచ్చి ఇస్తానన్నా, అతడే స్వయంగా అప్పులు చెయ్యవద్దని మామగారిని వారించాడు. డబ్బు విషయంలో ఎన్నడూ అతడు మామగారిని పీడించి ఎరగడు. అవసరమైతే ఎదురుసాయం చెయ్యటం అతని నైజం! తన చిన్నకూతురికి పెళ్లి సంబంధం చూడటం దగ్గర్నుంచి, పెళ్లి మండపం కుదర్చటం వరకూ, మేళం వాళ్ళనీ, వంటవాళ్ళనీ మాట్లాడటం, వీడియోగ్రాఫర్నీ తీసుకురావటం అన్ని పనుల్లో అతడు ఎంతో సాయంచేశాడు.

అలాంటివాడు ఇప్పుడొచ్చి అలా మాట్లాడేసరికి, ఆయనకు మొదట కోపం వచ్చినా, ఆ తర్వాత తమాయించుకున్నాడు. 'అతను అన్నదానిలో తప్పేముంది? నిజమే కదా! చిన్నల్లుడికి కొన్ని మర్యాదలు చేసినప్పుడు, పెద్దల్లుడికి కూడా అలాంటి మర్యాదలే చెయ్యాలికదా! కనీసం చేస్తానని ముందే అతనికి మాటైనా ఇవ్వాలి కదా! అదేమీ చెయ్యకుండా తాను తప్పు చేశాడు. ఇప్పటికైనా అతన్ని సముదాయించి, పెళ్ళికి పిలవాలి' అనుకుని, వందనతో "అమ్మా! నిజంగా తప్పు నాదే. అల్లుడికి ఇవ్వాల్సిన మర్యాద ఇవ్వలేదు. మీ ఆయన్ని ఎలాగైనా సరే పిలువు. ఆయన అడిగినవన్నీ ఇస్తానని నా మాటగా చెప్పు. ఆయన కోపం పోగొట్టే బాధ్యత నీదే తల్లీ" అన్నాడు.

భర్త వాలకం వందనకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. 'ఎన్నడూ తన తండ్రితో ఆయన అంత కఠినంగా వ్యవహరించలేదు. అలాంటిది ఈరోజు అలా మాట్లాడారంటే ఆయనకు ఎవరైనా లేనిపోనివి నూరిపోసివుండాలి. అలా చేసింది అత్తగారా అంటే, ఆవిడ పోయి సంవత్సరమైంది. పోనీ మామగారు చెప్పారా అంటే ఆయనసలు ఇలాంటి విషయాల జోలికి వచ్చే మనిషే కాదు. ఎవరో స్నేహితులు ఇలా ఆయనను రెచ్చగొట్టివుంటారు. లేకుంటే ఆయన అలా మాట్లాడేవారు కాదు' అనుకుని, భర్తకు ఫోన్ చేసింది.

ఫంక్షన్‌హాల్ నుంచి బయటికి వచ్చి, బస్ కోసం ఎదురుచూస్తున్న దశరథం వెంటనే ఫోన్ తీశాడు. ఆమె తన తండ్రి చెప్పిందంతా చెప్పి, 'ఇలాంటి సమయంలోనా మీ పట్టింపులు? వెంటనే వచ్చెయ్యండి" అని చెప్పింది.

"సరే. నీ మాట మీద వస్తాను. కానీ నన్నక్కడ భోజనం చేయమని బలవంతం చేయవద్దు. నువ్వు కూడా నాతో బయల్దేరి రావాలి. అలా వస్తానంటేనే, నేను ఆ పెళ్ళికి వస్తా" అన్నాడు.

ఎలాగోలా అతడు పెళ్ళికి వస్తే చాలు. మిగిలిన సంగతి తర్వాత చూసుకోవచ్చుననుకున్న ఆమె, "అలాగే. పెళ్లవ్వగానే మీతో బయల్దేరివస్తాను. సరేనా! మీరు వెంటనే రండి" అన్నది.

అన్నట్లే అతడు వచ్చాడు. తనకేమీ పట్టనట్టు దూరంగా కూర్చున్నాడు. అందరితోనూ అంటీముట్టనట్టే ఉన్నాడు. భార్య వచ్చి పలకరిస్తే మామూలుగా మాట్లాడాడు. అతడు రావటం చూసి, శ్రీమన్నారాయణ పెళ్ళివేదిక మీద నుంచి దిగివచ్చి అతన్ని పలకరించాడు. దానికి అతడు ముక్తసరిగా సమాధానం చెప్పాడు. 'అతడు పెళ్ళికి వచ్చాడు అదే పదివేలు' అనుకున్న ఆయన మళ్ళీ వేదిక మీదకు వెళ్ళిపోయాడు.

వధూవరులు ఒకరితలపైన ఒకరు జీలకర్ర బెల్లం పెట్టుకోవటం ఆలస్యం, దశరథం, తన భార్యను తీసుకుని అక్కడనించి వెళ్ళిపోయాడు. తమ పెద్ద కూతురు, అల్లుడు అలా వెళ్లిపోవటం చూసి ఆమె తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. ఒక్క పెద్దల్లుడి కోపం మినహాయిస్తే, పెళ్లి బ్రహ్మాండంగా జరిగిపోయింది. అప్పగింతల కార్యక్రమం కూడా దిగ్విజయంగా ముగిశాక, మగపెళ్ళివారు అమ్మాయిని తీసుకుని వెళ్లిపోయారు.

ఆ మర్నాడే తన భార్యతో కలిసి, చిన్నకూతురి అత్తగారింట్లో జరగబోయే సత్యనారాయణ వ్రతానికి శ్రీమన్నారాయణ దంపతులు బయల్దేరుతుండగా, కొత్త వియ్యంకుడి నుంచి ఒక ఫోన్ కాల్ వచ్చింది. 'తమ కొడుకుని ఆతని ఆఫీస్ వాళ్ళు ఏదో అత్యవసర పని ఉందని బెంగళూరుకు పిలిచారనీ, దాంతో తమ ఇంట్లో జరప తలపెట్టిన సత్యనారాయణ వ్రతాన్ని నాలుగురోజుల పాటు వాయిదా వేసుకోవాల్సివచ్చిందనీ' ఆ ఫోన్ సారాంశం.

అటు వెళ్ళే పని తప్పటంతో, అలిగిన తన పెద్దల్లుడిని సముదాయించటానికి, శ్రీమన్నారాయణ తన భార్యతో కలిసి మరునాడు ఉదయమే దశరథం వాళ్ళ ఊరికి ప్రయాణం కట్టాడు.

★★★

తన వియ్యంకుడి ఇంటి దగ్గర వాతావరణం గంభీరంగా ఉండటం దూరం నుంచే గమనించాడు శ్రీమన్నారాయణ. తీరా ఇంటి దగ్గరికి వెళ్ళేసరికి, ఇంటిముందు ఫ్రీజర్‌బాక్స్‌లో తమ వియ్యంకుడి శవం కనిపించి అతడు నిశ్చేష్టుడయ్యాడు. ఆయనకు నోట మాట రాలేదు. శవం పక్కనే వియ్యంకుడి చెల్లెలు పార్వతమ్మ కనిపించింది. ఆమె వాళ్ళని చూస్తూనే "అంతా అయిపోయిందయ్యా!" అంటూ భోరుమంది.

వాళ్ళని చూస్తూనే గడపలోపల నిలబడివున్న వందన వచ్చి, తన తల్లిని కౌగలించుకుని "అమ్మా!" అంటూ కన్నీరుపెట్టుకుంది. ఆశ్చర్యంలో మునిగిపోయిన శ్రీమన్నారాయణకు దూరంగా నిలబడి ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్న తన అల్లుడు కనిపించాడు. వెంటనే ఆయన అతని దగ్గరికి వెళ్ళి "బాబూ!" అని పిలిచాడు.

"వచ్చారా మామయ్యగారూ?" అన్నాడు ఆయన్ని చూస్తూనే.

"ఏంటి బాబూ సడెన్‌గా ఇలా? ఎప్పుడు జరిగింది?" అడిగాడాయన.

"నిన్న మామయ్యగారూ!" అన్నాడు.

దాంతో ఆశ్చర్యపోయిన ఆయన "ఏంటీ? నిన్ననా?" అని అడిగాడు.

"ఔనండీ. చందన పెళ్ళికని నాన్నా, నేనూ కలిసే సిటీకి వచ్చాం. హోటల్లో ఉండగా గుండెనొప్పి వచ్చింది. వెంటనే దగ్గరే ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్ళా. అక్కడే ప్రాణం పోయింది" అని చెప్పాడు.

"మరి మాకీ విషయం చెప్పనేలేదు..."

"పెళ్ళిపందిరిలో ఎలా చెప్పమంటారు మామయ్యగారూ?" అన్నాడు. ఇంతలో పంతులుగారు పిలవటంతో అటువైపు వెళ్ళాడు.

ఇంతలో ఆ పక్కనే ఉన్న వియ్యంకుడి తమ్ముడు "ఢిల్లీలో ఉన్న అన్నయ్య చిన్నకొడుకు కోసం శవదహనాన్ని ఆపారు బావగారూ! లేకుంటే మీకు ఈ చివరి చూపు కూడా దక్కేది కాదండీ" అన్నాడు.

అప్పుడు గానీ ఆయనకు తన అల్లుడి గొప్పతనం తెలిసిరాలేదు. 'అంటే పెళ్ళిపందిరి దగ్గర ఈ సంగతి అల్లుడు చెప్పివుంటే పెళ్ళి అర్ధాంతరంగా ఆగిపోయేది. అందుకే ఎంతో దూరాలోచన చేసి, అక్కడ ఈ సంగతి చెప్పకుండా, తనకు కట్నం డబ్బు

తక్కువ ఇచ్చారని తనని తూలనాడినట్లుగా మాట్లాడాడు. వందనని కూడా పెళ్లి పూర్తిగా చూడనీకుండానే తీసుకుని వెళ్ళిపోయాడు. అంటే అతడు తనతో మాట్లాడిందంతా నిజంగా కాదు. అక్కడి నుంచి త్వరగా వెళ్లిపోవటానికి అదో మిష అన్నమాట. దశరథాన్ని పెళ్ళికి వచ్చిన చుట్టాలు నానామాటలు అన్నారు. తాను కూడా అతన్ని అపార్థం చేసుకున్నాడు. 'జామాతా దశమ గ్రహః' అని చాలామంది అల్లుడిని ఆడిపోసుకుంటారు. కానీ ఎంతో సంస్కారం కలిగిన తన అల్లుడు దేవుడిలాంటివాడు. అతడి విశాల హృదయమే తన చిన్నకూతురి జీవితాన్ని నిలబెట్టింది' అనుకుంటూ వెళ్ళి తన వియ్యంకుడి పార్థివదేహానికి నమస్సులు అర్పించాడు. అంత గొప్ప మనసున్న తన అల్లుడికి కూడా మనసులోనే రెండుచేతులెత్తి వేనవేల నమస్కారాలు చేసుకున్నాడు.

# మానవత్వం ఖరీదు

**భాగవతుల సత్యనారాయణమూర్తి**
✆ 9440871667

> ***ఫీజు ఎంత కట్టాలో.. నిన్ను వదిలిపెట్టేది లేదు. నువ్వు జన్మలో ఊహించనంత ఫీజు తీసుకోబోతున్నాను, మానవత్వం లేకుండా ప్రవర్తించేవు కదా! మానవత్వానికి ఖరీదు కడుతున్నాను.***
> ***ఇదే మీ అమ్మ ప్రాణం ఖరీదు. అది చెల్లించు!" అంటూ***
> ***ఒక కవరు అందించింది చేతికి. ఇప్పి చూస్తే అది ఖాళీ కవరు.***
> ***నిర్ఘాంతపోయి 'మేడమ్' అన్నాడు***


'హైదరాబాదు నుండి విశాఖపట్నం వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ నాలుగవ నంబరు ప్లాటుఫారం నుండి బయలుదేరడానికి సిద్ధముగా వున్నది' అన్న ప్రకటన వినబడింది. నీరజ ఒక చేత్తో సూట్కేస్, మరో చేత్తో బ్యాగ్ ఈడ్చుకుంటూ దాదాపు పరిగెడుతున్నట్లు నడుస్తోంది. అత్తగారిని చక్రాల కుర్చీలో కూర్చోబెట్టి కూలీ గబగబా తోసుకుంటూ వస్తున్నాడు. మరికొన్ని సామాన్లు పట్టుకొని తన తమ్ముడు! తండ్రి పరిగెడుతూ వచ్చి బోగీలోకి సామాన్లన్నీ ఎలాగోలాగ తోసేసి... నీరజని, వాళ్ళ అత్తగారిని ఎక్కించారో లేదో బండి బయలుదేరిపోయింది.

నీరజ తన తమ్ముడి వివాహానికి తన అత్తగారిని తీసుకొని హైదరాబాద్ వచ్చింది. భర్త విశాఖపట్నంలో పోలీస్ అధికారి! ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సెలవు దొరక్క, సొంత బావమరిది పెండ్లికి కూడా రాలేని పరిస్థితి! నీరజ వృత్తిరీత్యా డాక్టరు! ఆమె వైజాగ్‌లో పేరు పడ్డ హృద్రోగ చికిత్స ప్రవీణురాలు! సొంత నర్సింగ్‌హోమ్ వుంది. నిమిషం తీరిక ఉండదు. రాత్రీ పగలూ సర్జరీలే! సొంత తమ్ముడి వివాహం కదా అని కొత్తకేసులు ఒప్పుకోకుండా, ఉన్న కేసులు జూనియర్ డాక్టర్లకి అప్పజెప్పి పెళ్ళికి హాజరైంది. తిరుగు ప్రయాణం అవుతోంది. ఆర్.ఏ.సి. కన్ఫర్మ్ అయింది కానీ ఇద్దరికీ అప్పర్ బెర్తులు దొరికాయి. టీ.టీ.ఈ.ని లోవర్ బెర్తుల కోసం బతిమాలింది. కానీ లాభం లేకపోయింది. 'చాలా ఆర్.ఏ.సి.లు కన్ఫర్మ్ కాలేదమ్మా, మీరే చూసుకోండి' అని సలహా ఇచ్చి వెళిపోయాడు తను. అత్తగారు వృద్ధురాలు, పైగా ఆమెకు కీళ్ళ నొప్పులు కూడా! కనీసం ఒకటైనా కింద బెర్తు దొరికితే బాగుండునని ప్రయత్నిస్తోంది పాపం. సెకెండ్ ఏసీ యేమో అందరూ కర్టెన్లు వేసుకొని కూర్చున్నారు. ఎదురుగా రెండు కింద బెర్తుల మీద ఇద్దరు అబ్బాయిలు పడుకొని ఉన్నారు. బండి బయలుదేరిన దగ్గరనుండి తను గమనిస్తోంది.. పడుకొని చెవిలో ఇయర్‌ఫోన్ వైర్లు తగిలించుకొని ఏవో వింటూనే వున్నారు. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం కూడా లేదు. వాళ్ళని పలకరించింది. జవాబు లేదు తెలుగువాళ్లు కాదేమోనని ఇంగ్లీష్‌లోనూ, హిందీలోనూ కూడా పలకరించింది. వాళ్ళ ధ్యానంలో వాళ్ళు ఉన్నారు. అస్సలు చలనం లేదు. తట్టి లేపింది ఇద్దరినీ!

ఏమిటన్నట్లు చిరాకుగా మొహం పెట్టారు వాళ్ళు. అడగవలసిన ప్రశ్న అడిగింది. ససేమిరా అన్నట్లు చేత్తోనే సమాధానం చెప్పారు ఇద్దరూ. చూస్తే పట్టుమని పాతికేళ్ళు కూడా ఉండవు ఇద్దరికీ. అంత పొగరా వీళ్ళకి అనుకుంది. మరోసారి బ్రతిమాలింది, కనీసం ఒక్క బెర్తయినా ఇమ్మనమని కోరింది. వెంటనే ఒకడు లేచి కూర్చుని... 'ఒకసారి చెబితే అర్థం కాదా మీకు, మేమివ్వం...' అన్నాడు.

కోపంగా చూస్తూ... 'ఓహో వీళ్ళు తెలుగువాళ్ళేనా' అని అనుకొని, "మా అత్తగారు పైకి ఎక్కలేరు, పైగా మోకాళ్ళు నొప్పికూడాను. ఏదో సాయం చేస్తారని అడిగాను" అంది నెమ్మదిగా.

"కుదరదని చెప్పాం కదా... అంత ఇదే ఉంటే, రిజర్వేషన్ ముందునుంచే చేయించుకోలేకపోయారా? లేదా విమానంలో తీసుకెళ్లక పోయారా? మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి" అన్నాడు.




చాలా కోపం వచ్చింది నీరజకి వాళ్ళ మీద. ఇంక వీళ్ళు ఎటూ ఇవ్వరని, "అది మీకు అనవసరం! విమానంలో ఎందుకు తీసుకెళ్ళటంలేదో మీకు చేప్పే అవసరం నాకు లేదు." అని కోపంగా అనేసి వచ్చేసింది.

ఇదంతా గమనిస్తున్న అత్తగారు "ఎందుకమ్మా వాళ్ళతో గొడవ పడతావు?" అంది.

"అదికాదత్తయ్యా వాళ్లకేం తెలుసు, మనం వెళ్ళవలసిన విమానం రద్దయితే, అప్పటికప్పుడు ప్రీమియం తత్కాల్ బుక్ చేసుకొని వస్తున్నామని! మానవత్వం లేదూ వీళ్ళకి!" అంది చిరాగ్గా.

ఇక లాభం లేదని పక్క సైడ్ లోవర్‌లో కూర్చున్న ఇద్దరు ఆర్.ఏ.సి. ప్రయాణీకులకు తన బెర్తులు ఇచ్చేసి, ఆ లోవర్ బెర్త్ మీద ప్రక్క సద్ది, అత్తగారిని పడుకోమంది, తను కాళ్ళ దగ్గర కూర్చుంటూ!

“అయ్యో అదేంటమ్మా, నువ్వు తెల్లవార్లూ కూర్చుంటావా? అసలే నువ్వు ఉట్టి మనిషివి కాదు కాదమ్మా!” అంది.

“ఏమీ ఫరవాలేదత్తయ్యా. నా సంగతి నేను చూసుకుంటాను! మీరు నిశ్చింతగా పడుకోండి.” అంది.

అత్తగారు బాధపడుతూనే కాళ్ళు జాపుకొని పడుకుంది.

★★★

సమయం రాత్రి పది దాటుతోంది. బండి చాలా వేగంగా పోతోంది. వెన్నెల రాత్రవడం చేత చందమామ తొంగి చూస్తున్నాడు. తనకు పుట్టబోయే బిడ్డ గురించి కలలు కంటూ, కిటికీలోంచి చూస్తూ ఏవో ఆలోచిస్తోంది, నీరజ.

తన పెళ్లయి ఏడాదయింది. మొదటి పెళ్లిరోజు ఆ మధ్యే ఘనంగా జరుపుకున్నారు దంపతులిరువురూ. అప్పటికే తను నెల తప్పింది. ఆ రోజు రాత్రి తను భర్తతో అన్న మాట గుర్తుకొచ్చి నవ్వుకుంది. ‘మనకి పుట్టబోయే బిడ్డ ఆడయినా, మగయినా ఎట్టి పరిస్థితిలోనూ డాక్టర్ని మాత్రం చెయ్యను’ అని తనంటే... ‘ఎట్టి పరిస్థితిలోనూ పోలీసు శాఖలో జాయిన్ చెయ్యను’ అని భర్తన్నాడు. ఎవరి బాధలు వాళ్ళవి కదా! దూరపు కొండలు నునుపని... అలా ఆలోచనల్లో మునుగుతూ, కునుకు తీస్తూ, మధ్య మధ్యన లేచి అత్తగారి దుప్పటి సద్దుతూ రాత్రంతా కాలక్షేపం చేసింది.

వైజాగ్‌లో బండి ఆగేసరికల్లా... ఎదురుగా భర్త ఒక చక్రాల కుర్చీ, ఇద్దరు పోలీసు కానిస్టేబుల్స్‌తో సహా కనబడ్డాడు.

కారు ఎక్కి, రాత్రంతా నిద్దర లేదేమో, ఈరోజు హాస్పిటల్‌కి రానని, మానేజ్ చేసుకోమని జూనియర్ డాక్టర్లకి ఫోన్ చేసి చెప్పేసింది. ఇంటికెళ్లి స్నానం, భోజనం చేసి, తన గదిలోకి వెళ్లి కాస్త వాలింది. సాయంత్రం నాలుగవుతూ ఉండగా హాస్పిటల్ నుంచి ఫోన్... “మేడమ్ ఒక ఎమర్జెన్సీ కేస్... రాగలరా?” అంటూ.

ఎంతయినా వృత్తి ముఖ్యం కదా! ‘కాస్త రెస్టు తీసుకున్నాను కదా, సర్లే’ అని వెంటనే బయలుదేరింది. రోగి ఒక స్త్రీ. దాదాపు అరవై ఏళ్ళు ఉంటాయి. ఆవిడ వితంతువని, కొడుకు తీసుకొచ్చాడని చెప్పింది నర్సు. రోగిని పరీక్షించి, ప్రాథమిక పరీక్ష చేసి, పరిశీలనలో ఉంచమని, అవసరమయితే శస్త్రచికిత్స చేయవలసి వస్తుందని చెపుతూ, వెంటనే రోగి తాలూకు కొడుకుని తన ఛేంబర్‌కి పంపమని చెప్పి వెళ్లిపోయింది నీరజ! కాస్సేపట్లో ఛేంబర్‌లోకి అడుగుపెట్టిన ఆ కుర్రాడిని చూసి ఉలిక్కిపడింది, నీరజ! ముందురోజు రాత్రి ట్రైన్‌లో మానవత్వం లేకుండా ప్రవర్తించిన ఇద్దరు కుర్రాళ్లలో ఒకడు వాడు. డా. నీరజని చూసి వాడి గుండె కూడా దాదాపు ఆగిపోయినంత పనయింది.

“ఓ... నువ్వా!” అంది వాడిని చూస్తూనే.

“నమస్కారం మేడమ్...” అన్నాడు తేరుకొని భయంభయంగా, చేతులు జోడిస్తూ రోగి కొడుకు రాము!

“ఓ... అంత సంస్కారం ఉందా నీకు? ఇప్పుడు నా అవసరం ఉంది కదా అని నమస్కారం పెడుతున్నావా? రాత్రి మానవత్వం లేకుండా ప్రవర్తించావు. ఇప్పుడు నీ తల్లి ప్రాణం నా చేతిలో వుందనా భయం? ఈ రాత్రంతా నీ తల్లిని పరిశీలనలో

ఉంచుతాము, అవసరమైతే రేపు శస్త్రచికిత్స చేయవలసి వస్తుంది. ఇక నువ్వు వెళ్లొచ్చు. వెళ్లి డబ్బు కట్టే ఏర్పాటులో ఉండు!" అని చెప్పి పంపించేసింది.

మొహం వేలాడేసుకుని వస్తున్న వాడిని చూస్తూ "ఏమయిందిరా, అలా ఉన్నావు?" అని అడిగేడు వాడి స్నేహితుడు.

"ఒరేయ్! కొంప మునిగిందిరా! ఈ డాక్టరు ఎవరనుకున్నావు? నిన్న ట్రైన్లో మనని లోవర్ బెర్త్ అడిగిన ఆవిడరా! నన్ను చాలా మాటలంది. నా తల్లి ప్రాణం తన చేతులో ఉందని భయపించింది కూడాను. నాకెందుకో భయంగా ఉందిరా!" అన్నాడు దీనంగా.

రాత్రి పదవుతూవుంటే వెయిటింగ్ హాల్‌లో కూర్చొని వున్నారు ఇద్దరు స్నేహితులూ! బాగా నిద్ర ముంచుకొచ్చేసిందేమో బెంచీ ఒకటి ఖాళీగా కనబడితే వెళ్ళి పడుకున్నాడు రాము. స్నేహితుడు మాత్రం కుర్చీలోనే కునుకు తీస్తున్నాడు. తెల్లవారుఝాము నాలుగవుతూ ఉంటే 'టీ' తీసుకొద్దామని బయటకి వెళ్ళేడు స్నేహితుడు. రాము పడుకునే ఉన్నాడు.

ఇంతలో 'మేడమ్ పిలుస్తున్నారని' నర్సు వచ్చి కబురు చెపితే, భయపడుతూ లోనికి వెళ్ళేడు రాము.

"రా... రా... నీ కోసమే ఎదురు చూస్తున్నాను. నీమీద పగ ఎలా తీర్చుకోవాలా అని అనుకున్నాను. వెంటనే అవకాశం కలిపించేవు. నా చేతిలో చిక్కాక, మీ అమ్మ ప్రాణం ఎలా దక్కుతుందనుకున్నావు? తన ప్రాణం పోయింది. నో... నో... పోలేదు, తీ... సే... సే... ను. బాడీ మార్చురీలో ఉంది, తీసుకుపో!" అంది.

"డాక్టర్! ఎంత పనిచేసావు? నామీద కోపం నా తల్లి మీద చూపిస్తావా? అయినా నేను చేసిన చిన్న తప్పుకి ఇంత పెద్ద శిక్ష విధిస్తావా? నీ మీద పోలీసు రిపోర్ట్ ఇస్తాను. నిన్ను వదిలిపెట్టను. అసలు వదిలిపెట్టే ప్రసక్తే లేదు!" అంటూ, "అమ్మా" అని పెద్ద గావుకేక పెట్టేడు.

అప్పుడే టీ పట్టుకొని వస్తున్న స్నేహితుడు ఆ కేక విని, "ఒరేయ్! ఏమయిందిరా నీకు? లేరా!" అంటూ కుదిపి లేపాడు రాముని.

ఒక్కసారి గాబరాపడి లేచి, 'ఓహో! ఇది కలా?' అనుకుని, వచ్చిన కల గురించి స్నేహితుడితో వివరిస్తూ, "ఒరేయ్! నాకెందుకో చాలా భయంగా ఉందిరా!" అంటూ భోరుమన్నాడు.

"నువ్వనుకున్నట్లు ఏమీ జరగదురా, భయపడకు!" అంటూ ధైర్యంగా ఉండమని సలహా ఇచ్చేడు స్నేహితుడు.

రాత్రల్లా డాక్టర్ నీరజ, హాస్పిటల్‌లోనే ఉండి, రోగిని గమనిస్తూనే ఉన్నదన్న విషయం రాముకి తెలియదు. రోగిని ఇప్పుడే ఓ.టీ.కి తీసుకెళ్ళేరన్న వార్త మాత్రం తెలిసింది. సుమారు నలభై ఐదు నిమిషాల తరువాత ఓ.టీ. తలుపులు తెరుచుకున్నాయి. అప్పుడే తూర్పు చుక్క తెల్లారింది. కాని రోగి బ్రతుకు తెల్లారలేదు. రాముని చూస్తూ "మీ అమ్మ ప్రాణానికేం భయం లేదు. రెండు రోజులలో డిశ్చార్జ్ చేస్తాము." అంటూ చకచకా అడుగులు వేసుకుంటూ ఛేంబర్‌లోకి వెళిపోయింది నీరజ.

షాక్‌నుండి వాళ్ళు తేరుకొని, ఫీజు తెలుసుకుందామని రిసెప్షన్ వద్దకు చేరుకున్నారు! ఎడ్వాన్స్ రూపంలో కొంత డబ్బైనా చెల్లిస్తే గాని ఏ హాస్పిటల్ వాళ్ళు చేర్చుకోరు కదా... అన్న ఆలోచన అప్పుడు కలిగింది రాముకి. ఆశ్చర్యపోతూ అడిగేడు ఆ

ప్రశ్నే రిసెప్షన్‌లో. మేడమ్‌నే కనుకోమని జవాబిచ్చేరు వాళ్ళు. భయపడుతూ... నీరసంగా అడుగులు వేస్తూ, ఛాంబర్‌లోనికి ప్రవేశించి, "నమస్కారం మేడమ్" అన్నాడు. ప్రతినమస్కారం చేసింది ఆమె.

"మేడమ్, మావల్ల చాలా తప్పు జరిగింది, మమ్మల్ని మన్నించండి మేడమ్. మా తప్పు తెలుసుకున్నాము. మా అమ్మ ప్రాణం కాపాడినందుకు మీకు ఎలా కృతజ్ఞతలు తెలుపుకోవాలో తెలియడం లేదు మేడమ్" అంటూ అమాంతం కాళ్ళమీద పడి రోదిస్తూ, "మీ ఫీజ్ ఎంతో చెప్పండి మేడమ్!" అన్నాడు రాము.

"తప్పకుండా చెప్తానురా, ఫీజు ఎంత కట్టాలో... నిన్ను వదిలిపెట్టేది లేదు. నువ్వు జన్మలో ఊహించనంత ఫీజు తీసుకోబోతున్నాను, మానవత్వం లేకుండా ప్రవర్తించేవు కదా! మానవత్వానికి ఖరీదు కడుతున్నాను. ఇదే మీ అమ్మ ప్రాణం ఖరీదు. అది చెల్లించు!" అంటూ ఒక కవరు అందించింది చేతికి. ఇప్పి చూస్తే అది ఖాళీ కవరు. నిర్ఘాంతపోయి, "మేడమ్!" అన్నాడు.

"ఔను, అది ఖాళీ కవరే. ఇకముందు నీ జీవితంలో ఎవరిపట్లా అమానవీయంగా ప్రవర్తించనని, వృద్ధుల్ని, పిల్లల్ని ఎప్పుడూ గౌరవిస్తానని, మానవత్వం చూపుతానని ప్రమాణం చేస్తూ, నీకు తోచిన డబ్బు ఆ కవరులో పెట్టి, మీ అమ్మ నమ్మిన దేవుడి గుడి హుండీలో వేసి, మీ అమ్మ పేరున అర్చన చేయించు! అదే మానవత్వం ఖరీదు. ఇకపోతే మా హాస్పిటల్ ఖర్చు!" అంటూ, నర్సుని పిలిచి, "ఇతని దగ్గర కేవలం మందుల ఖర్చే వసూలు చెయ్యండి! కన్సల్టేషన్ ఫీజు గాని, ఇతరత్రా ఫీజులు గాని వసూలు చెయ్యకండి. అదే నువ్వు నాకు చెల్లించవలసిన ఫీజు... అంటే మీ అమ్మ ప్రాణం ఖరీదు! ఇక నువ్వు వెళ్లొచ్చు!!" అంది రాము వేపు చూస్తూ.

నిశ్చేష్టుడై శిలలా నిలబడి పోయిన రాముకి... బయటకెళ్ళే దారి చూపించింది నర్సు.

# కిటికీ

**ఎస్.వి.ఎమ్. నాగగాయత్రి**
✆ 9440465797

***అతడు మాట్లాడింది చాలామందికి తప్పుగా కనపడదు. ఒక స్త్రీ అలాంటి మాటలు, అలాంటి స్లాంగ్‌తో మాట్లాడడమే ఎక్కువ తప్పుగా కనబడుతుంది. బహుశా ఇంతగా రియాక్ట్ అవడానికి కారణం, అతడు ఇంతకుముందు పదేపదే ఇలాంటి మాటలతో గుచ్చి ఉండొచ్చు. ఆమె మాట్లాడిన ఈ మాటలు క్యుమిలేటివ్ ఎఫెక్ట్ కూడా అయ్యుండొచ్చు. స్త్రీని భూదేవితో పోల్చి, పోల్చి అలవాటైన దేశం కాబట్టి, మనకు తిరిగి మాట అనడం అసంబద్ధంగా, అహంభావంగా అనిపించొచ్చు. అయితే ఎవరికీ అర్థం కాని విషయం... ఇంతగా కొట్టుకుంటూ కూడా ఎలా కలిసి ఉంటారు... అన్నది!***

ఆ ఆహ్లాదకరమైన సాయంత్రం వేళ, ఇద్దరు యువతులు బీచ్ ఒడ్డున కూర్చుని ఉన్నారు. వారిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ, అప్పుడప్పుడు సముద్రం అలలతో ఆడుతున్న తమ భర్త, పిల్లల్ని గమనిస్తున్నారు. అలల తాకిడికి తమ పిల్లలు సంతోషంగా కొట్టే కేరింతలు వారి తల్లుల కళ్ళలో ప్రతిఫలిస్తోంది. వాళ్ళతో బాటు సముద్రం నీళ్లలో మునకలు వేయడానికి సూర్యుడు కూడా ఆత్రుత పడుతున్నాడు. ఇంతలో ఆ ఇరువురు స్త్రీలలో ఒకరి దృష్టిని అటుగా నడుస్తూ వచ్చిన ఒక జంట ఆకర్షించింది. ఆమె మరోసారి వారి వైపు దృష్టి సారించి, చిన్నగా నవ్వుతూ అంది... "వైదేహీ! ఆ వస్తున్న వాళ్ళని చూశావా? చెయ్యి చెయ్యి కలుపుకొని, లోకంలో వారిద్దరే ఉన్నంతగా తుళ్లుతున్నారే! ఎంత హ్యాపీగా ఉన్నారో! లైఫ్ అంటే వీళ్లదే!"

వైదేహి వారి వైపు చూసింది. ఆమె పెదవులపై కూడా ఒక నవ్వు పూసింది. ఐతే అది సుజాత నవ్వు కంటే భిన్నమైంది.

"అవును... అలాగే ఉన్నారు. సుజాతా... నువ్వో తమాషా గమనించావా? వాళ్లు నవ్వుతూ తుళ్లుతున్నారని మనం అనుకుంటున్నాం. నిజానికి దూరంగా మనకు కనపడేదాన్ని బట్టి, చేతులు పట్టుకొని నడుస్తున్నారు కాబట్టి, మిగతాది మనం ఊహిస్తున్నాం. ఇందులో నిజం ఎంత? అబద్ధం ఎంత? వాళ్ల గతమేంటో మనకు తెలియదు. అలాగే భవిష్యత్తు కూడా. కనీసం మనం చూస్తున్న ప్రెజెంట్ కూడా వారిద్దరి గురించి ఎంత నిజాన్ని చెప్తుందనేదే నా ప్రశ్న! ఇంకా వాదనకు చెప్పాలంటే అసలు వీళ్ళు జంటేనా? లేక సహోదరులా? కనబడ్డ కొంత పరిధిని బట్టి మనం వాళ్ల పరిస్థితిని అంచనా వేస్తున్నాము. ఇది ఎలా ఉందంటే 'ప్రపంచాన్ని కిటికీలోంచి చూసినట్టు!' మనం చూసే పరిధి తక్కువైతే, అప్పుడు మనకు అర్థమయ్యేది కూడా అంతే ఉంటుంది. లేదా మన కన్ను ఏం చూడగలుగుతుందో, చూడాలనుకుంటుందో, మన బుర్రకు అంతే అర్థమవుతుంది!"

నోరుతెరిచి వింటున్న సుజాత, “ఆగాగు... ఏమిటి ఈ భావావేశం! ఒక్క వాక్యానికి ఎస్సే టైపు వివరణ ఇచ్చావే!” నవ్వుతూ అంది.

వైదేహి తన భావావేశం నుండి బైటకు రాలేదు. “ఎందుకంటే... ఇలాంటి ఒక సంఘటన నాకు అనుభవమైంది కాబట్టి! నా కలల ప్రపంచాన్ని కూల్చేసింది కాబట్టి. నా నమ్మకాన్ని ప్రశ్నించింది కాబట్టి!”



“ఇలాంటి ఓ సంఘటనా? మరి నాకెందుకు చెప్పలేదు?”

“సావకాశంగా చెబ్దామనే ఫోన్‌లో చెప్పలేదు. మధ్యలో జోక్యం చేసుకోకుండా సాంతం విను. ఇలాంటి జంటని చూసింది మా ఇంటి కిటికీనుండి...” అంటూ పెద్దగా నవ్వింది వైదేహి.

"కిటికీనుండి నేను ఒక స్వప్నలోకమే చూశాను. జీవితంలో చాలా మంది వ్యక్తులను, సంఘటనలను కిటికీలోనుండే కదా చూస్తాం! మన ఆలోచనా పరిధి ఆ కిటికీని దాటుకుని వెళ్తే... నిజం తెలుస్తుంది. చాలాసార్లు నిజం తెలుసుకోవాలన్న ఆసక్తి, శక్తి మనకు లేకనూ పోవచ్చు!"

"అబ్బా... విషయం చెప్పమంటే ఉపోద్ఘాతం చెప్తున్నావ్. పాయింటుకురా!" విషయాసక్తితో అంది సుజాత.

"వస్తున్నా వస్తున్నా! మా అపార్ట్మెంట్ పక్కనే రోడ్డు ఉంది చూసావూ... ఆ తర్వాతనే ఇంకో పెద్ద అపార్ట్మెంట్ ఉంది కదా! మా ఇంటి డైనింగ్హాల్‌లో ఉండే కిటికీ నుంచి చూస్తే, ఆ ఎదురు అపార్ట్మెంట్ కనబడుతుంది. చాలారోజులు అందులో ఒక ఫ్లాట్ ఖాళీగా ఉండేది. ఒకరోజు అందులోకి ఎవరో దిగారు. సామాను సర్దుతూ హడావుడిగా మనుషులు కనబడ్డారు. ఆ తర్వాతి రోజు, రోజులాగే ఏడున్నరకల్లా టిఫిన్ డబ్బాల్ని మావారు, సుపుత్రుడు చేతుల్లో పెట్టి, వాళ్ళను సాగనంపి, ఇల్లు సర్దడం మొదలుపెట్టాను. అప్పుడు నా చూపు యథాలాపంగా మా ఇంటి కిటికీ నుంచి ఎదురుగా వున్న ఆ ఫ్లాట్ మీద పడింది. ఆ ఇంటి కిటికీలకు కట్టిన తెరలు మనసుని ఆకర్షించాయి. అయితే నా చూపు అక్కడితో ఆగలేదు. తెరలను దాటి చూద్దును కదా... అక్కడ సోఫాలో ఒకతను కూర్చుని, కాఫీ తాగుతూ ఉన్నాడు. వయసు ఇరవై ఐదు... ముప్పై మధ్య ఉండొచ్చు. అపార్ట్మెంట్స్ మధ్య కొంత దూరం ఉంది కాబట్టి, అంత స్పష్టంగా కనబడదు. మళ్ళీ నా పని మొదలు పెట్టి మధ్యలో వచ్చి కిటికీకి వెళ్లాను. అతగాడి భార్య అనుకుంటా... అప్పుడే నిద్ర లేచి వచ్చినట్టుంది. సోఫాలో ఉన్న దిండ్ల మధ్యలో ముడుచుకొని పడుకొని ఉంది. 'ఇదేమి చోద్యం... అతడి కంటే ఆమె లేటుగా లేవటం' అని నవ్వుకుంటూ... తిరిగి పనిలో పడ్డాను. మళ్ళీ వచ్చి చూద్దును కదా... మత్తుగా జోగుతూ ఉండే అమ్మాయి చేతిలో కాఫీ కప్పు! బహుశా ఆమె చేతికి ఆ కప్పు ఆ అబ్బాయి అందించి వుంటాడు. అప్పుడు చూడాలి నువ్వు... నా మొహం! ఆశ్చర్యంతో నోరే తెరిచేశాను. నా స్వప్నలోకంలో కూడా నేను ఊహించని విషయం ఇది. అయితే గియితే నాకు బాగాలేనప్పుడు నా భర్త నుదుటి పై చేయి వేసి, 'ఏమ్మా! నలతగా ఉందా?' అంటూ కణతలు నొక్కుతాడు. అంతదాకా మాత్రమే నా స్వప్నలోక పరిధి! కిటికీ రెక్కపై చేయి వేసి, మరొక చేయి చెక్కిలికి ఆన్చి, కళ్ళు పెద్దవి చేసుకుని ఎవరో మంత్రమేసినట్లు చూస్తూ ఉండిపోయాను... సభ్యత కాకపోయినా!

నా చేతులను ఒకసారి చూసుకున్నాను. కాఫీ పెట్టి ఇవ్వడమే కానీ, కాఫీ కప్పు అందుకోవటం ఈ చేతులకు తెలియదు. ఎప్పుడైనా హోటల్‌కి వెళ్తే, సర్వర్ టేబుల్ మీద టీ కప్పు పెడితే అప్పుడు వచ్చే ఆ మజానే వేరు! కొద్దిసేపటివరకు నాకు ఆ దృశ్యం తప్ప మరేది కనిపించలేదు. 'అంత అతిశయంగా మాట్లాడొద్దు. అలా నవలల్లోనూ, సినిమాల్లోనూ, లేక ఇంకో ఇంట్లోనూ చూశానని' నువ్వు చెప్పొచ్చు. కానీ నాకు అదే కనీవినీ ఎరుగని ఆశ్చర్యకరమైన విషయం! కాఫీ తెచ్చిస్తేనే మానవతావాదులా? స్త్రీవాదులా? అనీ నువ్వడగొచ్చు. కానీ ఏ భేషజం లేకుండా చాలా మామూలుగా జరిగిన ఈ చర్యకి ఫిదా అయిపోయాను. అప్పటినుంచి ఆ కిటికీ నాకు లోకం అయిపోయింది. ఆ జంట నా కలల సామ్రాజ్యానికి రాజు... రాణి! ప్రతిరోజూ దాదాపు ఓ గంటసేపైనా హాల్లో తచ్చాడుతూ కనబడతారు ఇద్దరూ! ఆపై రెడీ అయ్యి బైటకు వెళ్తారు. ఇద్దరూ ఉద్యోగస్థుల్లా వున్నారు. రాత్రి పొద్దుపోయి వస్తారనుకుంటా... వాళ్లను గమనించడం నాకో అలవాటైపోయింది. అప్పటివరకు కొన్ని నవ్వులు, ఎక్కువ నిట్టూర్పులతో గడిచిపోయే నా జీవితం ఆసక్తిగా మారింది.

కొద్దిరోజులకు నాకో అనుమానం రాకనూ పోలేదు... ఆ అమ్మాయి ఎప్పుడూ అతడికి కాఫీ తెచ్చి ఇవ్వలేదు అని! బహుశా బాగా కట్నం తెచ్చిన బాపతు ఏమో అనిపించింది. ఆ చిన్ని ఆలోచనకే రోజాపువ్వుతో పాటు ముల్లూ ఉన్నంత ఫీల్

అయ్యాను. వాస్తవం ఏదైనా ఒప్పుకునే ఉద్దేశ్యం అయితే నాకు లేదు. ఆమె మీద ప్రేమ వల్లే అతడు కాఫీ తెచ్చి ఇచ్చాడని, నాకు నేను నచ్చ చెప్పుకున్నాను. అవును మరి... బాగా చదువుకున్న వాళ్ళు... స్థాయి ఉన్న వాళ్ళు... సంస్కారం అబ్బి ఉండదా ఏంటి? అనుకున్నాను.

అయితే హేతువు నాలో మొదలైనప్పటి నుంచి, మునుపు పొందిన ఆనందం నాకు లభించలేదనే చెప్పాలి. ఇప్పుడు ఆలోచిస్తే నాకనిపిస్తుంది. కాఫీ కప్పు పనిమనిషి తెచ్చి ఇచ్చిండొచ్చు. లేదా ఆమే వెళ్లి తెచ్చుకొని, అట్లాగే ముడుచుకొని కూర్చుని ఉండవచ్చు. కానీ నాకు నచ్చే కోణంలో మాత్రమే చూసి, అతడే ఇచ్చుంటాడని నిశ్చయమయ్యాను. అయితే నా నిశ్చయానికి ఆసరా ఇచ్చింది ఆరోజు జరిగిన సంఘటన! అప్పుడు సన్నగా వాన కురుస్తోంది. వాళ్ళిద్దరు హాల్లో కనబడలేదేమిటా? అని ఆలోచిస్తూ కిటికీ ప్రక్క నిలబడ్డాను. ఇంతలో అపార్ట్మెంట్ ముందు ఆగిన కారు దగ్గరకు వాళ్ళిద్దరూ నడుస్తూ కనపడ్డారు. ఒక చేత్తో గొడుగు పట్టుకుని, మరో చేయి ఆమె భుజాల చుట్టూ వేసి పొదువుకొని, నడిపించుకుని పోతున్నాడతను. ఆమెకు ఆరోగ్యం బాగోలేనట్టుగా ఉంది. నేను చాలా ఆందోళన పడిపోయాను. కారు డోరు తీసి, ఆమెను కూర్చోబెట్టి, కారు డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడతను. ఏమైంది ఆమెకు? నాకింక స్థిమితం లేకపోయింది. ఎలా తెలియాలి విషయం? వెళ్లి వాళ్ళ వాచ్మెన్‌ను అడిగితేనో? బాగోదేమో... మళ్ళీ నాకొక ఆలోచన క్లాష్ అయింది. నాకు బాగా లేనప్పుడు కనీసం మా ఆయన, ‘ఏదైనా టాబ్లెట్స్ తెచ్చివ్వనా? హాస్పిటల్ కి వెళ్దామా?’ అని అడగరు. నేనే ముక్కుతూ, మూల్గుతూ బండి నడుపుతూ హాస్పిటల్‌కి వెళ్లి వస్తాను. వీళ్ళని చూస్తే నాకు ఈర్ష్య లాంటిది కలుగలేదు కదా? లేదు... లేదు... హాయిగా ఎగిరే పక్షుల జంటను చూస్తున్నట్టుగా సంతోషపడే దాన్ని!

చాలారోజులుగా కిటికీ ద్వారా వాళ్ళిద్దరినీ చూస్తున్నా. కానీ... వాళ్ళు ఎలా ఉంటారో నాకు సంపూర్ణంగా తెలియదు. ఒక్కసారైనా వాళ్ళు ఎలా ఉంటారో చూడాలని బలంగా అనిపించసాగింది. ఎక్కువగా గమనించడం వల్లనో ఏమో, వారితో నాకొక తెలీని అనుబంధం ఏర్పడిందనే చెప్పాలి. వాళ్లను చూడాలని నిశ్చయించుకున్నాక, రకరకాలుగా ప్లాన్స్ వేయడం మొదలుపెట్టాను. నేరుగా వాళ్ళ ఇంటికి వెళ్లి పరిచయం చేసుకునేంత ఆవేశం వచ్చేసింది. కానీ ‘ఎవరు నువ్వు?’ అంటే ఏమని చెప్పాలి! ‘కిటికీ నుండి రోజు మిమ్మల్ని గమనిస్తున్నాను. మిమ్మల్ని నేరుగా చూడాలనిపించి వచ్చాను’ అని చెప్పాలి. చివరికి ఒక ఉపాయం తట్టింది. వాళ్ళు బయటికి వెళ్ళేప్పుడు, నేను రోడ్డు పైకి వెళ్లి, వాళ్ళని కలవాలనుకున్నాను. అలా నిర్ణయించుకున్నాక, వాళ్ళు ఎప్పుడు బయటకు వెళ్తారా... అని మరింతగా గమనించడం మొదలు పెట్టాను. ఆ సమయం రానే వచ్చింది.

ఆరోజు అపార్ట్మెంట్ నుండి బయటకు నడుస్తూ వెళ్తూ కనపడ్డారు ఇద్దరూ. నేనిక క్షణం ఆగలేదు. ఇంటికి తాళం కూడా పెట్టకుండా హడావుడిగా రోడ్డుపైకి వెళ్ళాను. వాళ్ళను చూడబోతున్నానన్న ఎక్సైట్మెంట్. భుజాలదాకా కత్తిరించిన జుట్టుతో వెనుకనుంచి అందంగా కనబడుతోంది ఆ అమ్మాయి. ఇద్దరూ మంచి ఒడ్డు పొడుగుతో చక్కటి జంటగా కనబడుతున్నారు. చాలా అధునాతనంగా ఉన్నారు. వాళ్లను దాటి ముందుకు వెళ్లి, వాళ్ళ మొహాలు చూడాలని నా ఆలోచన. అడ్డుపడుతున్న చీర కుచ్చిళ్ళను కొద్దిగా ఎత్తిపట్టుకుని నడక వేగం పెంచాను.

ఇంతలో ఆమె చూపు అటుగా వెళ్తున్న ఒక అబ్బాయిపై పడింది. ఒక్కక్షణం ఆమె అతడిని తేరిపార చూసి ఉండొచ్చు. నేను వాళ్ళను దాటబోతున్నాను. అప్పుడు వినిపించింది అతడి స్వరం. ఆమె కేసి చూస్తూ, ఎగతాళి నిండిన స్వరంతో ఇట్లా అన్నాడు. “ఏం... నచ్చాడా? పోతావా ఆడెనకాల? లేక నేనెళ్లి... ‘నా పెళ్ళానికి తెగ నచ్చావ్’ అంజెప్పి తీస్కరమ్మంటావా?”

ఈ మాటలు వింటున్న సుజాత ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

"నేనూ ఇలాగే ఉలిక్కిపడ్డాను. అంతకు మించి నన్నే ఏదో ఆ మాటలన్నంతగా అవమానపడిపోయాను. ఇంతలోనే ఆమె అంతకు తగ్గ ఘాటైన సమాధానం ఇచ్చింది. 'నేను ఎవరితో... ఎవరితో... నాకు తెలుసు. నువ్వు మూస్కో' ఆ మాటలు వింటూనే నేను ప్రాన్పడిపోయాను. నా శక్తినంతా ఎవరో లాగేసినట్లు అనిపించింది. ఎవరో తరుముతున్నట్లుగా ఇంట్లోకి వెళ్ళి పడ్డాను. నా స్వప్నసౌధం కూలిపోయింది!" ఎక్కడో దూరంగా దృష్టిని నిలిపి చెప్తున్న వైదేహి ఇక చెప్పడాని కేమీ లేదన్నట్లు గమ్మునుండిపోయింది.

వైదేహి చెప్పినదాన్ని గురించి ఆలోచిస్తున్నట్లుగా సుజాత కాసేపు ఏమీ మాట్లాడలేదు. సున్నితమైన భావ సంచలనమేదో జరిగినట్టే వుంది. చిన్నగా తల పంకిస్తూ ఇలా అంది.

"నిజమే. ఒక వ్యక్తిని గాని, పరిస్థితిని గాని మనం గమనించ గలిగేది, అర్థం చేసుకోగలిగింది ఒక పరిధి దాకానే. అదే... నీ భాషలో... కిటికీ! నిజం తెలియాలంటే కిటికీని దాటి చూడగలిగి ఉండాలి. అయినా సంస్కారానికి... చదువు, సామాజిక స్థాయి కూడా ఉపయోగ పడటం లేదంటేనే దిగులుగా ఉంది."

సుజాత మాటలకు అంగీకారంగా తల ఊపి, వైదేహి చెప్పడం కొనసాగించింది. "దాదాపు 9 నుంచి 10 గంటల మధ్య వాళ్ళు హాల్లోనే ఉండేవాళ్ళు! వాళ్ళు మాట్లాడుకుంటూ ఉంటే... ఏం మాట్లాడుకుంటారో ఊహించుకునే దాన్ని! రోజులో ఎక్కువభాగం వాళ్ళను గురించి ఆలోచించడం నా దినచర్య అయిపోయింది. తొమ్మిదిగంటలు కొట్టకముందే కిటికీరెక్క పట్టుకుని వేలాడేదాన్ని. దేవుడు ప్రేమకు నిదర్శనంగా ఈ ప్రేమపక్షులను సృష్టించాడేమో అనిపించేది. నా కలల ప్రపంచం వాళ్ల రూపంలో ఈ ప్రపంచంలోకి వచ్చిందనిపించేది. కానీ నా ప్రపంచం తలక్రిందులైనంత బాధగా వుంది. వాళ్ల గురించి నేను వేసిన అంచనా తప్పా? నా కళ్ళముందే కదా పొదివి పట్టుకొని మరీ హాస్పిటల్‌కు తీసుకెళ్ళాడు. మరి ఈ పార్శ్వం ఏంటి?! ఇది నాకు ఏమాత్రం మింగుడు పడటంలేదు. నిజానికి నన్ను ఇదొక భేతాళ ప్రశ్నలా వేధిస్తోంది. ఒకే గొడుగు కింద హాస్పిటల్‌కు వెళ్ళిన వీళ్లేనా ఇంత చౌకబారుగా మాట్లాడింది! ఎందుకిలా జీవితాలు తగలబడుతున్నాయి? ఏం లోపిస్తోంది?"

దూరంగా నడుస్తున్న జంట వైపు చూస్తూ అంది సుజాత. "ఏం లోపిస్తోంది? లోపించట్లా... ఎక్కువైంది... ఇగో! మళ్ళా ఆత్మాభిమానం అనుకునేవు... కాదు.. ఇగో! ఇగోలు కొంచెం పక్కన పెట్టి, మనిషిపై మనిషికి కొంచెం ప్రేమ, కొంచెం గౌరవం, కొంచెం నమ్మకం, కొంచెం కన్సర్న్ ఉంటే చాలు. నువ్వు నీ కిటికీలో చూసిన ప్రపంచం కావాలంటే జీనీ మాయాజాలం వంటి అద్భుతమేదో జరగాల్సిందే. మనం నమ్మిన కొన్ని సత్యాలను శంకించాల్సి వస్తుంది, లేదా సత్యం స్వరూపమే ఏమర్చాల్సి వస్తుంది. అయినా అతడు అట్లా మాట్లాడిందే తప్పే అనుకుందాం... ఈమె ఎందుకు అంత తక్కువ స్థాయిలో మాట్లాడి ఉంటుంది!"

సుజాత మాటలకు వైదేహి కొన్ని క్షణాలు మౌనం వహించింది. నెమ్మదిగా మాటలు కూడగట్టుకున్నట్లు.. "అదే కదా మన ఆలోచనల తీరు! అతడు మాట్లాడింది చాలామందికి తప్పుగా కనపడదు. ఒక స్త్రీ అలాంటి మాటలు, అలాంటి స్లాంగ్‌తో మాట్లాడడమే ఎక్కువ తప్పుగా కనబడుతుంది. బహుశా ఇంతగా రియాక్ట్ అవడానికి కారణం, అతడు ఇంతకుముందు పదేపదే ఇలాంటి మాటలతో గుచ్చి ఉండొచ్చు. ఆమె మాట్లాడిన ఈ మాటలు క్యుమిలేటివ్ ఎఫెక్ట్ కూడా అయ్యుండొచ్చు.

స్త్రీని భూదేవితో పోల్చి, పోల్చి అలవాటైన దేశం కాబట్టి, మనకు తిరిగి మాట అనడం అసంబద్ధంగా, అహంభావంగా అనిపించొచ్చు. అయితే ఎవరికీ అర్థం కాని విషయం... ఇంతగా కొట్టుకుంటూ కూడా ఎలా కలిసి ఉంటారు... అన్నది! ఇద్దరి మధ్య అభిమానమో, ఇంకోటో వున్నంత మాత్రాన, అనుమానం, ఇగో ఉండకూడదని కాదుగా? పైగా సమాజం కోసం కలిసి ఉండే జంటలే ఎక్కువ. కాబట్టి కొట్టుకుంటూ ఉంటారు... కలిసే వుంటారు. మన వైవాహిక వ్యవస్థ అంత పటిష్టం మరి! ఏదైతేనేం ఇలాంటి సంఘటన ఇంకొకళ్ళ మధ్య అయితే నేను దీన్ని చాలా మామూలు సంఘటనలా తీసుకొని ఉండేదాన్ని. నా కలల ప్రపంచంలోని రాజు, రాణిల మధ్య జరిగింది కాబట్టి బొత్తిగా జీర్ణించుకోలేకపోతున్నాను. జీవితంలో సౌందర్యం అంతా అబద్ధమైనంత బాధగా ఉంది. ఒకే గొడుగు కింద హాస్పిటల్‌కి వెళ్ళేంత ప్రేమ ఉంది... మాటలబాణాలతో ఒకళ్ళనొకళ్ళు గాయపరచుకునేంత ద్వేషము ఉంది. ఈ వైపరీత్యాల కంటే తటస్థమైనా మేలుగా ఉంటుందేమో!"

"ఇందులో వాళ్ల తప్పు ఏమీ లేదు. నీ కిటికీ నువ్వు ఏం చూడాలనుకుంటున్నావో దాన్ని చూపింది. ఆదర్శ దంపతులు అన్న అభిప్రాయం నీకు కలిగింది. వాస్తవం చాలా భిన్నంగా ఉంది. కాబట్టి నీకు జీర్ణం అవడంలేదు. అతడికి అనుమానం ఎక్కువే ఉండొచ్చు. లేదా ఆమె ప్రవర్తన అతడి అనుమానానికి బలం చేకూర్చేదిగా ఉండి ఉండొచ్చు. అదే కదా మరి మన భారతదేశ సంప్రదాయ గొప్పతనం! చెక్కలోపల పగుళ్ళు ఉన్నా, పైన పెయింట్ వేసినట్లు, చేసే పనిలో త్రికరణశుద్ధి గురించి మాట్లాడే తాత్వికత మన స్వంతం. మనోవాక్కాయకర్మణా అని గొప్పగా చెప్తాం. మరి ఈ బంధాల్లో ఎక్కడుంది త్రికరణశుద్ధి? సరే చిన్నపాటి బిందువులే నదైనట్లు, చిన్న చిన్న సరదాలు... ఎలాంటివి? ఇప్పుడు మన ముందున్న ఈ జంట అనుభవిస్తున్నట్లు, ఈ చిన్న సరదాలే ఎక్కువగా అయి జంటలు సంతోషంగా ఉండాలని కోరుకుందాం. అంతకంటే ఏం చెయ్యగలం? మంచినే కోరుకుందాం. సరే... పద... చీకటి పడుతోంది!"

ముసురుతున్న ఆలోచనలతోనే స్నేహితురాళ్ళు ఇద్దరూ తమ కుటుంబ సభ్యుల వైపు సాగిపోయారు.

# పారిజాతం కథ

**వెంకటమణి**
✆ 9492244586

> ***"జాతి, కుల మతాలు సూసుకోకుండా ఇద్దరు మామూలు మనుసులు కలుత్తారేమోగానీ, రెండు పార్టీలకు చెందినోళ్లు ప్రెజాసేవ కోసం ఎంతమాత్రం చేత కలవరని నాకర్థమైపోనాది. ఒకేళ ఒకట్రెండు పార్టీలు జట్టు కట్టినాయన్నా, అదీ ప్రెజల కోసం అయ్యుండదు.. నిక్కచ్చిగా తమ పార్టీ లబ్ధికోసవే అవుతాది. ప్రెజాస్వామ్య వృక్షాన్ని వేరు పురుగుల్లా ఆశించి తొలిచేస్తన్నాయి కదా ఈ రాజకీయ పార్టీలు"***

పారిజాతాన్ని అంటే ఆడమనిషిననుకున్నారు. కానండి. నేనో పారిజాతం మొక్కని! అయితే అన్ని చెట్ల మాదిరి చెట్టును కానండీ. ఓ పథకం చెట్టుని! అంటే సహజంగా నేలన మొలిచినదానిని కాదు అని అర్థవన్నమాట. 'నీరు`మొక్క' పథకం కింద నాటబడిన మొక్కనన్నమాట. ఈ పథకాల గురించి ఎవురికైనా తెలియంది ఏముంటాది? ఈరోజున చెట్టుకో పథకం, పుట్టకో పథకం! ఒకడేమో ఆడపడుచుకి చీరా సారె పెడతానంటాడు. ఇంకోడేమో పసుపూ కుంకుమ ఇస్తానంటాడు. పుట్టే బిడ్డకు పురిటి ఖర్చులిస్తానని ఒకడంటే, సావు ఖర్చులకు నజరానా ప్రెకటిస్తాడు మరొకడు. అలగున్నాది పార్టీలతో యవ్వారం! దేశంలోన రాజకీయ పార్టీలకు కొదవుందో నేదో నాకు తెల్దుగానీ, అవి అధికారం లాక్కోవడానికి పెట్టే పథకాలకి మాత్రం కొదవలేనట్టుగుంది. ఓటర్ల కోసం పెట్టే ఈ పథకాలు సాలవని చెట్లకీ, పిట్లకీ కూడా పథకాలు పెడతన్నారు. నియోజకవర్గాల్లో ఓటర్లతో పాటుగ జంతువులకీ, మా చెట్లకి కూడా నాయకులే ప్రాతినిధ్యం వహిస్తారంట కదా మరి! మొత్తానికి ఈ పార్టీల పుణ్యమా అని మాకూ ఓ పథకం పుట్టింది. అదిగో, అసుమంటి ఓ పథకం కిందే నేను పుట్టేను.

నా పుట్టుకైతే అందరిలాంటి పుట్టుక కాదండోయ్! మహరాజ పుట్టుక! ఏడాది కిందటి మాట. ఆరోజు మా చక్కని రోజంట. నిజానికి మా చెట్లకీ పుట్లకీ మంచి రోజులుంటాయా? ఆకుపచ్చగుండే కాలమెల్లా మంచికాలమే. కరువు పట్టిన కాలమెల్లా చెడ్డకాలమే! మాకెవన్నా కులమా మతమా... మంచీ చెడ్డా ఎంచి చూసుకోడానికి? ఏదీనేదు. సర్లెండి, మీ మనుషులకు మంచిరోజైన ఆరోజున, ప్రెభుత్వ పెద్దలు చోడవరంలోని ప్రభుత్వ పోరంబోకు భూమిలో వనాన్ని పెంచడానికి మొక్కలు నాటే కార్యక్రమం పెట్టేరు. పెద్దింటోడి పెళ్లికి పందిర్లేసినట్టు టెంట్లు ఏసేరు. ఓహ్! ఎటు చూసినా పచ్చసొక్కా మనుసులే. జాతరకొచ్చినట్టు వచ్చేరు జనాలు! తొమ్మిదీ పది నిమిషాలకని ముహూర్తం ఖరారు చేసేరు. మంత్రిగోరు రావాల, మొక్క నాటాల! మంత్రిగోరి కోసం అందరూ ఎదురుచూస్తన్నారు. నేనూ, నా తోటి మొక్కలందరవూ ఓ మూలన పడున్నాం. మమ్మలందర్నీ అంతకు ముందురోజే పాడుకోట అనే పల్లెటూర్లోని నర్సరీనుండి ట్రాక్టర్‌లో ఏసుకొచ్చి అక్కడ పడేసేరు. నలుగురితో పాటుగ మంత్రిగోరి కోసం ఎదురుచూపులు మాకూ తప్పనేదు.

ముహూర్తం వేళకి మంత్రులెప్పుడూ రారంట కదా... మంత్రొచ్చిన టైమే ముహూర్తం టైమంట కదా. సివరాఖరుకి మంత్రిగారొచ్చినారు. అంతే! ఒక్కపాళిగా అక్కడంతా కోలాహలం! బుగ్గకారు సుట్టూ మందీమార్బలం సుట్టిముట్టీనారు. మంత్రిగోరంటే మగాయన అనుకున్నాను. తీరా చూస్తే ఆడమనిషి! చక్కని చుక్కనాగుంది మనిషి. ముందు మొక్కలు నాటాక, ఆపైన మీటింగు ఎట్టుకున్నారు. వేదికకు కుసింత దూరంలో, శిలాఫలకం కాడ, ఓ నాలుగు గోతులు తీసి వుంచేరు. ఒక గొయ్యేమో మంత్రిగోరికి, మిగిలిన గొయ్యిలేమో సుట్టుపక్కల ఎమ్మెల్యేబావులకి కేటాయించేరు. బిళ్లబంట్రోతులు



బకెట్టులతో నీళ్లు పట్టుకొచ్చినాక, మంత్రిగోరిని గోతులకాడికి తోడ్కొని వచ్చేరు. అంతక్రితమే నన్ను, నాతోటి మరికొన్ని పారిజాతం మొక్కలను పట్టుకెళ్లి ఆ గోతులకాడ వుంచేరు. శిలాఫలకానికి ఇరుపక్కలా పారిజాతం మొక్కల్ని పాతే కార్యక్రమం ప్రారంభిత్తారంట. అప్పుడు నాను ఒకటే టెన్షను పడిపోనాను. మా అందరిలోన ఏ మొక్కను మంత్రిగోరు తన స్వహస్తాలతో నాటుతారా అని నాలో కంగారు పుట్టీసింది. మంత్రిగోరి సేతులమీద నాటబడే మొక్కకే కదా విలువ! ఆ భాగ్యం నాకే దక్కాలనుకున్నాను. ఏ జన్మాన ఏ పుణ్యం చేసుకున్నానో... నాటమని చెప్పి, నన్ను మంత్రిగోరి సేతిలో పెట్టేరు.

మంత్రిగోరి సేతిలో నేను! ఆ క్షణాన, నా ఆకులు అల్లల్లాడలేదంటే నమ్మండి. పిల్లాడిని ఎత్తుకున్నట్టు మంత్రిగోరు నన్ను ఎత్తి పట్టుకోని, పేపరోళ్లకి ఫోజులిచ్చేరు. ఒక్కపాళిగా కెమెరాలు క్లిక్ క్లిక్‌మన్నాయి. అటుపైన ఇంట్లో ఇటు పుల్ల తీసి అటు పెట్టని మంత్రిగోరు, అతికష్టమ్మీద నడుం వంచి గొంతుక్కూకుని, ఓ పక్క వెండిజరీ అంచు చీర నలిగిపోతున్నా లెక్కచేయక, నన్ను ఆప్యాయంగా గోతిలో పెట్టేరు. బంగారు గాజులు తొడుక్కునివున్న ఎర్రని కోమలమైన చేతులతో గుప్పెడు మన్ను తీసి నా మొదలు వద్ద పోసేరు. ఓ డొక్కుతో నీళ్లు కూడా పోసేరు. ఎంత మహర్దశ పట్టీసినాది నాకు... అని మురిసిపోనాను! ఆ క్షణాన, ఈ జరుగుబాటంతా నాకేనా అన్న అనుమానవు కలిగినాది. కలేమో అన్పించినాది. ఇక ఆ మర్నాడు, అన్ని పేపర్లలోనూ నా ఫొటోవులే పడ్డాయంట!

అంత గొప్ప పుట్టుక పుట్టినదాన్ని, అంత గొప్పగా బతికినానా అంటే నేదు! ఆరోజున అలా 'సహజవనం' శిలాఫలకం కాడ నాలుగు పారిజాతం మొక్కలు నాటినాక మొత్తంగా ఆ పాతికెకరాల భూవిలోన గానుగ, మావిడి, బాదం, వేప తదితర మొక్కలు నాటినారు. మాకు నీళ్లకోసం బోరింగు తవ్వినారు. కానీ నీళ్లడలేదు. మా సంరచ్చణ బాజ్యతను ఎవరో కాంట్రాట్టర్‌కి అప్పగించేరు. ఆ కాంట్రాట్టర్ ఆ బాజ్యతను ఓ తోటమనిషి చేతిలో పెట్టేడు. అతగోడు కొత్త పెళ్లాన్ని చూసుకున్నట్లు మమ్మల్ని కొన్నాళ్లు చూసేడు. మాకు దన్నుకి ఊతకర్రలు కట్టేడు. వారానికీ... పారానికీ కలుపు తీసీవోడు. మేం భూమికి రెండడుగుల ఎత్తుకు ఎదిగొచ్చీసరికి, ఆ తోటమనిషి మా మీద సీతకన్ను ఏసీసినాడు. పెళ్లాం మీద మోసట్టేసిపోయిన మొగుడిలా ఏదో నాల్రోజులకీ ఐదు రోజులకీ టేంకరేసుకొచ్చి మా ముఖాన కాసిన్ని నీళ్లు కొట్టి పోయీవోడు. ఆదివారాలొత్తే ఆ నీళ్లకీ శెలవే. అలా శీతాకాలమెళ్లినాది. వేసవి కాలమెళ్లినాది. ఎన్నికలొచ్చినాయి. కాలం ఎళ్లకాలం ఒకనాగ వుండదు కదా. తిరిగి వర్షాకాలమూ వచ్చినాది. అరకొరగా కురిసినా, ఏదో నీళ్లచుక్కలకంటే కరువు నేకండాపోయింది గానీ, గాలివానలకి ఊతకర్రలు పడిపోయి చాలా మొక్కలకి దన్ను నేకండా పోయింది. కొన్ని మొక్కలు నేలకొరిగిపోగా కొన్నింటి కొమ్మలు ఇరిగిపోనాయి. కలుపు పెరిగిపోయి కొన్ని మొక్కలు ఎదుగూబొదుగూ నేక, భూమిలోకే ఉండిపోనాయి. ముక్కుతా మూలుగుతా రోజులు ఎళ్లిపోతుండగా, మా మొక్కలకు నీళ్ళు పోసే కాంట్రాట్టరు అప్పుల పాలైపోయి, పథకం వదిలేసి పోనాడని తెలిసినాది. మా గుండెల్లో రాయడిపోనాది. అంతవరకు అమాసకు, పున్నానికి అన్నట్లయినా నీళ్లు పోసీవోరు. ఇక అవీ నేకండా పోయినాయి. తోటమనిషి పూర్తిగా రాడం మానీశేడు. చలికాలం ఎలాగో అలగ నెట్టుకొచ్చీసినాం. ఈలోపు పుట్టింటికి వెళ్లిన కూతురిలా వేసవి తిరిగొచ్చీసినాది. భూమిలోన నీళ్లు చూస్తే పేదోడింటి బియ్యం గూనలో బియ్యంలా నిండుకుంటన్నాయి. వేసవి ముదురుతున్నకొద్దీ ఆ తడీ అందకుండా పోతన్నాది. అసలుకేంటి సమస్యా అని మా మొక్కలందరం తలలు పట్టుకుని ఆలోచిస్తా కూకున్నాం. ఎంత ఆలోసించినా మాకేవీ బోదపడనేదు. ఓ పక్క రోజురోజుకీ ఎండ మండుకుపోతా వున్నాది. కొన్ని మొక్కలు అప్పటికే నీరసించి చిక్కి సచ్చిపోనాయి. గొంతులో కాసిన్ని నీళ్ళ చుక్కలు పోసీ దిక్కుకోసం చకోర పక్షినాగ ఎదురుచూస్తా వున్నాం.

ఇంతలో పెపంచ పర్యావరణ దినోత్సవం వచ్చిపడినాది. ఏ ప్రబుద్ధుడైనా మాకేసి సూత్తాడేమో అనుకున్నాం.. కానీ ఎవుళూ చూసిన పాపాన పోనేదు. ఆ మరుసటి రోజున మాత్రం పచ్చచొక్కా పార్టీ మనుషులు విలేకరులను ఎంటేసుకొచ్చేరు. వాలిపోయిన మా కొమ్మలను, పాలిపోయిన మా ముఖాలను వంగి వంగి ఫోటోవులు తీసుకున్నారు. మెడలో జెర్రిపోతంత గొలుసు, చేతికి కడియంలాంటి మండచైను, పదివేళ్లకీ పది బంగారపు ఉంగరాలు గల ఒక లావుపాటి బొజ్జమనిషి నాకు దగ్గరలో నిలబడి ''చూశారా మా హయాంలో నాటిన మొక్కల పరిస్థితి.. ఈ విషయమై మేం కోర్టుకు వెళ్లబోతున్నాం...''

అని విలేకరులకు ఏవేవో మాటలు నూరిపోసేడు. చెవొగ్గి ఆ మాటలన్నీ విన్నాన్నేను. విలేకరులు కిందా మీదా పడి ఏదో రాసుకున్నాక, అంతా వెళ్లిపోయేరు.

తర్వాత ఒకరోజు ఎర్రచొక్కా పార్టీవోళ్లు వచ్చేరు. మా దుస్థితిని చూసి విలపించేరు. వాళ్లు చెయ్యగలిగింది చేద్దామనుకుని మా మొక్కలన్నింటికీ తలో చెంబుడు నీళ్లు పోశేరు. చావబోతున్న వాడి నోట్లో తులసి నీళ్లు పడ్డట్టు ఆ కాసిన్ని నీళ్లూ పడి, మా గొంతుల్ని తడిపేయి. వాళ్ళు పోతూ పోతూ పర్యావరణం దగ్గర కూడా రాజకీయాలేనా, అధికార పార్టీ రాజకీయాలు విడిచిపెట్టి మా సంరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలని చెప్పి పోయేరు.

అటుపైన పర్యావరణ ఉద్యమకారులంట.. ఆళ్లొచ్చి మరో చెంబుడేసి నీళ్లు పోసి పెభుత్వానికి తమ మొర వినిపించి వెళ్లేరు.

ఈ తతంగాన్నంతా నా తోటి మొక్కలు వీధి నాటకం తిలకించినట్లు తిలకించేయి.

నాకు నవ్వొచ్చినాది. విరక్తిగా ఓ నవ్వు నవ్వుకున్నాను.

''ఎందుకు నవ్వుతున్నావు?'' అనడిగినాది నా పక్కనుండే బాదంపొప్పు మొక్క.

''నవ్వక ఏం చెయ్యను మరి? ఈ రాజకీయం వున్నాది సూడూ... పచ్చనిమొక్కని కూడా నిలువునా ఎండగట్టేస్తాది... మనకిక బతుకు లేనట్టుగే!'' అనన్నాను.

"అదేవలాగా..." అంటూ విస్తుపోయి చూసిందా మొక్క.

"మనం ప్రతిపక్షం చెట్లం మరి!" కారణం చెప్పేను.

అర్థంకాకో... మరెందుచేతనో ఆ మొక్క "ప్రతిపక్షం చెట్లంటే..." అనడిగినాది.

"మనం పెరిగొచ్చిన నర్సరీ వోనర్లు తాడి మట్టయ్య, మర్రి పెద్దమ్మలు ఈ మనుసుల రాజకీయాల గురిండి ఎన్ని విసయాలు చెప్పలేదు! సూడు... జరుగుతున్న సంగతుల్ని బట్టి చూస్తే, మొన్న జరిగిన ఎన్నికల్లో పెభుత్వం మారిపోనాదని తెలుస్తంది కదా! గతంలో అధికారంలో నున్న పచ్చసొక్కాల పార్టీ మనల్నినాటినాది. ఎన్నికల్లో ఆ పార్టీ తన అధికారాన్నికోల్పోయినాది. దాని స్థానంలో తెల్లసొక్కాల పార్టీ అధికారంలో కొచ్చినాది. అప్పుడు, ఈ తెల్లసొక్కాల పార్టీకి పచ్చసొక్కాల పార్టీ ప్రతిపచ్చం అవుతుంది గదా. మన పెజాస్వామ్యంలో అధికార పచ్చానికి ప్రతిపచ్చం శత్రువుగందా. మరి అసుమంటప్పుడు, ఆ ప్రతిపచ్చం ఎట్టిన పథకానికి చెందిన మనం ఏమవుతాం? ప్రతిపచ్చం చెట్లమే అవుతాం కదా. ప్రతిపచ్చం అంటేనే పడని అధికార పచ్చానికి, ఆ ప్రతిపచ్చం పెట్టిన పథకాలంటే మాత్రం పడతాయా? పడవు. అంచేత ఆట్ని ఉంచరు. ఈ కారణంసేతనే, మనకిక నీళ్లు కూడా పుట్టవు అని చెప్తున్నాది...'' అని చెప్పేన్నేను.

"అదేం కాదు, మన ప్రెజాస్వామ్యం గుర్నుండి నాకు బొత్తిగా తెల్దనుకుంటన్నావా ఏటి? పార్టీలు ప్రెజల సంక్షేమం కోసం ఒకదానికొకటి సహకరించుకోని పనిసేస్తాయని సిద్ధాంతులు ఏనాడో సెప్పేరంట.. ఆళ్లకంటే నీకు తెలుసునా? అయ్యేందుకు ఒకదానికొకటి కుమ్ములాడుకుంటాయీ..'' అని దీర్ఘం తీసింది ఆ పొప్పు మొక్క.

"నువ్వు మరీ సత్తెకాలపు చెట్టువిలాగున్నావు. పుస్తకాల్లోని కబుర్లు సెప్తావేంటి? ఈమధ్యకాలపు సరిత్రలో పార్టీభేదాలు సూడకుండా ప్రెజలకోసం అన్ని పార్టీలూ కలిసి పనిజేసింది లేదంట! ఏదో శుభకార్యాలప్పుడు, సావులప్పుడే ఈ నాయకులు పార్టీభేదాలు మరిచి కలుసుకునీది. వొప్పుడో బొంబాయి పేలుళ్లప్పుడు.. అమాయక జనాలు సచ్చిపోతే అన్ని పార్టీలోళ్లు

కలిసి సంతాపం ప్రెకటించినాయట! ఆ సమస్య మీద సామరస్యంగా సర్చించినాయట. అటుపైని జీతాల బిల్లుల కోసం, పార్లమెంటులో చుట్టలు కాల్చుకోడానికి వొక పెత్యేక గదికోసం ఏకమయ్యినాయంట. అరకొరా ఏవో ఊసుమాలిన బిల్లుల మీద తప్ప... అధికారపచ్చం, ప్రతిపచ్చం కలిసి ప్రజలకోసం రాజకీయం సేసిందే నేదట! నిత్యం పార్టీ స్వార్థం చూసుకుంటా, రాజకీయ లబ్ధికోసం లేనిపోని రాజకీయాలు సెయ్యడమే ఆళ్లు చేసే రాజకీయమంట! బయట జరుగుతున్నాది చూస్తంటే అదంతా నిజమేనని తెలుస్తంది కదా. నిజంగా ప్రెజల క్షేమం కోరి సహకరించుకునీవే అయితే, బద్ధ శత్రువుల్లా ఒకదానికొకటి ఎందుకని వ్యతిరేకించుకోవాల? గత ప్రెభుత్వం ఎట్టిన 'నీరు' మొక్క' పథకం మంచిదే కదా. అమల్లో లోపాలుంటే వుండొచ్చును. అవినీతి జరిగితే జరగొచ్చును. ఆట్ని సరిచెయ్యాల. అలా సెయ్యాల్సింది పోయి కొత్త ప్రెభుత్వం ఏకంగా ఆ పథకానికి మంగళం పాడీసింది. పచ్చచొక్కాల పార్టీ హయాంలో జరిగిన పూడికతీత పనులకి, చెరువుల పునర్ధరణ పనులకి, చెట్ల పెంపకానికి సంబంధించిన బిల్లుల్ని చెల్లించలేదంట. అధికారంలో కొచ్చిన కాడ్నించి ఆ బిల్లుల్ని పెండింగులో ఎట్టీసినాదంట. అదేవని అడిగితే విజిలెన్సు తనిఖీలతో, కొర్రీలు ఎట్టించేసి ఆట్ని ఆపించీసి నాదంట. ఇంకేవున్నాది, కాంట్రాట్టర్లు అప్పులపాలైపోనారు. చేతుల్లో తడి ఆరిపోనాది. పథకం వదిలీసిపోయేరు. మనకి నీళ్లు పోసే దిక్కునేకండా పోయింది. ఉప్పుడు ఆ కాంట్రాట్టర్లే తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోర్టు కెక్కుతున్నాది.. అప్పట్లో ఆ పథకం కింద లక్షల మొక్కలు నాటినారు. ఏదో చచ్చీ చెడీ ఈనాటికి ఎంతో కొంత ఎదిగొచ్చినాం. ఇంకొన్నాళ్లు నీళ్లు పోత్తే, ఇంక ఎవుళి సాయం లేకండా మన బతుకేదో మనం బతికేత్తాం. అలాంటి సమయంలో ఆ పథకం ఆపేసి ఈ కొత్త పెభుత్వం 'లచ్చన్న పచ్చహారం' పేరు మీద కొత్త పథకం తెచ్చినాదంట! ఉన్న మొక్కలకు నీళ్లోసి బతికించే దిక్కులేదు గానీ, పచ్చాంధ్రప్రదేశే లక్ష్యంగా ఎంతో దార్శనికతతో కొత్తగా కోటి మొక్కలు నాటినారంట! నిజంగానే ప్రెజల మీద, ప్రెజాస్వామ్యం మీద, పర్యావరణం మీద అంత పేమే గనక వుంటే, ఎవులు నాటిన మొక్కనైనా ఒకే దృష్టితో చూడాలి కదా... పార్టీ పక్షపాతాలకు పోయి పచ్చని మొక్కని ఎండగట్టడం ఎంతవరకు సబువు!'' అని కాస్త కరకుగానే సమాధానమిచ్చేను.

అ బాదంపొప్పు మొక్క సిగ్గుతో కొమ్మలు వాల్చీసుకు నుండిపోనాది.

మనసు బాధపెట్టుకున్నాదేవోనని.. "ఈ పార్టీ రాజకీయాల తీరే అంత కాబోలు.. నలుగురు కలిసి పార్టీ ఎడితే 'మన పార్టీ' అన్న పక్షపాత బుద్ధి ఆళ్లలో ఏర్పడిపోద్ది. అదే పార్టీ ఫీలింగు అంటే! ప్రతి పార్టీకీ అధికారం పట్టుకోడమే లక్ష్యం కాబట్టి, ప్రత్యర్థి పార్టీలను తొక్కీసైనా 'తమ పార్టీయే' అధికారంలోకి రావాలని అనుకుంటాది. ఈ క్రమంలో పార్టీ స్వార్థాలు పెరిగిపోయి, ఆటి మధ్యన పచ్చ గడ్డేత్తే భగ్గుమనిపోయేంత వైరం ఏర్పడిపోతంది. ఈ వైరం వొల్ల సమాజంలో ఉన్న సమస్యలు పరిస్కారం కాకపోగా, లేనిపోని సమస్యలు పుట్టుకొస్తన్నాయి. సమాజం అన్నిందాలా దుంపనాశనమైపోతంది. ఆ వైరంతోటే కదా ప్రెజాసమస్యల్ని గాలికొదిలీసి, పార్టీ పక్షపాతాలతో చట్టసభల్లో కొట్టుకు ఛస్తన్నాది. జాతి, కుల మతాలు సూసుకోకుండా ఇద్దరు మామూలు మనుసులు కలుత్తారేమో గానీ, రెండుపార్టీలకు చెందినోళ్లు ప్రెజాసేవ కోసం ఎంతమాత్రం చేత కలవరని నాకర్థమైపోనాది. ఒకేళ ఒకట్రెండు పార్టీలు జట్టు కట్టినాయన్నా, అదీ ప్రెజల కోసం అయ్యుండదు. నిక్కచ్చిగా తమ పార్టీ లబ్ధికోసవే అవుతాది. ప్రెజాస్వామ్య వృక్షాన్ని వేరు పురుగుల్లా ఆశించి తొలిచేస్తన్నాయి కదా ఈ రాజకీయ పార్టీలు'' అని ఆ మొక్కను బుజ్జగించే ప్రయత్నం చేసేను.

'ఆఁ... అంతోటున్నాదా ఈ రాజికీయంలోనా...'' అని ముక్కున వేలేసుకున్నాది ఆ బాదంపొప్పు మొక్క.

“ఆ గొడవ మూలంగా శానా విషయాలే సర్చించుకున్నాం మావు. అగ్రహారం పోతే పోయినాది గానీ, చట్టం తెలిసొచ్చినాదని సంబడపడ్డాడట కద వెనకటికి ఎవుడో! నా అనుభవం మీద రాజకీయం తెలిసొచ్చినాదని నాకూ అసుమంటి సంబడమే కలిగినాది. ఈ ముచ్చటంతా జరిగి నెలవుతున్నా ఇంతవొరకు, ఎవురూ మా దిక్కు చూసింది నేదు. ఇప్పటికే నా తోటిమొక్కల్లో కొన్ని ఎండిపోనాయి. నేను ఇంకెంత కాలం పచ్చగా ఉంటానో తెల్దు. వాతావరణవూ ఆశాజనకంగా నేదు. మూన్నెళ్లు పోతేగానీ రుతుపవనాలు రావు. అంతవరకు కాలం గడిసీది ఎలాగ? ఏవీ అర్థంగాకుంటంది. ఇంకో పక్క సూత్తే, కోర్టులో కేసడి పోనాది. కోర్టు కెక్కినోడూ, గాడిద నెక్కినోడూ ఒక్కటేనంట కదా! గాడిదలకు కాలం చెల్లిపోతున్నట్టుగ వున్నాది కానీ, ఈ సామెతకు కాలం చెల్లిపోయిలాగ నేదు. ఈ కోర్టు కేసు ఎప్పటికి తేల్తాదో... మా నోళ్లల్లో ఇన్నగలువు నీళ్లు ఎప్పుడు పడతాయో... అంతవరకు మేవు బతికుంటామో నేదో? ఏం జెప్పమంటారు?!

# పడిలేచిన కెరటం

యస్వీ కృష్ణ
✆ 93999 39302

***ఆనాడు నీతో చెప్పినట్లుగా కష్టాల్లో ఉన్న చాలామందికి ధైర్యాన్నిచ్చే మాటలు, నేను ఎన్నోసార్లు చెప్పాను. వాళ్ళందరూ నా మాటల్ని ఎలా స్వీకరించారో నాకైతే తెలీదు కానీ, నేను చెప్పిన ఆ నాలుగు మాటలతోనే నువ్వు నీ జీవితాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, నీ కూతుర్ని కూడా చక్కగా పెంచి, ప్రతిభావంతురాలిగా తీర్చిదిద్దావు. 'పడిలేచిన కెరటం' అనే పదానికి నిజమైన ఉదాహరణగా నిలిచావు***

"ఏమండీ... ఓసారిలా వస్తారా? ఎవరో ప్రభావతిట... ఎక్కడ్నుంచి వచ్చిందో గానీ– మీతోనే మాట్లాడాలట!"

హాల్లోని సోఫాలో కూర్చుని న్యూస్‌పేపర్ తిరగేస్తున్న కృష్ణారావు భార్య రమాదేవి మాటలకి తలతిప్పి చూశాడు.

'ప్ర..భా..వ..తి..! ప్రభావతి!!'

ఆయన పెదవులు అస్పష్టంగా పలుకుతూంటే... అసంకల్పితంగానే ఆయన భృకుటి ముడివడింది ఆలోచనతో! వృత్తిరీత్యా ఆయన తరచూ క్యాంపులకీ, వేర్వేరు ఊళ్లకీ తిరుగుతూంటాడు. ఆ ప్రస్థానంలో ఎందరో తారసపడుతూ వుంటారు. పలకరింతగానో, పరిచయం కోసమో ఎంతోమంది తనతో మాట్లాడుతుంటారు. కానీ, ఈ 'ప్రభావతి' అనే పేరు మాత్రం వెంటనే గుర్తురావడం లేదు. ఆవిడ మాత్రం తననే వెదుక్కుంటూ ఇంటి వరకూ వచ్చిందంటే..?!

"అబ్బ... త్వరగా రండి. తర్వాత చదువుకుందురు గానీ..." రమాదేవి విసుక్కుంటూ లోపలికొచ్చింది.

కృష్ణారావు అన్యమనస్కంగానే సోఫాలోంచి లేచి బయటికొచ్చాడు.


భుజం చుట్టూ కొంగు కప్పుకొని, గుమ్మం బయట వినయంగా నించున్న 'ఆమె' ముఖంలోకి పరీక్షగా చూశాడు. నిజమో, కాదో తెలీదు కానీ... జీవితంలో ఎన్నో ఒడిదుడుకులకి గురై, అన్నిటినీ దాటుకుంటూ తుదివరకొచ్చిన శ్రమ తాలూకు విజయం ఆ కళ్ళల్లో కనబడుతున్నట్లుగా అనిపిస్తోంది ఆమెని చూస్తూంటే!

"నమస్కారం సార్..." రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ అన్నదామె.

"రండమ్మా... కూర్చుని మాట్లాడదాం!" అని లోపలికి నడిచాడు. ఆయన వెనకాలే లోపలికి అడుగుపెట్టిన ఆవిడ హాల్లోని సోఫాలో కూర్చున్న తర్వాత తనూ ఆమె ఎదురుగా కూర్చున్నాడు కృష్ణారావు.

చుట్టుప్రక్కల ఎటూ చూడటం లేదామె. ఆయన ముఖంలోకే ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్లుగా కన్నార్పకుండా అపురూపంగా చూస్తోంది. ఆమె కళ్ళనిండా కృతజ్ఞతాభావం సముద్రంలా నిండివుంది. అది గమనించి కాస్త ఇబ్బందిగా కదిలాడు కృష్ణారావు.

ఆ తర్వాత తలతిప్పి, "రమా! కాసిని మంచినీళ్లు తీసుకురా!" అని చెప్పి తనను తాను సర్దుకుని కూర్చున్నాడు. ఆమె ఎవరో తనకింకా గుర్తురాకపోయినా, ఆమెకి మాత్రం తను బాగా తెలిసినవాడినేనన్న విషయం ఆమె వాలకాన్ని చూస్తూంటే అర్థమౌతోంది ఆయనకి.



"ఊ... చెప్పమ్మా..." అన్నాడు విషయంలోకి వస్తున్నట్లుగా.

"మా అమ్మాయి 'శ్వేత' ఇప్పుడు మంచి కూచిపూడి డాన్సరయ్యింది సార్! ఇప్పటిదాకా నూటయాభై ప్రదర్శనలిచ్చింది. వాటి గురించి తెలిసి లండన్ వాళ్ళట .. వాళ్ళ దేశంలో ప్రోగ్రాం ఇవ్వమని అడిగారు. వచ్చే నెలలో అక్కడికి వెళ్లబోతున్నాం.."

చకచకా చెప్పుకుపోతున్న ఆమె మాటలు విన్నాడే కాని, 'అసలు ఆమెకి తనతో పనేమిటి?' అన్న విషయం మాత్రం అర్థంకాలేదు కృష్ణారావుకి.

'శ్వేత? ఈ పేరు విన్నట్లుగానే ఉంది. అసలు నిన్నా, మొన్నా తన మాటల్లో కూడా ఈ 'శ్వేత' అనే పేరు దొర్లినట్లుగానే అనిపిస్తోంది కాని, ఎవరో గుర్తురావడం లేదే!' అనుకుంటూ ఆమె చెప్పేది వినసాగాడాయన.

అది తెలియని ఆమె, ఆయనకు తన గురించి అంతా తెలుసనే అనుకొని గుక్కతిప్పుకోకుండా చెప్పసాగింది.

అంతలో... లోపల్నుంచి రమాదేవి రెండు మంచినీళ్ళ గ్లాసులు, రెండు కాఫీ కప్పులు ట్రేలో తీసుకువచ్చి వారి ముందున్న టీపాయ్‌పై పెట్టగానే "తీసుకోండమ్మా..." అన్నాడు కృష్ణారావు, ఆమె వైపు చూస్తూ.

కానీ, తీసుకోలేదామె. తను చెప్పే మాటలకు ఆయన ఏ విధంగానూ స్పందించకపోవడంతో ఆమెకి అనుమానం కలిగింది– "సార్... నేనెవరో మీకు గుర్తుకు రాలేదా?'' అనడిగింది సందేహంగా ఆయననే పరిశీలనగా చూస్తూ.

చెప్పక తప్పలేదాయనకి.. "క్షమించమ్మా... నిజంగానే నాకు గుర్తురావడం లేదు!" అన్నాడు.

అది వినగానే ఆమె మనసు నొచ్చుకుంది. రమాదేవి కూడా వచ్చి కూర్చుంది విషయం తెలుసుకోవడానికి.

"పదహారేళ్ల క్రిందటి విషయం సార్...'' గుర్తుచేస్తున్నట్లుగా మొదలుపెట్టింది ప్రభావతి.

"కర్నూలులోని సంజీవని హాస్పిటల్లో నేను అబార్షన్ కోసం అడ్మిట్ అయ్యాను. అప్పుడే నా బెడ్ ప్రక్కనే మీకు తెలిసిన పేషెంట్ ఎవర్నో పరామర్శించడానికి మీరొచ్చారు. నా పరిస్థితిపై నేననుభవిస్తున్న మానసిక క్షోభను, దానికి పరిష్కారంలేని ఆలోచనలతో ఆత్మహత్య చేసుకోవాలన్న నా బాధని, మా అమ్మకు చెప్పుకుంటూ నేను తల్లడిల్లిపోతూంటే 'ఏ దేవుడో నాపై దయ తలచినట్లు' మీరు ధైర్యాన్నిస్తూ చెప్పిన నాలుగు మాటలు నాకు బ్రతుకుపై ఆశ కలిగించాయి. నా భర్త నన్నూ, నా బిడ్డనూ పోషించలేని అసమర్థుడు మాత్రమే కాదు, అతనొక వ్యసనపరుడు, వ్యక్తిత్వం లేనివాడు. నా సంసార జీవితం నూరేళ్లు చల్లగా ఉంటుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న నాకు, పెళ్ళయిన మూడేళ్లకే నరకం చూపించాడు. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత నా బ్రతుకు మరింత దిగజారిపోయింది. తను కష్టపడి సంపాదించకపోగా, ఇంట్లోని విలువైన వస్తువులన్నింటినీ తన తాగుడుకే తగలబెట్టాడు. అంతేకాదు, ఇల్లు గడిచేందుకు, పదిమంది ఇళ్ళలో చాకిరీ చేసి నేను తీసుకొచ్చిన నాలుగు డబ్బుల్ని కూడా దౌర్జన్యంగా లాక్కుని తాగేసేవాడు. ఆత్మహత్యకు పాల్పడే స్థితికి వచ్చిన నా సమస్యలు అందరికీ తేలికగా అన్పించవచ్చు. కానీ, నాకు అలా అన్పించకపోవడం వల్లే ఆ ప్రయత్నం చేశాను.

మా అమ్మతో నేను రహస్యంగా చెప్పుకుంటున్న నా బాధా, వేదనా అన్నీ విన్నారు మీరు. ఆ తర్వాత మా అమ్మ నాకు ధైర్యం చెబుతూంటే... మధ్యలో మీరు కలుగజేసుకుని, 'జీవితం' విలువ గురించి నాకు అర్థమయ్యేట్లు చెప్పారు.

'చూడమ్మా... చనిపోవడానికి నువ్వు చేసిన ధైర్యం, చూపించిన తెగువ, బ్రతకడానికి చూపించు. అప్పుడు నీ జీవితంలోని బాధలు, కష్టాలు తొలగిపోతాయి!' అని ఆరోజు మీరు అన్న మాటలు నాకు కొత్త ధైర్యాన్నిచ్చాయి సార్...

ఆ తర్వాత మొండి ధైర్యం తెచ్చుకొని, నా బిడ్డను తీసుకొని నా భర్తనుంచి దూరంగా వచ్చేశాను. అక్కడా, ఇక్కడా నాలుగిళ్ళలో పనిచేసుకుంటూ నా కూతురు శ్వేతను చదివించుకుంటూ పెంచి పెద్దచేశాను. తను ఇప్పుడు మంచి కూచిపూడి డాన్సర్ అయ్యింది...'' అని, ఉద్వేగాన్ని ఆపుకునే ప్రయత్నంలో రెండు క్షణాలు ఆగిందామె.

కృష్ణారావు ఆశ్చర్యంగా వినసాగాడు... ఆమె మళ్లీ చెప్పసాగింది.

"సార్! ఇన్నేళ్లలో నాకు ఎన్నోసార్లు బాధలూ, కష్టాలూ ఎదురయ్యాయి. కానీ, ఎప్పుడూ పిరికిదానిలా చనిపోవాలని మాత్రం అనుకోలేదు సార్! ప్రతి కష్టంలోనూ 'చనిపోవడానికి నువ్వు చేసిన ధైర్యం, చూపించిన తెగువ– బ్రతకడానికి చూపించు. అప్పుడు నీ జీవితంలోని బాధలు, కష్టాలు తొలగిపోతాయి!' అన్న మీ మాటలే గుర్తుతెచ్చుకొనేదాన్ని! అంతే... అదేంటోగాని, మీ మాటలు గుర్తుచేసుకోగానే.. ఎక్కడలేని గుండెధైర్యం కలిగేది, వంద ఏనుగుల బలం వచ్చేసినట్లుగా అనిపించేది. ఆ ధైర్యంతోనే ప్రతి కష్టాన్నీ దాటుకుంటూ వచ్చాను సార్! ఇప్పుడు నాకు భవిష్యత్తు కూడా సంతోషంగా కనబడుతోంది!" అని ఓ క్షణం ఆగి, చెప్పింది మళ్లీ.

"ఇప్పుడు మా అమ్మాయి మంచి కూచిపూడి డాన్సర్ మాత్రమే కాదు సార్... మొన్న జరిగిన పదవ తరగతి పరీక్షల్లో మన రాష్ట్రం మొత్తం మీద అందరికంటే ఎక్కువ మార్కులు తెచ్చుకొని ఫస్టున పాసయ్యింది..."

కృష్ణారావు నమ్మలేకపోయాడు. ఏదో సాటిమనిషిగా ఓ అభాగ్యురాలికి ధైర్యాన్నివ్వడానికి తాను చెప్పిన నాలుగు మాటలు ఆ వ్యక్తిపై ఎంతటి ప్రభావాన్ని చూపించాయో తెలిపే సాక్ష్యం, ఇంకెంతటి ప్రయోజకత్వాన్ని కలిగించాయో వివరించే ఋజువు... తన కళ్ళముందే ప్రత్యక్షంగా కనిపిస్తూంటే, అనిర్వచనీయమైన అనుభూతితో కొన్ని క్షణాలపాటు అతడి మేను జలదరించింది. వెంటనే తేరుకొని.. "అవునూ... మీ అమ్మాయి పేరేమిటన్నావ్?'' అనడిగాడు.

"శ్వేత... శ్వేత సార్!'' అందామె ఉద్వేగంగా.

అప్పుడు గుర్తొచ్చింది కృష్ణారావుకి.. పదిరోజుల క్రితం అన్ని దినపత్రికల్లో పదవ తరగతి ఫలితాలు ప్రకటిస్తూ 'స్టేట్ ఫస్ట్' వచ్చిన 'శ్వేత' అనే అమ్మాయి ఫోటోతో పాటు తన వివరాలు ప్రచురించిన విషయం! అంతేకాదు, ఆరోజు రాత్రి టీ.వీ. న్యూస్‌ఛానల్స్‌లో ఆ అమ్మాయిని చూపిస్తూ నాలుగు మాటలు మాట్లాడిస్తున్న సమయంలో.. అదే పదవ తరగతి పరీక్షల్లో ఫెయిలైన తన మనవడికి అది చూపిస్తూ "ఆ అమ్మాయిని చూసి బుద్ధి తెచ్చుకోరా!'' అని తను అన్న మాటలు కూడా గుర్తొచ్చాయ్. అయితే, ఆ 'శ్వేత' అనే అమ్మాయి ఈ 'ప్రభావతి' కూతురే అన్నమాట!

"సార్...'' అంటూ ప్రభావతి పిలిచిన పిలుపుకి ఆలోచనల్లోంచి తేరుకొని, ఆమె వైపు చూశాడు.

"సార్! స్టేట్ ఫస్ట్‌ర్యాంకు వచ్చిన సందర్భంలో ఈరోజు సాయంత్రం రవీంద్ర భారతి ఆడిటోరియంలో మా శ్వేతకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా సత్కారం, ప్రశంసా పత్రం ఇస్తున్నారు. మీరు తప్పకుండా వచ్చి నా బిడ్డకు మీ దీవెనలు అందించండి సార్! ఇందుకే ఇన్ని సంవత్సరాల తర్వాత మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాను. మీ మాటలు నన్నూ, నా జీవితాన్నీ నిలబెట్టాయి... మీ ఆశీర్వాదం నా కూతురు భవిష్యత్తునీ, జీవితాన్నీ గొప్పగా తీర్చిదిద్దుతుందని నా నమ్మకం సార్!'' కళ్ళల్లో నీటి సుడులు కమ్ముకుంటూండగా... అభ్యర్థనగా అంది ప్రభావతి.

కృష్ణారావుకి ఏం మాట్లాడాలో తెలియక వెంటనే బదులివ్వలేదు. సాలోచనగా ఎటో చూస్తూ మౌనంగా ఉండిపోయాడు చాలాసేపు.

ఆయన స్పందన అర్థంకాక, ఉద్వేగంగా ఆయన ముఖంలోకే చూడసాగింది ప్రభావతి.

కొద్దిసేపటి తర్వాత... మనసులోని భావాలన్నింటికీ ఓ రూపం వచ్చినట్లుగా తల పంకిస్తూ... అక్కడే కూర్చున్న భార్య రమాదేవి వైపు ఓసారి చూసి, ఆ తర్వాత ప్రభావతి వైపు తిరిగి అన్నాడు కృష్ణారావు.. "చూడమ్మా ప్రభావతీ! ఆనాడు నీతో

చెప్పినట్లుగా కష్టాల్లో ఉన్న చాలామందికి ధైర్యాన్నిచ్చే మాటలు, నేను ఎన్నోసార్లు చెప్పాను. వాళ్ళందరూ నా మాటల్ని ఎలా స్వీకరించారో నాకైతే తెలీదు కానీ, నేను చెప్పిన ఆ నాలుగు మాటలతోనే నువ్వు నీ జీవితాన్ని నిలబెట్టుకోవడంతో పాటు, నీ కూతుర్ని కూడా చక్కగా పెంచి, ప్రతిభావంతురాలిగా తీర్చిదిద్దావు. 'పడిలేచిన కెరటం' అనే పదానికి నిజమైన ఉదాహరణగా నిలిచావు. నా మాటల్ని వృధాపోనీయకుండా, ఇంతటి ప్రయోజకత్వాన్ని చేకూర్చి చూపావు. అందుకు నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను." అని ఓ క్షణం ఆగి, ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ మళ్లీ అన్నాడు..

"నువ్వు సాధించిన ఈ ప్రయోజకత్వాన్ని గౌరవించాల్సిన బాధ్యత కూడా నామీద ఉంది కదా!"

ఆయన మాటలు అర్థంకానట్లు అయోమయంగా చూసింది ప్రభావతి.

అప్పటివరకూ కృష్ణారావు ప్రక్కనే కూర్చొని, జరిగేదంతా మౌనంగా చూస్తూ, వింటూ, విషయం పూర్తిగా అర్థం చేసుకున్న రమాదేవి అప్పుడు పెదవి కదిపింది.. "చూడు ప్రభావతీ! స్టేట్ ఫస్ట్ర్యాంకు సాధించిన మీ శ్వేతని మొన్న టీ.వీ.లో ఇంటర్వ్యూ చేస్తూన్న యాంకర్ అడిగిన ప్రశ్నకి 'నాకు డాక్టర్ కావాలని ఉంది. కానీ, మా ఆర్థిక పరిస్థితి వల్ల నేను డాక్టర్ కోర్స్ చేయలేను' అని శ్వేత చెప్పడం మేమూ చూశాం. ఇక ఆ దిగులు పెట్టుకోవద్దని మీ అమ్మాయికి చెప్పు. మీ శ్వేత డాక్టర్ కోర్స్ చదివేందుకు అయ్యే ఖర్చు మొత్తం మేము భరిస్తాం. అలా మా బాధ్యతని నెరవేరుస్తాం... సరేనా!"

ప్రభావతికి వెంటనే అర్థం కాలేదు. కృష్ణారావు మాటలతో పాటు రమాదేవి మాటలకు కూడా అర్థం తెలీక, వాళ్ళిద్దరి ముఖాల్లోకీ అయోమయంగా మార్చి మార్చి చూస్తూండిపోయింది.

కాసేపటికి రమాదేవి మాటల్లోని భావం, అందులోని సారం పూర్తిగా అవగతమయ్యాక, ఆమె మనసులోని ఉద్వేగం, ఆనందం ఒక్కసారిగా భళ్ళుమని బ్రద్దలయ్యేసరికి.. "సార్... అమ్మా..." అంటూ భోరుమంటూ ముందుకొచ్చి రెండుచేతుల్తోనూ ఆ భార్యాభర్తల కాళ్లను చుట్టేసి, ఆనందబాష్పాలతో కన్నీరుమున్నీరవసాగింది.

ఆమెని వారించే ప్రయత్నం చేయలేదు కృష్ణారావు.

'అర్థాంగి' అన్న పదానికి నిజమైన నిర్వచనంలా... తన మనసునీ, ఉద్దేశాన్ని మాత్రమే కాకుండా, తన ఊపిరిని సైతం మాటల్లోకి అనువదించి పలికిన భార్య రమాదేవి వంక ప్రశంసాపూర్వకంగా చూస్తూ ఉండిపోయాడు.

# కుందేలు విందు

కూచిమంచి నాగేంద్ర
✆ 91821 27880

కథామంజరి బాల కథ

***ఒకరోజు సరళం అన్ని జంతువులని విందుకి పిలిచింది. "ఎందుకు సరళం కష్టపడి జంతువులకి విందు ఇవ్వడం" అంది కోయిల.***
***"మా అమ్మ చెప్పేది... 'ఒకరి ఆకలి తీరిస్తే ఎంతో పుణ్యం వస్తుందని'! అందుకే నేను ఎప్పుడూ ఇతరుల ఆకలి తీర్చడానికి ప్రయత్నం చేస్తుంటా!" అంది సరళం.***

కొండవీటి అడవిలో జంతువులన్నీ కలిసిమెలిసి ఉండేవి. అక్కడ సరళం అనే కుందేలు ఉంది. అది రోజంతా కష్టపడుతూ ఆహారం సంపాదించి, దానిలో కొంత ముసలి జంతువులకు, పిల్ల జంతువులకు పెట్టేది. దానితో అక్కడి జంతువులకి సరళం అంటే అభిమానం! కానీ కృతకం అనే నక్క మాత్రం సరళాన్ని ఎప్పుడెప్పుడు తినేయాలా అని చూస్తూ ఉండేది. జంతువులన్నిటికి సరళం అంటే అభిమానం కనుక, దాన్ని ఏమన్నా చేసింది తానే అని తెలిస్తే అవి ఊరుకోవు అనే భయం కూడా ఉండేది.

ఒక రోజు తన నేస్తమైన తోడేలుకి విషయం చెప్పింది. "ఓసి ఇంతేనా! ముందు సరళం మీద ఉండే అభిమానం పోగొడితే సరి! జంతువులు దాన్ని చీదరించుకుంటాయి, తరవాత నీ పని సులువు అవుతుంది" అంది తోడేలు.

ఆ రోజు నుండి నక్క సరళాన్ని ఎప్పుడెప్పుడు చెడ్డ చేయాలా అనే ఆలోచన చేస్తూ ఉండేది. ఒకరోజు సరళం అన్ని జంతువులని విందుకి పిలిచింది. "ఎందుకు సరళం, కష్టపడి జంతువులకి విందు ఇవ్వడం?" అంది కోయిల.



"మా అమ్మ చెప్పేది... 'ఒకరి ఆకలి తీరిస్తే ఎంతో పుణ్యం వస్తుందని! అందుకే నేను ఎప్పుడూ ఇతరుల ఆకలి తీర్చడానికి ప్రయత్నం చేస్తుంటా!" అంది సరళం.

ఈసారి జీవులకి స్వయంగా వండి పెట్టాలి అనుకుంది సరళం. సరళం చేసే హడావిడి చూస్తోంది కృతకం. 'అదే అవకాశం... విందుకి ఏనుగు మంత్రి కూడా వస్తుందని తెలిసి సరళం, వండే వంటలో ఏదన్నా కలిపేస్తే సరి అన్నీ దాని చీదరించుకుంటాయి' అనుకుంది.

దారిలో కనిపించిని కాకమ్మను "ఇక్కడ కుంకుడు చెట్టు ఎక్కడుంది?" అని అడిగినది.

"ఇప్పుడు అదెందుకు?" అంది కాకి.

"సరళం విందుకు పిలిచింది కదా, తలారా స్నానం చేసి వస్తాను!" అంది కృతకం.

"సరే..." అని దానికి కుంకుడు చెట్టు ఎక్కడ ఉందో చెప్పింది కాకి. కానీ దానికి కృతకం మీద అనుమానం వచ్చింది. తరువాత సరళం ఇంటి దగ్గర ఘుమఘుమలాడుతున్న పాయసంలో ఎవరు చూడకుండా కుంకుడురసం కలిపింది కృతకం. సరళం ఎప్పుడెపుడు వడ్డన చేస్తుందా అని చిన్న చిన్న జంతువులన్నీ ఎదురు చూస్తున్నాయి.

"వడ్డన చేసేటప్పుడు ముందు పాయసం కృతకానికి రుచి చూపించు, అప్పుడు అందరికీ వడ్డించవచ్చు" అంది కాకి.

"నాకు రుచి చూడడం రాదు" అని తప్పించుకోబోయింది కృతకం.

"నీకు రుచి చూడడం రాకపోవడం ఏమిటి? ఎవరేమి తెచ్చినా మృగరాజుకి అన్నీ రుచి చూసి పెడతావు కదా!" అంది ఏనుగు మంత్రి.

"కృతకానికి అన్నీ తెలుసు కానీ, పాయసం రుచి చూడలేదు! ఎందుకంటే దానిలో కుంకుడు రసం కలిపింది అదే!" అంది కాకి.

"ఛీ... ఛీ... ఒకరికి పెట్టడం చేతకాదు, కానీ పాడు చేయడం మాత్రం వచ్చు!" అని చీవాట్లు పెట్టాయి జంతువులు.

మిగిలిన పదార్థాలతో విందు ఘనంగా సాగింది. ఇక సరళాన్ని ఏమి చేయలేము అని మౌనంగా విందులో పాల్గొంది కృతకం.

# బుద్ధి వచ్చిన నక్క

నారంశెట్టి ఉమామహేశ్వరరావు
✆ 9490799203

కథామంజరి బాలకథ

**_నెమ్మదిగా అడుగులేస్తూ పాకలో అడుగుపెట్టింది నక్క. ఒక గొర్రెపిల్లని పట్టుకోవాలని కళ్లు పెద్దవి చేసుకుని చూడడానికి ప్రయత్నించింది. గొర్రెలమంద మధ్యలో పడుకుని ఉన్న పొట్టేలు నక్క రాకని చూడనే చూసింది. అది వేగంగా లేచి వచ్చి తలమీది కొమ్ములతో నక్కని గుద్దింది. ఆ దెబ్బకి అంతెత్తున ఎగిరి కిందపడింది నక్క._**

ఒక చిట్టడవిలో నక్క, కుందేలు, చిలుక స్నేహంగా ఉండేవి. ఒక రోజు సాయంత్రం నక్క తన మిత్రుల్ని పిలిచి "ప్రక్కనున్న ఊళ్లోకి వెళ్దామా? మంచి తిండి తిని చాలా రోజులైంది. తినడానికి ఏదైనా దొరుకుతుందేమో ప్రయత్నిద్దాం" అంది.

"నాకు మనుషులంటే భయం! మనల్ని చూశారంటే పట్టుకుంటారు. నేను రాను!" అంది కుందేలు.

"నేనుండగా భయమెందుకు! ఆపదొస్తే ఉపాయంతో బయట పడేస్తాను. ఫరవాలేదు. నువ్వూ రావాలి!" అంది నక్క, కుందేలుకి ధైర్యం చెబుతూ.

ఆ మాటలతో ధైర్యం తెచ్చుకున్న కుందేలు 'సరే'నని బయల్దేరింది. "ప్రక్కనే ఉన్న ఒక ఊళ్ళోకి ఎన్నోసార్లు వెళ్ళాను. ఇప్పుడు ఆ ఊరే వెళదాము. నేను దారిచూపిస్తాను. రండి" అంది చిలుక గాల్లోకి ఎగురుతూ.

మిగతా రెండూ నేల మీద పరిగెడుతుండగా... ఊళ్లోకి తీసుకెళ్లింది చిలుక. వెలుతురు ఉన్నంతసేపూ గోడలు, గడ్డివాముల చాటున దాక్కుంటూ గడిపాయవి. చీకటి పడ్డ తరువాత జనసంచారం తగ్గిందని చూసుకున్నాక, మూడూ కలిసి ధైర్యంగా సంచరించాయి.

ఒక పూరిపాకలో ఉన్న గాదె ప్రక్కన రాలిన తృణధాన్యాలను చూసిన కుందేలు, అక్కడకి వెళ్లి తినబోయింది. "ఆగు! అంత తొందర ఎందుకు నేస్తం. కుక్కలు చూసాయంటే అరిచి మీద పడి కొరికేస్తాయి. జాగ్రత్తగా ఉండాలి. ఏమీ ప్రమాదం లేదన్నప్పుడే తినాలి!" అని హెచ్చరించింది చిలుక.

"నిజమే. తొందరపడ్డాను" అని కుందేలు తప్పు ఒప్పుకుంది. చుట్టూ బాగా పరిశీలించి ప్రమాదమేమీ లేదని నిర్ధారించుకున్న తరువాత, అక్కడున్న గింజల్ని తింది కుందేలు.

కొంతసేపటి తరువాత, "నాకు ఆకలి వేస్తోంది. ఎక్కడైనా గొర్రెపిల్ల దొరుకుతుందేమో చూద్దాం. రండి!" అని మిత్రులను తొందర పెట్టింది నక్క .

'సరే' అన్నాయి, చిలుక, కుందేలు. అక్కడి నుండి కదిలాయి మూడున్నూ!

అలా ఊళ్ళో నడుస్తూ వెతుకుతుండగా, ఒకచోట గొర్రెలమందని చూసింది నక్క. దానికి నోట్లో నీళ్ళూరాయి. ఆశగా గొర్రెలున్న వైపు అడుగులు వేసింది నక్క.

నక్క తొందరపడి వెళ్ళడాన్ని చూసిన చిలుక "తొందరపడొద్దు. అక్కడి పరిస్థితేమిటో తెలుసుకోవాలి. గొర్రెల కాపలాకి వేటకుక్క ఉంటుంది. అది చూసిందంటే



దాడి చేస్తుంది. ముందుగా వెళ్లి పరిశీలిస్తాను. ఆగు" అని చెప్పింది.

చిలుక మాటలు పట్టించుకోకుండా నక్క ముందుకే వెళ్ళింది.కుందేలుకూడాదాన్నిఆపడానికిప్రయత్నించింది.

వాటి మాటలు వినకుండా "ఇంత కష్టపడి వచ్చింది గొర్రెపిల్ల కోసమే! నన్నాపొద్దు. ఏమీ జరగదు. గొర్రెల కాపరి, వేటకుక్క హాయిగా పడుకుని ఉంటారు!" అని వాటి మాటల్ని తేలికగా కొట్టి పారేసింది నక్క.

తమ సలహాని పెడచెవిన పెట్టవద్దని బ్రతిమలాడాయి రెండున్నూ! కానీ నక్క వినిపించుకోకుండా తిండికి ఆశ పడింది.

నక్కతో కలసి ఉంటే తమకీ ఆపద తప్పదనుకున్నాయి చిలుక, కుందేలు. ఒక్క క్షణం ఆగకుండా అడవిలోకి పరుగు తీశాయి.

"మీరు వెళ్ళిపోతే నాకేమైనా భయమా? హాయిగా గొర్రెపిల్లని భోంచేసి నెమ్మదిగా ఇంటికి వస్తాను!" అని వెనుక నుండి వాటితో చెప్పింది నక్క.

నెమ్మదిగా అడుగులేస్తూ పాకలో అడుగుపెట్టింది నక్క. ఒక గొర్రెపిల్లని పట్టుకోవాలని కళ్లు పెద్దవి చేసుకుని చూడడానికి ప్రయత్నించింది. గొర్రెలమంద మధ్యలో పడుకుని ఉన్న పొట్టేలు నక్క రాకని చూడనే చూసింది. అది వేగంగా లేచి వచ్చి తలమీది కొమ్ములతో నక్కని గుద్దింది. ఆ దెబ్బకి అంతెత్తున ఎగిరి కిందపడింది నక్క.

దాంతో గొర్రెల్లో కదలిక వచ్చింది. అవన్నీ లేచి నిలబడిన భయంతో అటూఇటూ పరుగులు తీసాయి. గొర్రెల మంద భయపడడం చూసిన కాపలా కుక్క... గట్టిగా అరుస్తూ లోపల ప్రవేశించింది. దగ్గర్లో పడుకున్న గొర్రెల కాపరి కూడ పాక లోపలికి వచ్చాడు. లోపలున్న నక్కని చూసిన కాపరి, మూలనున్న దుడ్డుకర్ర అందుకుని కసిదీరా నక్కని బాదాడు. మరోవైపు కాపలా కుక్క, నక్కని వెంటబడి తరిమింది. కుయ్యో మొర్రోమని ఏడ్చుకుంటూ అడవిలోకి పరుగు తీసింది నక్క.

దెబ్బలతో తిరిగొచ్చిన నక్కను చూసి జాలిపడ్డాయి చిలుక, కుందేలు.

"మీ మాట వినిపించుకోనందుకే దెబ్బలు పడ్డాయి. నువ్వు చెప్పిన జాగ్రత్తలు పాటించిన కుందేలు సురక్షితంగా ఉంది. వినలేదు కాబట్టి దెబ్బలు తిన్నాను" అంది నక్క బాధగా.

"నువ్వు మా మిత్రుడివి కాబట్టి నీ మేలు కోరి జాగ్రత్తలు చెప్పాము. గొర్రెపిల్లని తినాలన్న ఆశతో మా మాటల్ని పట్టించుకోలేదు. అది నీ తప్పే! ఇకముందైనా జాగ్రత్తగా ఉండు!" అన్నాయి కుందేలు, చిలుక.

"ఇకముందు జాగ్రత్తగా ఉంటాను. బుద్ధి వచ్చింది!" అంది నక్క.

# ఇల్లు చూసి వెళ్లవోయ్!

నవులూరి వెంకటేశ్వర రావు
✆ 9966340014

**విశిష్ట అతిథి కథ**


> ***"త్వరగా కోలుకో... మళ్ళీ వచ్చి నిన్ను చూస్తా!" అన్నాడు రమణ లేచిపోతూ.***
> ***వేణు తన చేతిని తిరిగి అందించాడు కలిలంలోకి జారి కూరుకుపోతూ పైకి లాగడానికిచ్చినట్టు! రెండు చేతులతో దాన్ని ఆప్యాయంగా నొక్కి మంచం మీద ఉంచాడు. "ఇల్లు చూసి వెళ్ళవోయ్!" అన్నాడు శ్రీపతి.***
> ***రమణ మిత్రుడి మొహంలోకి చూశాడు రెండు మూడు క్షణాలు. వెంటనే తేరుకున్నాడు.***
> ***"ముందే కొంత మేరకు చూశాను, మిగిలినది చూసి వెళతాను. చాలా అధునాతనంగా ఉంది. అభినందనలు!"***

వేణు శ్రీపతితో చెప్పాడట, "రమణ నిన్ను చూడటానికి వస్తున్నాడు," అని. "ఉఁహూ" అని ఊరుకున్నాడట. ఏమిటి ఆ పదం అర్థం? నీవు చెప్పింది విన్నాను అని సూచించడం మాత్రమే. కనీసం ఆసక్తిని వ్యక్తం చెయ్యడంకూడా కాకపోవచ్చు. ఎవరొచ్చినా, రాకపోయినా అతనికి ఒరిగేదేముంది? కాలక్షేపానికి కూడా మనుషుల అవసరం అతనికి ప్రస్తుతం లేదు. గడిచే ప్రతి క్షణం భయపెడుతోంది. దానికి కళ్లెం వేసే వీలులేదు. క్రమం తప్పనిది కాలం!

నగరంలో ఒక మూలనుంచి మరో మూలకు వెళ్లడమంటే కష్టమైన పని. బస్సుల్లో, ఆటోలలో, ఎలాంటి కష్టానికైనా ఓర్చి చేయవలసిన పని... వెళ్లి శ్రీపతిని కలవడం, యాభై ఏళ్ళ పైచిలుకు పరిచయం కారణంగా! పరిచయమూ ఒక రకమైన అనుబంధం... నిజానికి లోకంలో స్నేహంగా భావించేది రమణ, శ్రీపతి మధ్య ఉంది.

కనుగొనగలడా ఇల్లు? ఎడమ వైపు, పడమర దిక్కున తూర్పు వైపు చూస్తుంటుంది ఇల్లు. ఎంత కాలమైనా దాని రూపే... కానీ దిక్కులు మారవు. ఉత్తరదిక్కుకేసి నడచి, వేణు చెప్పిన గుర్తుల ఆధారంగా కొత్తగా కట్టిన నాలుగంతస్తుల భవనం ముందు ఆగాడు. అదే తన గమ్యం. ఫుట్‌పాత్ మీద నిలబడ్డాడు తూర్పు వైపు తిరిగి. జుట్టులేని బ్లాక్ క్యాట్ కమెండోలాంటి వేణుకు, బండిమీద రావడానికి రెండు నిమిషాలు చాలు. కూతవేటు దూరం. అతనికి కాలం మీద గౌరవం లేదు... కాలానికి ఎవరి మీదా గౌరవం ఉండదు. రెండు నెలలుగా వారంలో నాలుగుసార్లు వెళ్లి, శ్రీపతితో మాట్లాడుతున్నాడు వేణు. ప్రతి అవకాశాన్నీ కాలక్షేపానికి వినియోగించుకుంటాడు వేణు. మాట్లాడటమే తప్ప ఎవరు చేయగలిగిన సహాయమూ లేదు శ్రీపతికి. మాటలు మందులా పనిచేయవు.

ఎవరితోనూ లోతైన స్నేహం చేసే గుణం శ్రీపతికి లేకపోయినా, చాలామంది స్నేహితులని పిలువబడేవాళ్లు ఉన్నారు. మంచి మాటకారి. ఎవ్వరినీ మోసం చెయ్యడు. సహాయమూ ఎక్కువ చెయ్యలేదు, చెయ్యగలిగినదీ చొరవగా చెయ్యడు. పక్కనున్న ఒక జిల్లాలో ఆస్తిపాస్తులు... స్వల్పంగానో ఓ మోస్తరుగానో ఉన్నాయి. ఆ వివరాల గురించీ అతను ఎప్పుడూ మాట్లాడలేదు. అనవసర విషయాలలో కూడా కాస్త గోప్యత పాటిస్తాడు. మంచి జీతం వచ్చే ప్రభుత్వ ఉద్యోగి. ఖర్చుదారీ మనిషి కాదు. ఖరీదైన బట్టలు తాను వేసుకోడు, భార్యకూ, పిల్లలకూ కొనడు. పిల్లలను అంతంత మాత్రపు చదువులు చదివించాడు. తిరగడానికి ఒక వాహనం కూడా కొనుక్కోలేదు. ఎవరన్నా ఆ విషయం ప్రస్తావిస్తే... "నేను దాన్ని నడపటం నేర్చుకోలేను. నడపలేనప్పుడువాహనమెందుకోయ్?" అని నవ్వేసేవాడు. ఎవరినీ యాచించే గుణం లేదు. యాచించక తప్పనపుడు దాన్ని యాచనగా వినిపించకుండా సరైన పదాలు ఉపయోగించగలడు. అతనికి వస్తువ్యామోహం కన్నా డబ్బు వ్యామోహం వుంది. అది వస్తువుల కొనుగోలుకు అడ్డం! ఏ వ్యసనం లేదు. మధ్యస్థపు ఎత్తులో, బొద్దుగా, చామనఛాయ రంగులో ఉంటాడు. మొహం కన్నా, అతని చిరునవ్వు ఆకర్షణీయంగా ఉంటుంది.



రెండుభాగాల మరుగుజ్జు ఇంటి స్థానంలో ఈ సౌధాన్ని చూడటం నమ్మవలసిన నిజం. ఒకనాటి గజం విలువ పది రూపాయల నుంచీ, ఇప్పుడు లక్షకు ఎగబాకి ఉంటుంది. పెరుగుట విరుగుటకు కాకపోవచ్చు. పెరుగుట పెరుగుటకే కావచ్చు! పాత మనుషులు పోయే దాకా ఎదురు చూడటమే తప్ప, వాళ్ళను నూతనంగా నిర్మించి మరింత జీవం పోసే వీలు లేదు! కట్టడాలతో ఆ పేచీ లేదు.

విననదానిని బట్టీ, శ్రీపతి ముగ్గురు పిల్లలు, వాళ్ళు పెళ్లి చేసుకున్న మరో ముగ్గురూ... పంచాయతీ లేవదీశారు... "ముప్పై ఏడూ ముప్పై ఎనిమిదేళ్ల "పాత"కొంపను కూలదోసి బహుళ అంతస్తుల ఆధునిక భవనం కట్టుకుని పంచేసుకుందామని"!

అది నగరంలోని స్థిరాస్తి విలువలు అతిగా పెరగడం వలన పెద్ద ఆస్తి అనిపించుకుంటుంది. రోజులెలా ఉంటాయో ఊహించడం అసాధ్యం గనుక, ఆ కుటుంబానికి సంబంధించిన ఆ పెద్ద ఆస్తి విషయం తేల్చేసుకోవడమూ ఉత్తమమే అని, ఆ ఆరుగురూ ఉమ్మడిగా భావించారు. శ్రీపతి భార్య ఆ విషయం తనకు సంబంధించని దానిగా తాటస్థ్యం వహించింది. మనిషి బతికుండగానే అతని నుంచి బాకీలు వసూలు చేసుకోవడం క్షేమదాయకం! ఎప్పటికైనా ఆస్తి దక్కవలసిన వాళ్ళ మనసు కుదురుగా ఉంటుంది! శ్రీపతి మిగిలిన జీవితమూ సుఖవంతంగా గడిచిపోతుంది. అధునాతన సౌకర్యాలను అనుభవిస్తూ, మేడమీది నుంచి అతనికి ఇష్టమైన సముద్రపు పోకడలు చూస్తూ! ఆ ఉద్యమనాయకుడే కొత్త భవనానికి ఎక్కువ పెట్టుబడి పెట్టడానికి, దాన్ని నిర్మించడానికి ముందుకొచ్చాడు.

తన పెట్టుబడి, వారసత్వ హక్కు ప్రకారం అందరికీ దక్కవలసిన వాటాలకూ అనుగుణంగా ఎవరికీ ఏది, ఎంత చెందాల్సిందీ ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఉన్న ఇంటిని కూలదోయడానికి గాని, అంత పెద్ద ఎత్తున ఆ నిర్మాణాన్ని చేపట్టడానికి గాని... శ్రీపతి తొలుత విముఖుడు! తన తదనంతరం మూడు భాగాలుగా ఆ స్థలాన్ని పంచుకోవడం అసాధ్యం కానప్పుడు లేదా వాళ్ళనుకుంటున్న పథకం ప్రకారం అపార్టుమెంటు కట్టుకుని పంచుకోడానికి భవిష్యత్తులోనూ వీలున్నప్పుడు... ఇప్పటినుంచే భాగాలు పంచుకొని వేరుపడటం ఎందుకూ అని అతని ఆలోచన! తాను బతికుండగానే తన కష్టార్జితాన్ని పంచేసుకోవడంలోని తొందరపాటుతనమే కాక, “నీ వయసు మీరింది కనుక ఎక్కువ కాలం మిగిలుండవు” అని చెప్పినట్టూ ఉంటుంది. ఆ విషయం చర్చకు వచ్చిన రోజులలో అతను సంపూర్ణ ఆరోగ్యవంతుడు. మరో దశాబ్దం బతికేలా ఉన్నాడు. కనీసం బతుకుతాను అనుకున్నాడు. ఇతరులతో ఏ వ్యక్తికైనా, ఏ అవసరం లేకపోయినపుడు, వయసు మీద పడినపుడు... ఈ లోకంలో అతను బ్రతకటం కేవలం అతని అవసరార్థమే అవుతుంది. ఆ సాధారణ సత్యాన్ని ఎరిగినపుడు దాన్ని భరించగలగాలి... భరించకా తప్పదు. వ్యతిరేక భావాలు ఘర్షణ పడుతున్నపుడు... రాజీ ఒకటే మార్గం. అది ఇరుపక్షాలలో బలహీనమైన ఒక పక్షం పడక తప్పదు. చివరకు రాజీ కానీ రాజీ పడ్డాడు శ్రీపతి! రెండేళ్లలో పూర్తవ్వాల్సిన నిర్మాణం, నాలుగేళ్ల పైన పట్టింది. అది అతనికి చాలా ఆందోళన కలిగించింది. నాలుగేళ్ళూ అద్దె కొంపలో గడపవలసి వచ్చింది. నూతన సదనం పూర్తవుతుండగా జబ్బున పడ్డాడు. రెండు బాధలతో సతమతమయ్యాడు. అద్దె ఇంట్లో మరణిస్తానేమోననిపించింది. చావడానికి ఏ ఇల్లయినా ఒకటే! ఎద్దు పుండు నెప్పి కాకికి పట్టదు. పడితే ముక్కుతో పొడిచి దాన్ని ఆరగించలేదు.

వేణు ఐదు నిమిషాల తరువాత వచ్చాడు.

“ఎలా ఉందంటావు భవనం?”

“భయపెడుతోంది.”

“అసూయా?”

“లేదు! కేవలం భయం.”

“దేనికి?”

“పైకెక్కితే పడిపోతానేమోనని!”

"భయానికి కేవలం అదే కారణమా?"

"అది కూడా!"

"భవనం కాకుండా ఇంకేమీ భయపెట్టటం లేదు కదా?"

"మరో భయమూ ఉంది. మృత్యుకౌగిలిలోని వ్యక్తిని చూడటానికి ధైర్యం కావాలి! నేను మానసికంగా కూడా బలహీనుడిని!"

లిఫ్టులో రెండో అంతస్తు చేరారు. పాల ప్యాకెట్లు పట్టుకున్న కుర్రాడు బజరు నొక్కితే, ఒక ఫ్లాటు తలుపు తెరుచుకుంది. అదే వెళ్ళవలసిన ఫ్లాటు. అరుపులూ కేకలూ లేవు గాని, ఇల్లంతా సందడిగా ఉంది పిల్లాజెల్లాతో! పెళ్లికైనా, చావుకైనా అలానే ఉంటుంది. రెండోదానికైతే వికవికలు, పకపకాలూ ఉండవు. తలుపు ముందే ఉండే డ్రాయింగ్ రూములోకి శ్రీపతి కూతురు గంభీరంగా ఆహ్వానించింది. మంచినీళ్ళ గ్లాసు ముందుంచింది. గాజు కిటికీలలో నుంచీ ఉదారంగు ఆకాశం, తూర్పు వైపు సముద్రం కనిపిస్తున్నాయి. గాలి ఒత్తిడి సముద్రం ఎదురుగా అధికంగా ఉంటుంది కనుక, కిటికీ తలుపులను తక్కువగా మూసి ఉంచారు.

రెండు నిమిషాల తరువాత, తండ్రి గదిలోకి వెళ్ళ వచ్చని శ్రీపతి కూతురు సైగ చేసింది. రమణ ముందు నడిచాడు, అతని వెనుక యోధుడిలా వేణు ఉన్నాడు. భావోద్రేకాలకు పరీక్షా సమయం అనిపించింది రమణకు. అర్ధశతాబ్దం పైగా పరిచయమున్న వ్యక్తికి... ఈ లోకం నుంచీ వీడ్కోలు చెప్పబోతున్నాడా తను? రమణ వంతు వచ్చినపుడు శ్రీపతి ఉండడు వీడ్కోలు చెప్పబోయే వాళ్లలో!

దక్షిణం వైపు తల ఉంచి కనపడని ఆలోచనలతో కిటికీలో నుంచీ ఉత్తరం దిక్కుకున్న జీవం లేని, కదిలించ లేని కొండను, తాకలేని ఆకాశాన్నీ, పీనుగ గుడ్డ పీలికల్లా ఆకాశంలో తేలియాడుతున్న కురవలేని మబ్బు తునకలను చూస్తున్నాడు శ్రీపతి! "దృశ్యమాన ప్రపంచంలో తాను ఎంత సూక్ష్మంగా ఉన్నా..." అని అనిపిస్తోందా, మిగిలిన క్షణాలు వేగంగా ఖర్చయిపోతున్నాయి అనుకుంటున్నాడా? రమణకు తన మరణ ఆగమనాన్ని తాను చూస్తున్నట్లనిపించింది. ఒడ్డు నుంచీ తాను మునగబోతున్న సముద్రాన్ని చూస్తున్నట్టుగా ఉంది.

దిండ్లను ఆనుకుని పడుకున్న శ్రీపతి పక్కగా వెళ్లి, అతను చూడగలిగేట్టు నిలబడ్డాడు రమణ. రమణ కుడివైపు కుర్చీలో శబ్దం చెయ్యకుండా కూర్చున్నాడు వేణు.

రమణ రాకకై ఎదురు చూస్తున్న శ్రీపతి, ఎండి పగిలిన పత్తికాయల్లాంటి కళ్ళు విప్పి, అతని మొహంలోకి చూసి, కుడిచేతిని ఎత్తి అందించాడు, ఎలాంటి భావోద్రేకం లేకుండా! దాన్ని తన రెండు చేతులతో పుచ్చుకున్నాడు రమణ. అది మెత్తగానూ, ప్రాణం చల్లారినట్టు అతి చల్లగానూ ఉంది. ఇద్దరూ ఆప్యాయతను ఇచ్చి పుచ్చుకున్నారు. తన వెచ్చటి హస్తాలు క్షణాల పాటైనా శ్రీపతికి ఊరటనిస్తాయనుకున్నాడు రమణ. ఊరటలకు ఈపాటికి అతీతుడయ్యాడేమో అని కూడా అనిపించింది. భావోద్రేకం అలలా లేచి కుదేలయింది రమణలో! శ్రీపతి అలాంటి దాన్ని అధిగమించుండాలి.

"బాగున్నావా?" గుసగుసలు పోవడం కన్నా కొంచం పై స్థాయి స్వరంతో అడిగాడు శ్రీపతి.

"బాగున్నా."

బాగా వినబడటానికి రమణ తాను కూర్చున్న ప్లాస్టిక్ కుర్చీని శ్రీపతి మంచానికి సాధ్యమైనంత చేరువగా తెచ్చుకున్నాడు, మోకాళ్ళను ఎడం చేసుకున్నాడు! వేణు వెనక్కు లాక్కుని తన కుర్చీని గోడకు ఆనించాడు. తరచూ ఆ ఇంటికి వస్తుండటం వలన, అతను శ్రీపతితో మాట్లాడటానికి ఏ విషయం లేదు. చూడటానికుంటుంది!

"పిల్లలు బాగున్నారా?"

"బాగున్నారు."

"ఎక్కడున్నారు?"

"చెన్నై, బెంగళూరు, హైదరాబాదు."

అతని ఒక కూతురు ఆ గదిలోకి వచ్చింది.. బహుశా ఆమె తండ్రిని ఎక్కువగా మాట్లాడిస్తారనో, అతను ఎక్కువగా మాట్లాడి ఇబ్బందికి గురి అవుతాడనో! రమణకు చెందినంత వరకు ఆమె అక్కడుండడం ఒక హెచ్చరిక కావచ్చు. దైన్యపు ముద్దలా ఉన్న శ్రీపతి ఎంతవరకూ ఓపిక అనుమతిస్తుందో.. అంతవరకూ స్నేహితులతో మాట్లాడటమే మేలు కదా అన్న అభిప్రాయంతో ఉన్నాడు రమణ. వాళ్లకు ఏ జాగ్రత్తలు కావలిస్తే వాటిని తీసుకునే హక్కుంది! ప్రశ్నించడానికి ఇతరులెవ్వరూ? శ్రీపతి మాట్లాడినపుడు రమణ తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలి. నివారించడం న్యాయం కాదు.

"నీ మొహంలో జీవకళుంది, కాకపోతే నాలుగయిదు రోజులు లంకణం చేసినట్టున్నావు."

అతను పెదవులు కదిపీ కదపకుండా చిరునవ్వు నవ్వాడు. తాను ఎలాగూ రేపో మాపో చనిపోతుంటే జీవకళ ఏమిటి అనో... ఆ మాటలు చీమ తలకాయంతన్నా విశ్వాసాన్ని కలుగచేసినందుకో! కూతురు సంతోషించుంటుంది అనుకున్నాడు రమణ. ఆమెకే తెలియాలి. మెప్పించడానికి రమణ అనలేదు.

భార్యా పిల్లలూ పుట్టెడు దుఃఖంలో ఉండుంటారు. కుతూహలం ఆపుకోలేకనో, అక్కడ కూతురి సామర్థ్యం సరిపోదనుకునో శ్రీపతి భార్య వచ్చి, ఒక ప్లాస్టిక్ కుర్చీలో నిండుగా కూర్చుంది తల వ్రేలాడేసుకుని! పెళ్లయి కొత్తగా కాపురం పెట్టినపుడు ఆమెను రమణకు పరిచయం చేశాడు శ్రీపతి. పచ్చటి శరీర ఛాయ, అందం, మంచితనం ఉన్నాయి ఆమెలో అప్పుడు! వయసులో కోతీ బాగుండవచ్చు. అందగత్తె వయసులో ఎక్కువ అందంగా కనబడుతుంది. "ఎక్కువగా పల్లెటూరు జీవితం గడిపి ఉన్న అమ్మాయిని ఎంపిక చేసుకున్నాడు శ్రీపతి" అని రమణ భావించాడు. అప్పుడే కాలం మూడు నాలుగేళ్లు తక్కువగా యాభై వైపు వెళుతోంది. "తెచ్చుకున్నామే" ఉండిపోతుంది. అతను ఆమె నుంచీ సెలవు తీసుకోబోతున్నాడు. కల, మాయ, నీటిబుడగ ఎప్పుడైనా ముగిసిపోవచ్చు!

"ఆయనకు మంచి నీళ్లు తాగినా... కడుపులో ఇమడడం లేదండీ, ఏది తాగాలన్నా గొంతే బాధ పెడుతోంది!" అనింది.

తలను పంకించి ఊరుకున్నాడు రమణ. శ్రీపతి భోజనప్రియుడు ఒకానొకప్పుడు.

"పాతరోజులు గుర్తుకొస్తున్నాయి. గోడేవారి వీధిలో మన కార్యాలయం ఉన్నపుడు, నాజ్ రెస్టోరాన్‌లో ఇరానీ చాయి తాగి, రేడియోగ్రామ్‌లో పాటలు వినేవాళ్ళం. వాడు ఎప్పుడూ "బహారో ఫూల్ బరఁసావో" అన్న పాట వేసేవాడు. శంకర్ జైకిషన్

లేరు, రఫీ లేదు ఇప్పుడు! ఫలహారం చెయ్యాలంటే పక్కనున్న అశోకా కేఫుకు వెళ్లేవాళ్ళం. ఆ వయసులో ఎగిరెగిరి బాల్ బాడ్మింటన్ బాగా ఆడేవాడివి. బలంగా ఉండేవాడివి!"

శ్రీపతి విచారంగా తల ఊపాడు. తానూ ఒక జీవితం జీవించాడని గుర్తుకు తెచ్చి ఉంటాయి రమణ మాటలు. చేజారిన క్షణాలను అనవసరంగా గుర్తుచేశాననిపించింది. జ్ఞాపకాలు గుబులు పుట్టిస్తాయి. జారిన మాటలు వెనక్కురావు.

మనుషులు తన నుంచీ దూరం కాకుండా ఎలా మాట్లాడాలో శ్రీపతికి తెలుసు! చాలా మంది మిత్రులను, పరిచయస్థులను సంపాయించుకున్నాడు. పొదుపరి, ఆస్తిపరుడు. వయసూ, శక్తీ వదిలేసిన అతను రోగం పాలూ, మంచం పాలూ అయిపోయాడు. ఇపుడు గత జీవితం కేవలం ఒక జ్ఞాపకం. ఇది గతానికి, వర్తమానానికి మధ్యన నిత్యం ప్రవహిస్తుండే వంతెన!

"శరీరానికి స్వీయ స్వస్థతాత్మక శక్తుంటుంది!" రమణ అన్నాడు.

శ్రీపతి తలను నెమ్మదిగా ఆడించాడు. మర్యాద గురించేమో... లేదూ తనకు అది వర్తించకపోయినా సత్యదూరం కాకపోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేయడమేమో... కాదూ, లేశమాత్రమైన ఆశవల్ల కావచ్చు!

"డాక్టర్ రఘునాథరావు గారికి చూపించారా?"

"ఆయన బాబా క్యాన్సర్ ఆసుపత్రిలో చూశారండి" శ్రీపతి భార్య చెప్పింది, మిగతా విషయాన్ని దాచి ఉంచి.

"చికిత్స గురించీ ఏమీ చెప్పలేదా?"

"కీమోథెరపీ చేస్తానన్నారు. మావారు వద్దన్నారు, దానివల్ల ఉపయోగం ఉండదు.. మరింత బాధ పడటం తప్ప అని!"

"ప్రసాద్‌గారికి అల్జీమీర్స్" శ్రీపతి అన్నాడు.

"ఊఁ" అర్థంకాక అన్నాడు రమణ.

"అతనికి ఏదీ గుర్తుండదట!" శ్రీపతి అన్నాడు.

"ఓ అల్జిమీయర్సా! పాపం" అన్నాడు రమణ మొహం చేదుగా పెట్టి.

ఎన్ని మాయరోగాలు, రుగ్మతలలో ఎంతటి సృజనాత్మకత, ఎన్ని రకాల హింస!

అవతలి వాడి జబ్బు, దాని గురించీ జాలి మాటనన్న వ్యక్తిలో ఎంతో కొంత భయాన్నీ క్షణికంగానైనా కలిగించకపోదు.

"మానసిక శ్రమ, ఒత్తిడీ, ఆందోళన వయసు మళ్లుతున్నపుడు అధికమైతే వస్తుందంటారు. ప్రపంచంలో కోట్లాది మంది రోగులు. మందు లేదు." వేణు అన్నాడు.

"ఏ జబ్బూ సోకని శరీర భాగం లేదేమో!" శ్రీపతి అన్నాడు కాళ్ళు పూర్తిగా జాపుకుంటూ.

"కొంచం పైకి పడుకోబెట్టమంటారా?" భార్య అడిగింది.

వద్దని సైగ చేశాడు.

"ఆ మధ్య శర్మగారి పూజా కార్యక్రమంలో చూశాను మిమ్మల్ని! చాలా సన్నగా ఉన్నారు అప్పుడు.." శ్రీపతి భార్యనుద్దేశించి అన్నాడు రమణ.

"హెపటైటిస్." శ్రీపతి చెప్పాడు.

"మిమ్మల్ని చూసి ఇరవై ఏళ్ళయుంటుంది. ముందు మిమ్మల్ని గుర్తు పట్టలేకపోయినాను!" ఆమె అనింది ఇంతకు ముందు రమణను సరిగ్గా పలకరించనందుకు సంజాయిషీలా.

"తల నుగ్గు బుట్టయింది కాలం సిద్ధంగా ఉండు అని చెబుతున్నట్టు. సళ్ళిన చర్మం ముడతలు పడుతోంది!"

"ఇప్పుడే బాగున్నావు!" శ్రీపతి అన్నాడు చిరునవ్వుతో.

అతను చిరునవ్వు నవ్వటం... తల్లీ కూతుళ్ళకు సంతోషాన్ని పూయించినట్టుంది.

"శ్రీపతి! నిన్ను శ్రమ పెట్టినట్టున్నాను అధికంగా మాట్లాడి..." ఉన్నట్టుండి లేచి అన్నాడు రమణ.

దాని గురించే ఎదురుచూస్తున్నట్టు వేణు లేచాడు.

"వాళ్లకు కాఫీ ఇవ్వు." అన్నాడు శ్రీపతి.

ఒద్దందామనుకుని, ఊరుకుని, తిరిగి కూర్చుండిపోయాడు రమణ. ఈ అవస్థలో ఉన్న అతని మాటను తిరస్కరించడం ఎందుకనిపించి!

కూతురు అలా వెళ్లి, ఇలా తెచ్చింది. పరామర్శకు వచ్చిన వాళ్ళు అంతసేపు ఉండటం ఆమెకు ఇష్టం లేదు. కొన్ని తప్పని అనుభవాలు ఉంటాయన్న విషయం, కొంత కాలం పోతే గ్రహించి సమాధాన పడటం నేర్చుకుంటుంది. పరామర్శ సులువైన పని కాదు. అది చేసేవాళ్ళనూ ఇబ్బంది పెట్టేదే! లాంఛనంగా మారిపోయినా పరామర్శ అవసరమే. రోగులు, కావలసిన వ్యక్తులూ కోరుకునేది.. ఏ స్వస్థతనూ కలిగించక పోయినా... విషాదం, జాలి అంతర్లీనంగా ఉండేదే!

"త్వరగా కోలుకో... మళ్ళీ వచ్చి నిన్ను చూస్తా!" అన్నాడు రమణ లేచిపోతూ.

వేణు తన చేతిని తిరిగి అందించాడు కలిలంలోకి జారి కూరుకుపోతూ పైకి లాగడానికిచ్చినట్టు! రెండు చేతులతో దాన్ని ఆప్యాయంగా నొక్కి మంచం మీద ఉంచాడు.

"ఇల్లు చూసి వెళ్ళవోయ్!" అన్నాడు శ్రీపతి.

రమణ మిత్రుడి మొహంలోకి చూశాడు రెండు మూడు క్షణాలు. వెంటనే తేరుకున్నాడు.

"ముందే కొంత మేరకు చూశాను, మిగిలినది చూసి వెళతాను. చాలా అధునాతనంగా ఉంది. అభినందనలు!"

అతను తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు. గర్వంతో కూడిన ఆనందం కూడా ఉండుంటుంది మనసులో.

అతని భార్య ఇల్లంతా చూపడం మొదలు పెట్టింది ఉత్సాహంగా! శ్రీపతి ఉన్నగదికి ఎదురుగా ఒక విశాలమైన పడకగదుంది. ఆంగ్ల అక్షరం ఎల్ ఆకారంలో సిట్టింగ్‌రూము. మూడో పడకగదిలో అల్లుడు వగైరాలుండటం వలన దాన్ని చూడలేదు. వంటగది పొడవుగా, వెడల్పుగా నలుగురు ఒకేసారి పనిచేయడానికి వీలుగా ఉంది. ఇతరుల ఇళ్లలోలా గ్రానైట్ ప్లాట్ఫారం. వంటగది ఎదురుగా భోజనాల గది. సిట్టింగ్‌రూము సముద్రం వైపున్న కిటికీల రెక్కలలో ఒకటి తెరిచి చూపింది ఆమె. బాల్కనీలోకి దారితీసే తలుపు కొంచెంగా తియ్యంగానే సముద్రపు గాలి ఒక్కసారిగా, ఎదురుచూసేట్టు చేసినందుకు

కోపంగా లోపలికి జొరబడింది. ఆమె తలుపు తెరచి, బాల్కనీలోకి వచ్చి నిలబడింది రమణతో బాటు. సముద్రం అనంతంగా పరుచుకుని ఉంది మోహంలా, చావులా... ఆకాశంతో ఎప్పటికీ వీడిపోని కాపురం చేస్తూ! ఇంటి ముందున్న వెడల్పాటి రహదారికి అవతలి వైపు కొబ్బరితోట, ఆపైన బీచి!

విషయ ప్రపంచాన్ని కృష్ణసర్పంతో పోల్చాడు శంకరాచార్య. "ఈ విషం శరీరంలోకి జొరబడక్కరలేదు.. దాన్ని చూస్తేనే మనలను నిర్మూలిస్తుంది" అన్నాడు. ఆ మాటలను బట్టి కృష్ణసర్పంతో కలిసి కాపురం చెయ్యడమే జీవితం అని కూడా అనుకోవాలి. కనీసం విషయవాంఛను తగ్గించుకునే వీలుంది. సృష్టియావత్తు విషయమయమే!

తన మునుపటి ఇంటి డాబా మీదికెక్కి పడకకుర్చీలో కూర్చుని ప్రకృతిని పరికిస్తుండేవాడు శ్రీపతి. మరికొంత కాలం జీవించడమనే కొసరు ఉండదు... జీవించడం బేరం కాదు కనుక!

"ఇల్లు చూసి వెళ్ళవోయ్" అన్న శ్రీపతి మాటలు మనసులో ప్రతిధ్వనిస్తున్నాయి.

"అద్భుతం... అన్నానని శ్రీపతికి చెప్పండి!"

ఆమె కూడా సంతోషించినట్టు కనిపించింది.

ఇరువురూ రోడ్డు మీదికి వచ్చారు. తల బాగా పైకి ఎత్తి శ్రీపతి ఇంటిని చూశాడు రమణ.

"మోహకలిలం అంటే వస్తు వ్యామోహం "ఊబి" అని గీత అంటుంది. నాలుగయిదు రోజులలో చనిపోతాడని శ్రీపతికి తెలుసా?" రమణ అడిగాడు.

"ఎందుకు తెలీదు?"

"ఇల్లు చూసి వెళ్ళవోయ్ అన్నాడు ఈ ఆఖరిక్షణంలో కూడా! ఆ మాటలు నాకు అద్భుతంగా తోచాయి."

"రెండు మూడు రోజులలో తాను చనిపోతాను అని తెలిసినపుడు వదిలేసేవాటి పట్ల మమకారం అధికమవుతుంది. ఆ భవనం అతనికి సంతోషం, గర్వం కలిగిస్తుంటే వాటిని అనుభవించడం తప్పా?"

వేణుకు సమాధానం చెప్పలేదు రమణ.

గంటకల్లా ఇల్లు చేరి వాట్సాప్ మెసేజి పంపాడు రమణ.. "త్వరగా కోలుకుంటావని ఆశిస్తున్నా!"

సమాధానం వచ్చింది. "కృతజ్ఞుడిని."

నాలుగురోజుల తరువాత శ్రీపతి పోయాడు. అతడు ఇచ్చిన సమాధానం మూడు నెలల పాటు ఉంచుకుని, అప్పుడప్పుడూ చదివి తరువాత చెరిపేశాడు రమణ!

# గుడ్డి పిల్ల

కీ. శే. అడివి బాపిరాజు

**కథా మార్గదర్శి కథ**

*"నీకూ నీ వారు లేరు నాకూ నా వారు లేరు*
*ఏటి ఒడ్డునా ఇల్లు కడదాం పదరా–"*
*ఆ పాట అమృతమయంగా ఆ చీకట్లో వ్యాపించింది. కాల్వ నీళ్లు నిర్మలంగా ప్రవహించినై.*
*"నాకు పెళ్లి లేదు. నేనూ ముష్టి వాడినే. మనం ఇద్దరం ఎందుకు పెళ్లి చేసుకోకూడదు?"*
*ఆ అమ్మాయి ఆలోచించుకుంటూ ఉంది. వేయి ఆలోచన్లు పోయాయి. ఒళ్ళు ఒణికింది. అప్రయత్నంగా అతని దగ్గరకు జరిగింది.*

తాడేపల్లిగూడెం స్టేషన్లో ఎక్కింది ఆ బాలిక.. బెజవాడ బండి! కూడా ఒక చిన్న పిల్లవాడు ఆ బాలిక చేయి పట్టుకుని దారి చూపుతూ ఉన్నాడు. చినిగిపోయిన గుడ్డల్లో మేఘాల్లో చంద్రుడిలా ఉంది ఆమె. ఆమె అందం ఆమెకే తెలీదు.

"వినవే పల్లవా మృదూచరణా

కరుణా–విత రాణా గూణాభరాణా!"

అని పల్లవి ప్రారంభించింది. ఒక్కసారిగా పెట్టె అంతా నిశ్శబ్దం ఆవరించింది. విరిసిన వసంతోదయంలో మల్లికాపుష్ప సుగంధంలా ఆ కిన్నెర స్వరం.. మహా వేగంతో పరిగెత్తుతున్న రైలు హోరు శృతి కాగా, ఆ పెట్టె అంతా ప్రవహించింది.

"జన విభు డానాతిచ్చిన దండాకాటవికి... "

అందరి హృదయాలు కదిలిపోయినవి. కొండచిలువ పెనవేసుకున్న జింకల్లా, చైతన్యం రహితమై వింటున్నారు యావన్మందిన్నీ.

"ముని వేషధారినై చనియేద ననా వీని.."


ఎవరి భావగాంభీర్యం ఎంత ఉందో ఆ లోతు వినీలమై, వినిర్మలమై కాంతి దాల్చింది.

ఆమె తలముడి కంగారుగా విడిపోయి, నీరులేని మేఘంలా చెదిరి ఉంది. కళ్ళు చూస్తూ ఉన్నట్లే ఉన్నవి కానీ, సంజ్ఞాజ్ఞానరహితాలై ఎండిపోయిన చెరువుల్లా మెరుస్తున్నవి. తీర్చిదిద్దిన కనుబొమ్మలు, సమమైన ముక్కు, చిన్న నోరు, వణికే పెదవులు ఆమె మొహాన సుందరశ్రీ సాక్షాత్కరింప చేస్తూ ఉన్నవి.

ఆమె పాట ఒక సెలయేరులా మర్మరించింది. రాళ్లగుట్టలో జలజలలాడింది. సుడిగుండాలు చుట్టింది. చెట్ల నీడ సమతలంలో పోయింది. ఆగింది, ఒక బండరాయి కింద మాయమై, ఆవతల తిరిగి ప్రత్యక్షమైంది.

ఆ గానం శ్రావణమాసపు పచ్చికలా అల్లుకుపోయింది. శరదృతు పుష్పాలై వికసించింది. నవవసంతం వల్లే ఆనందపర్వమై పోయింది.

అప్పుడే ఒక స్టేషనులో ఎక్కాడు ఒక బ్రాహ్మణోత్తముడు. వచ్చీరాగానే ఆ పాటకు అడ్డం వస్తూ, ఒక హాస్యవచనం అన్నాడు. ఆత్మానందం మానవాతీతం కాబట్టి లోతు నీళ్లల్లో మునిగినవాళ్లల్లా మనుషులు ఆ ఆనందం అట్టేసేపు భరించలేరు. ఈ హాస్యవచనం ఒక్కసారిగా ఆ పెట్టెలో ఉన్న మానవలోకానికి నిట్టూర్పు ఇచ్చింది.. తెప్పరిల్ల చేసింది. ఆ బాలిక పాట మానివేసింది.



కొత్తగా వచ్చిన హాస్యకాడు.. జబ్బు హాస్యంతో ప్రారంభించాడు. తనకు తగని జబ్బన్నాడు. అది తిండి జబ్బు. భోజనానికి వేడితే మగపెళ్లివారికి చేసిన శాక పాకాలన్నీ తన విస్తట్లోనే మాయమౌతూ ఉండేవిట. వైద్యుడు ఇది 'మహా రోగం' అన్నాట్ట. దానికి ఉదయాన్నే మినపసున్ని తాటికాయలంత మాత్రలు చేసి, ఒక శేరు తేనె పాకం అనుపానంగా ఒక డజను సేవించమన్నాట్ట!

ఇత్యాది హాస్యంతో కోమటి హాస్యం, బాపన హాస్యం, గొల్ల హాస్యం, బుడబుక్కల హాస్యం, కుక్క కూతలు, నక్క కూతలు కుప్పేసాడు. ఆ రైలుపెట్టెలో మనుషులు విరగబడి నవ్వారు. కళ్ళ వెంబడి అందరికీ నీళ్లు కారినై. డొక్కలు నొక్కుకున్నారు. ఒకళ్ళ మీద ఒకళ్ళు పడ్డారు. ఎంత హాస్యాని కన్నా చిరునవ్వులు మాత్రం వెదజల్లుతుంది హిందూ స్త్రీ జనం. అక్కడ ఆడవాళ్లు ఒళ్ళు మరచి నవ్వు పొంగుల్లో ఊగిపోయారు.

అక్కణ్ణుంచి డబ్బు వసూలు చేయడం ప్రారంభించాడు. కాన్లూ, అణా కాసులు, అర్ధణాలు, రెండణాల కాసులు గళగళ అతని హస్తంలోకి ప్రవహిస్తూ అక్కడే మాయమయ్యాయి. అతగాడు కొంచెం 'గుంటుపల్లి భాస్కరుడి' ఇంద్రజాలం కూడా ఎరుగున్నవాడిలా కనపడ్డాడు. ఒక పన్నెండణాలు దాకా పోగుబడింది కాబోలు... అదంతా 'హూత్' అని తెల్లబోయి చూస్తూ ఉన్న ఒక కుఱ్ఱవాడి లాగులోంచి గలగల రాలించాడు. 'అమ్మ దొంగా' అన్నాడు. పెట్టె అంతా ఘొల్లుమని నవ్వింది.

"మీరు చల్లగా ఉండాలి. నేను పచ్చగా ఉండాలి. మీ ధాన్యాలు నా గాది నిండాలి. మీ నవ్వులోంచి ధనవర్షం కురియాలి. జయా విజయీభవ! దిగ్విజయీభవ!! మీరెప్పుడూ రైలు ప్రయాణం చేస్తూ ఉండాలి. బాబూ, సెలవండి!" అని తర్వాత స్టేషన్లో దిగిపోయాడు. వేరే పెట్టె ఎక్కినాడు కాబోలు!

ఇంతసేపు ఆ గుడ్డిపిల్ల నిర్ఘాంతపోయి నిల్చున్నది. అప్పుడప్పుడు ఆ వేళాకోళం మాటలికి చిరునవ్వు నవ్వుకుంది. కూడా ఉన్న ఆ పిల్లవాడు పకాలున నవ్వుతూ ఉన్నాడు హాస్యం పొడుగునా!

ఆ బాలిక గొంతుకు సవరించుకుంది.

"ఎంతనీ వేడినా ఎక్కడా ఉందువో కంతు జనక రామా!" అని హాయిమనే కృతి ఒక్కటి ఆలాపన చేసింది.

ఆ హాసిగాడి మాటలే పక్క ఆయనకి జ్ఞాపకం చేస్తూ విరగబడి నవ్వుకుంటూ ఉన్న ఒక ముసలి కమ్మాయన "వుస్.. పిల్లా, ఉండు" అన్నాడు.

ఆ బాలిక అల్లాగే నిలుచుండిపోయింది. ఆ పసిపాప డబ్బు అడగడానికి వస్తే 'ఛీ పో', 'ముట్టుకుంటావు', 'చిల్లర అయిపోయిందిరా' అని వరసగా అంటూనే ఉన్నారు.

ఆ బాలిక అలాగే చైతన్య రహితంగా నిల్చునే ఉంది. రైలు కదిలిపోతూనే ఉంది.

ఆరు కాన్లు వసూలయ్యాయి. ఆ అంధ బాలిక జ్ఞానశూన్యాలైన కళ్ళల్లో వేడి నీళ్లు తిరుగుతూనే ఉన్నవి. ఆమె నిర్మల హృదయం మాట లేని ఏడుపులో సుడి తిరిగింది. పిల్లవాడు వచ్చి అణాన్నర ఆ బాలిక చేతుల్లో పెట్టినాడు. ఆమె మొహం వంక తేరిపార చూశాడు. ఆమె చేయి పట్టుకున్నాడు. వాడి లేత మనస్సు చివుక్కుమంది. వాళ్ళిద్దరకూ ఒకళ్ళ హృదయం ఒకళ్ళకి విస్పష్టమే. ఇద్దరు ఒక తలుపు మూల ఇరికి కూలబడ్డారు.. ఒదిగిపోయారు. చూపులేని ఆ బాలిక కళ్ళు, చూపు పుట్టని ఆ పిల్లవాడి హృదయం ఒకటికొకటి ఆలింగనం చేసుకున్నవి. ఆ బాలకుడు కంటినీరు ఆ బాలిక చేతులు అద్దుకుని ఆపుకోలేకపోయాడు.

బాలిక పాట ప్రారంభించక పూర్వమే ఒక వ్యక్తి ఆ రైలు పెట్టి ఎక్కాడు. అతడూ రైలు బిచ్చగాడే. ఒక చెయ్యి లేదు. ముప్ఫై ఏళ్ళుంటాయి. చింకి గుడ్డా, చిరిగిపోయిన చొక్కాతో, ఒక పిల్లంగ్రోవి ఎడం చేత్తో పట్టుకొని రైలు ఎక్కాడు. అప్పుడే ఆ బాలిక తన దివ్యగానం ఆలాపన చేసింది. తరువాత జరిగిన కథ అంతా చూస్తూనే ఉన్నాడు.

ప్రపంచం అంటే కోపం గల మనిషి... వెనుక రైల్వే పోర్టరుగా ఉండి, రైలు కింద పడిపోయి చేయి పోగొట్టుకున్నాడా బిచ్చగాడు. నా అనేవారు లేకుండా ఉండేవాడు. జీతంలో వచ్చిన నాలుగు రాళ్లు మిగుల్చుకుంటూ, గూడ్సు స్టేషనులో అప్పుడప్పుడు దొంగతనం చేసిన వస్తువులు అమ్మగా వచ్చిన డబ్బూ, రైలు లోంచి దిగిన ప్రయాణికుల సామాను మోయడం వల్ల వచ్చిన కూలి, టిక్కెట్టు లేని వాళ్లను ఇంజను దగ్గర నుంచో, గార్డుపెట్టె దగ్గర నుంచో పోనిచ్చినందుకు లంచం, మామూళ్ళు, అంతా కలిపి నూరు రూపాయలు మూట కట్టాడు. ఇంతట్లో చెయ్యి పోయినందుకు రాజమండ్రీ రైల్వే ఆసుపత్రిలో మూడు నెలలు ఉన్నాడు. అప్పుడు తన ఇంటిలో దాచుకున్న డబ్బు ఎవ్వరో మటుమాయం చేశారు. ఉద్యోగం పోయింది. పెళ్లి లేదు. దానితో అతనికి మతిపోయింది. దిక్కులేని వాడికి దేవుడు కాదు, తిరిపమే దిక్కు. బిచ్చగాళ్లకు కొందరు గురువులు ఉంటారు. అతని దగ్గర ఉన్న పిల్లంగ్రోవిని మాంచి బాగా ఊదడం, అందు మీద వేదాంతం పాటలు, భక్తి పాటలు పాడడం నేర్చుకున్నాడు. రైలు బిచ్చం సాగించాడు. రైలేగా ద్రోహం చేసింది. ఆ వచ్చిన డబ్బు కాఫీ హోటల్లో తినడం, కళ్ళు పాకల దగ్గిర గౌళ్ళ పుల్లమ్మ కూతురు పోసే 'ధవళ సుధారసం' గళగ్రాహంగా సేవించి, సింధూరా నిమిషత్వం, మహాయోగంలో మైకం సంపాదించి అమరుడౌతూ ఉంటాడు.

అలాంటి వాడు ఆ గుడ్డిపిల్ల పాట విన్నాడు. ఆతని మొఱకు మనస్సు గాలిలో ఊగిపోయింది. దోహదం చేసిన మొండిచెట్టు వికసించినట్లు చిగురు దాల్చింది. ఏ ఆవేశమూ అతనికి తెలియదు, అతనికి కళ్ళ నీళ్ళు తిరిగినై! మనుషుల చంచలత్వమూ, కఠినత్వమూ అతనికి అసహ్యం వేసింది. ఎవ్వరూ లెక్క చేయకుండా ఆ గుడ్డిపిల్లను నిరసించగానే, అతడు ముట్టె వంచిన కారుదున్న అయిపోయినాడు. తాను పొద్దుట్నుంచీ పోగుచేసుకున్న ఆరణాల డబ్బులూ ఆ అమ్మాయి చేతిలో వేసి రైలు ఆగగానే దిగి చక్కాపోయాడు. ఆ అమ్మాయికి ఇంత డబ్బు ఎవరిచ్చారో తెలవలేదు. "దేవుడులాంటి దయగల ప్రభువు ఎవరిచ్చారో!" అనుకున్నది.

ఆ గుడ్డిపిల్లకు జ్ఞానం వచ్చినప్పటి నుంచి ఇలా ముష్టి ఎత్తుకుంటూ రైలు ప్రక్క గ్రామంలో ఒక బహు కుటుంబీకుడు, మంచి అంతఃకరణ గల ఒక రైతు ఇంటిలో ఒక పంచను ఉంటూ ఉండేది. ఊళ్లో ఒక పెద్ద సంసారి బాలికకు సంగీతం నేర్పిస్తూ ఉంటే, వీధి వాకిట్లో కూర్చుని సంగీతం చెవులారా వినేది. ఏకలవ్యుడుగా అద్భుతమైన గానవిద్య సంపాదించుకుంది. ముష్టి బాగా వచ్చేది. ఆ డబ్బు "మహా ఇల్లాలైన" రైతు భార్యకు దాచ ఇచ్చేది.

పెద్దదవుతూన్న కొద్దీ ఏదో భయం సిగ్గు కలుగుతూ ఉండేది. ముష్టికి తిన్నగా వెళ్ళక ఇదివరకు పోగు చేసుకున్న డబ్బులు ఖర్చు చేసుకుని గంజి కాచుకుంటూ ఉండేది. తల్లి ఎవరో, తండ్రి ఎవరో ఎల్లా ఆ రైతు ఇంట్లో చేరిందో ఆ పిల్లకు ఏమి తెలియదు.

ఒకరోజున చేబ్రోలు ముష్టికి పోయి మధ్యాహ్నం కాల్వ గట్టున వంట చేసుకుంటూ ఉండగా ఒక పసిపిల్లవాడు మూడేళ్ల వాడు ఆ అమ్మాయి దగ్గరకు వచ్చాడు. ఎక్కణ్నుంచి వచ్చాడో. ఆ గుడ్డిపిల్ల అతన్ని ఒళ్ళోకి తీసుకుంది. అప్పటి నుంచి వాళ్ళిద్దరూ ఒక తల్లి కడుపున బిడ్డల్లా అయ్యారు. అతడు దారి చూపించడం, ఆమె పాట పాడడం.. అల్లా నాలుగేళ్లు గడిచినై!

ఆ రోజు సాయంత్రం కాల్వ గట్టున వంట చేసుకుంటూ ఉంది. పిల్లవాడు చితుకులు ఏరి తెచ్చి ఇస్తున్నాడు. ఆ సమయంలో ఆ సంధ్యారుణ కాంతుల్లో ఒక పురుషుడు ఆ చెట్టు కిందకి వచ్చాడు. అతని మోహం చిరునవ్వు నవ్వుతూ ఉంది. కళ్ళులేని ఆ కబోది చెవులు, శరీరం, యావత్తూ అతి సున్నితమైన గ్రహణశక్తి సంపాదించుకున్నవి. ఆ కొత్తమనిషి రాక కనిపెట్టింది.

"ఒరే ఎవరురా ఆ వచ్చింది?"

ఆ పిల్లవాడు ఆ మనిషి దగ్గరకు పరిగెత్తుకుని వెళ్ళాడు. అతని కుంటి చెయ్యి చూశాడు. పిల్లంగ్రోవి చూశాడు.

"ఆ రోజు మనిషి."

ఆ పిల్ల గ్రహించింది. ఆమె తెలతెల పోయింది. గుండె కొట్టుకుంది. తల వాల్చుకుని వంట చేస్తూనే ఉంది.

ఆ మనిషి పిల్లంగ్రోవి తీశాడు.

"ఏదిరా లక్ష్మణ సీత

పర్ణశాలలో లేదెంతు శాత?"

అని పాట పాడినాడు. ఆ తేనెచుక్కల ధ్వని ఆ సంధ్య అంతా ఆక్రమించుకుంది. ఆ పిల్లవాడు అతని దగ్గరగా జేరి మొహం చూస్తూ కూచున్నాడు. ఆ అమ్మాయి వంట చేస్తూనే ఉంది.

"రారోరి చిన్నవాడా మా వాడా

రారోరి చిన్నవాడా–"

చీకట్లు పూర్తిగా అలుముకు వస్తూ ఉన్నవి. నక్షత్రాలు మినుకుమినుకు మంటూ ఆకాశాన్ని అలంకరించాయి.

"ఎందుకైనా వ్రుంచినావూ బ్రంధికానాలో రామయ్య తండ్రీ–"

ఆ బాలిక వంట పూర్తి అయ్యింది. నిప్పులు ఆర్పేసింది. బిచ్చగాడు ఆమె దగ్గరగా పోయి కూర్చున్నాడు.

ఎడం చేయి మొండిది. అది పిల్లంగ్రోవికి నొక్కుతూ కుడిచేతి వేళ్ళతో ఊదుతాడు.

"నీకూ నీ వారు లేరు నాకూ నా వారు లేరు

ఏటి ఒడ్డునా ఇల్లు కడదాం పదరా–"

ఆ పాట అమృతమయంగా ఆ చీకట్లో వ్యాపించింది. కాల్వ నీళ్లు నిర్మలంగా ప్రవహించినై.

"నాకు పెళ్లి లేదు. నేనూ ముష్టి వాడినే. మనం ఇద్దరం ఎందుకు పెళ్లి చేసుకోకూడదు?"

ఆ అమ్మాయి ఆలోచించుకుంటూ ఉంది. వేయి ఆలోచన్లు పోయాయి. ఒళ్ళు ఒణికింది. అప్రయత్నంగా అతని దగ్గరకు జరిగింది. అతని మొహం తడిమింది. దేహం తడిమింది. ఆ మనుష్యుడికి ఒళ్ళు జలదరించింది. ఆ చింపిగుడ్డ అమ్మాయి అప్సరసలా తోచింది. తన జీవితం జ్ఞాపకం వచ్చింది. ఒక గుడిలో దేవతకడ మోకరించిన భక్తుడయ్యాడు. ఆ బాలికను గట్టిగా తన గుండెకు అదుముకుందామనుకున్నాడు. చూపులేని ఆ కళ్ళు చూసి కళ్ళ నీళ్లు నింపుకున్నాడు. ఆ బాలిక అతని తల నిమిరింది. కళ్ళు తుడిచింది. అతని గుణగణాలు ఎలా అర్థమయ్యాయో!

"ఆ పిల్లవాడు నాకు తమ్ముడు. చిన్నతనాన్నుంచి పెంచుకున్నా."

"నాకూ తమ్ముడే, నా బిడ్డడే అవుతాడు. ఇక్కణ్ణుంచి నేను పెంచుకుంటా."

ఆ నక్షత్రాలే సాక్షిగా, ప్రక్కన ప్రవహించే గోదావరినీరు సాక్షిగా వాళ్ళిద్దరూ ఆ శుభముహూర్తంలో భార్యాభర్తలయ్యారు. ఒకళ్ళ కౌగిలింతలో ఒకళ్ళు కలిసిమెలిసి కరిగిపోయారు. ఆ పసిపిల్లవాడు హృదయంతో "తథాస్తు" అని నవ్వుకున్నాడు.

# తెలుగు సాహిత్యము
## శతకములు

**మోచర్ల అనంత పద్మనాభరావు**

మన తెలుగుజాతి, తెలుగుభాష గర్వపడేలా చెప్పుకునే సాహిత్యప్రక్రియలు రెండు. ఒకటి అవధానం, రెండవది పద్యశతకం. ప్రపంచంలో మరే భాషలలో లేని ఈ ప్రక్రియలు మన తెలుగుభాషకే సొంతం. అవధాన ప్రక్రియ సాధారణంగా పండితులకు, కవులకు పరిమితమైనది. శతక ప్రక్రియ మాత్రం సామాన్యులకు, పామరులకు, పిల్లలకు సులభంగా అర్థమయ్యే శైలిలో నీతిపలుకులను పద్యములుగా చెప్పిన సాధనముగా గుర్తించబడినది.

శతకము అనగా వంద అనే అర్థం. తెలుగు సాహిత్యప్రక్రియలో కొన్ని శతకములు నూట ఎనిమిది పద్యములు వ్రాయబడినట్లు తెలియుచున్నది. అక్షరక్రమంలో, పెద్ద సమాసములు, సంస్కృత పదములు లేకుండా, ఒకే మకుటంతో వ్రాయబడిన సాహిత్యవిన్యాసమే శతకం అని చెప్పవచ్చును. నీతి, నడత, నడవడి, గుణము అనే ప్రధానమైన శాస్త్రములను పామరుల, పిల్లల మనస్సుల లోకి చొచ్చుకునే విధంగా శతక రచన సాగింది.

తేటతెల్లమైన, స్వచ్ఛమైన, సులభమైన భాషలో రచించిన మొదటి శతకము క్రీ.శ.1200 లోనే వచ్చినట్లుగా సాహిత్యకారులు చెప్తున్నారు. మానవజీవితంతో ముడివడిన నీతి, భక్తి, వైరాగ్యం మరియు వేదాంత శాస్త్రముల నుద్దేశించి శతకరచన కొనసాగిందని కూడా చెప్పవచ్చును. తెలుగుభాషలో ఇతర కావ్య, సాహిత్య ప్రక్రియలు పండితులకు మాత్రమే పరిమితమైనా, శతకసాహిత్యం అత్యంత ప్రజాదరణను పొంది, పామరులకు పండితులకు వారధిగా నిలిచినది.

బద్దెన కవి రచించిన "సుమతీ శతకం" మొదటి శతకంగా చెప్పవచ్చును. ఈ శతకంలోని పద్యములు సరళమైన, సామాన్య జనం మాట్లాడుకునే సొంపైన భాషలో సుమతీ అన్న మకుటంతో రాగయుక్తంగా రచించబడినవి.

సుమతీ శతకం తర్వాత అంతగా జనబాహుళ్యానికి దగ్గరైన శతకం వేమన శతకం. 'విశ్వదాభిరామ వినుర వేమ' అన్న మకుటంతో ఈనాటికీ ప్రజల హృదయాలలో స్థానాన్ని పదిలపరుచుకున్న శతకంగా వేమన శతకాన్ని ఉదహరించవచ్చు. అనేక సందర్భాలలో పామరులు కూడా ఈ రెండు శతకాలలోని పద్యాలను అవలీలగా ఉదహరించడం మనం గమనిస్తూంటాం.

శ్రీ కంచెర్ల గోపన్న 'దాశరథీ కరుణాపయోనిధీ' అన్న మకుటంతో రచించిన దాశరథి శతకం, నృసింహ కవి 'కృష్ణా' అన్న మకుటంతో రచించిన కృష్ణ శతకం, ధూర్జటి కవి 'శ్రీ కాళహస్తీశ్వర' అన్న మకుటంతో రచించిన శ్రీ కాళహస్తీశ్వర శతకం కూడా ప్రసిద్ధిగాంచిన శతకములుగా చెప్పవచ్చును. ఇప్పటికి 5000 పై చిలుకు శతకములు మన భాషలో రచించినట్లు ఆధారములున్నవి.